


# మహామాయ

## అంతర జగత్తుతో ఆఖరి పోరాటం

కల్నల్ టి . శ్రీనివాసులు

అనేక ప్రపంచ భాషలలో ప్రచురింపబడిన “పరాశక్తి”

రచయిత కలం నుండి వెలువడిన ఎనిమిదవ రచన.

"ది ఇల్ల్యూషన్" ఆంగ్ల గ్రంథానికి  తెలుగు అనువాదం.

Copyright © 2020 T Sreenivasulu

All rights reserved.

www.sahajananda-ashram.com

# అంకితం

నా గురుదేవులు పరమ పూజ్య శ్రీ స్వామి సహజానంద తీర్థుల వారికి



పరమ పూజ్య శ్రీ స్వామి సహజానంద తీర్థుల వారు. ఆయన 85 ఏళ్ల
వయస్సులో ఉన్నపుడు 2009వ సంవత్సరంలో తీసిన చిత్రం

# విషయ సూచిక

ఒక  యోగి సింహనాదం

కృతజ్ఞతలు

ఉపోద్ఘాతము

ముందుమాట

సృష్టి నిర్మాణం

సృష్టి రచనా క్రమం

మస్తిష్క వ్యవస్థ మీద భ్రమ ఉత్పత్తి

అహం బ్రహ్మాస్మి

సమయము – దూరము యొక్క  భ్రాంతి

అసంపూర్ణ ప్రపంచం

శబ్ద ప్రపంచం– అర్ధ ప్రపంచం

సిద్ధులు

ఆధ్యాత్మిక విషయాలలో గురువు యొక్క ముఖ్యపాత్ర

బ్రహ్మాచర్యం,  సన్యాసం మరియు వైరాగ్యం

చివరిమాట

పదకోశం

శక్తిపాత్ పరంపర యొక్క ఆశ్రమములు

శక్తిపాత్ గురు పరంపర

రచయిత గురించి

# ఒక యోగి సింహనాదం

వేయి దేవతలు నా దారిని అడ్డుకొను గాని!
వేయి అప్సరలు నన్ను క్రింద పడవేయు గాని!
వేయి జబ్బులు నా గమనమును తగ్గించు గాని!
వేయి ఆటంకములు నాశ్రద్ధను ముక్కలు చేయు గాని!

వేయి భయములు నన్ను వెను దిరగమని హెచ్చరించు గాని!
వేయి అనుమానములు నా బుద్ధిని భ్రష్టు చేయు గాని!
వేయి భ్రమలు నా సాధనను భంగపరచు గాని!
వేయి నకిలీ గురువులు నా మతిని భ్రమింప చేయు గాని!

వేల గర్భాల నుండి మరల మరలా నేను జన్మనెత్తు!
వేల సార్లు తపస్సు కోసం నా ఆసనం గ్రహింతు!
అజ్ఞానమనే చీకటి తెరను ముక్కలుగా చింపే దాకా!
తొలినాటి జ్ఞాన కిరణం నా మదిలో మెరిసే దాకా!

ఇది ఒకయోగి సింహనాదం!
అంతర జగత్తుతో ఆఖరి పోరాటం!

# కృతజ్ఞతలు

ఈ పుస్తకం రాయడానికి నన్ను నిర్ద్దేశించిన నా గురుదేవులు అయిన పరమ పూజ్య శ్రీ స్వామి సహజనంద తీర్థుల వారికి  నేను ఎప్పటికీ రుణపడి ఉన్నాను.  ఈ పుస్తకాన్ని ఈ విషయం మీద వ్రాయుటకు ఆయనే నన్ను ప్రేరేపించడం జరిగింది.

శక్తిపాత్ పరంపరకు చెందిన పరమ పూజ్య గురుదేవులందరికీ నేను ఎంతో రుణపడి ఉన్నాను. సృష్టి రచనకు సంబంధించిన అతి ప్రాచీన జ్ఞాన సాగరపు అపరిచిత జలాల్లోకి నేను ప్రవేశించినపుడు వారి సామూహిక జ్ఞానమే నాకు మార్గదర్శక కాంతి అయినది.

# ఉపోద్ఘాతము

మన చుట్టూ ఉన్న ప్రపంచం మరియు మనకు తెలిసిన జగత్తు భ్రమపూరితమైనది. మానవజాతి నాగరికత ప్రారంభం అయినప్పటి నుండి ఎన్నో పురాతన సంస్కృత గ్రంథాలు ఈ గొప్ప సత్యాన్ని తెలియజేస్తున్నాయి. మాయ యొక్క ఈ బంధన శక్తిని లేదా భగవంతుడు పన్నిన ఈ విశ్వ భ్రమను అధిగమించడానికి పురాతన కాలం నుండి అనేక పద్ధతులు అభివృద్ధి చేయబడ్డాయి.

ఈ దైవిక భ్రమను ఒక పర్వతంతో పోల్చవచ్చును. ఏ దిశలోనైనా పర్వతం ఎక్కడానికి అనేక మార్గాలు లేదా యోగా వ్యవస్థలు అభివృద్ధి చేయబడ్డాయి. యోగా సాధన చేసే సాధకులు తమ మానసిక స్వభావాన్ని బట్టి ఏదైనా ఒక నిర్దిష్ట మార్గాన్ని ఎంచుకుంటారు. పర్వత శిఖరం చేరుకున్నప్పుడు, అభ్యాసకుడు క్రింద ఉన్న భారీ పర్వతం పైన లేదా "జీవితం" అని పిలువబడే భ్రమ యొక్క బంధన శక్తిని లేదా మాయను అధిగమించడం జరుగుతుంది. చివరికి పర్వత శిఖరంపై నిలబడి, అభ్యాసకుడు ఉన్నదంతా తను తప్ప వేరే ఉనికి ఏమీ లేదని తెలుసుకుంటాడు. దీనిని ప్రపంచంలోని వివిధ సంస్కృతులలో మోక్షం లేదా ఆత్మ-సాక్షాత్కారం లేదా మోక్షం లేదా జ్ఞానోదయం మొదలైనవి అంటారు.

పర్వతం ఎక్కడానికి సాధకుడు ఎంచుకునే ప్రతి కొండ దారి ఒక స్వతంత్ర

యోగ మార్గం లాంటిది. ఏదేమైనా, ఒక సాధకుడు తాను భగవంతుని చేరుకోవడానికి లేదా మాయను అధిగమించడానికి లేదా పర్వత శిఖరాన్ని చేరుకోవడానికి జీవితమంతా చేసే ప్రయత్నం వలన దాదాపు ఏమీ కాదు. అంటే చేసిన ప్రయత్నం అంతా కేవలం మాయ లేదా భ్రమ లేదా పర్వతం యొక్క జారే వాలుపై పట్టు సాధించడానికి చేసే పోరాటం మాత్రమే అవుతుంది. ఒకసారి పర్వతపు వాలుపై కాలుపెట్టగలిగితే ఆ తర్వాత, శిఖరాగ్రానికి చేరుకోవడానికి  అడ్డు ఉండేది కేవలం సమయం మాత్రమే. పర్వతంపై కాలు మోపడానికి పట్టును సాధించడం అనే దానిని కుండలిని శక్తి యొక్క జాగృతం అంటారు.

అయితే, ఇక్కడ అర్ధం చేసుకోవాల్సిన విషయం ఒకటి ఉంది! కుండలిని శక్తి జాగృతి తరువాత, సాధకునికి చేయటానికి ఇంకేమీ ఉండదు. మాయ యొక్క పర్వత వాలుపై కాలు మోపడానికి వ్యక్తి సాధించే పట్టు ఒక యంత్రము (ఆంగ్ల భాషలో ఎలివేటర్) తో సమానంగా ఉంటుంది. ఒక వ్యక్తి ఈ ఎలివేటర్ మీద అడుగుపెట్టిన క్షణం నుండి అతని లేదా ఆమె ఆధ్యాత్మిక ఆరోహణ తన ప్రయత్నం ఇంక ఏమీ చేయకుండానే (ఆటో మోడ్‌లో) జరగటం ప్రారంభమవుతుంది. వ్యక్తి పర్వత శిఖరానికి చేరుకున్నప్పుడు అతను లేదా ఆమె కూడా మాయ లేదా భ్రమ యొక్క బంధన శక్తిని అధిగమించి పైకి లేవడం జరుగుతుంది. దీనివలన మనస్సు విపరీతమైన పరివర్తనకు లోనవుతుంది. అంటే మానసిక స్థితిలో చాలా మార్పు వస్తుంది.

మాయ లేదా భ్రమ అనే పర్వతం యొక్క వాలు మీద ఒక వ్యక్తి ఈ పట్టును పొందేలా చూడడానికి ఒక గురువు తప్పనిసరిగా అవసరం అవుతుంది. ఇది ఆ వ్యక్తిలో కుండలిని శక్తిని జాగృతం చేయడం ద్వారా జరుగుతుంది. అయితే, ఇది ఒక గురువు మాధ్యమంగా మాత్రమే సాధ్యమవుతుంది. ఇది అర్ధం చేసుకోవలసిన ఒక కీలకమైన విషయం. అయితే పర్వతం, పర్వతం పైకి ఎక్కడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి, మరియు ఒక గురువు అతనికి లేదా ఆమెకు పర్వతంపై కాలు మోపడానికి సహాయపడటం అన్నీ అదే మాయ లేదా పర్వతం యొక్క ఒక భాగం. అదేవిధంగా, ప్రారంభంలో వ్యక్తి ఎంచుకునే

పర్వత దారి కూడా పర్వతం లేదా మాయలో భాగం. దీని అర్థం ఏమిటంటే మాయ యొక్క శక్తితో కట్టుబడి ఉన్న వ్యక్తి అదే మాయ ద్వారా మాత్రమే మాయను అధిగమించవలసి ఉంటుంది. అయితే దీనికి ఒక గురువు లేదా ఏదైనా యోగ మార్గం  లేదా మతం లేదా తత్వశాస్త్రం లాంటి కొన్ని బాహ్య పరికరాలని ఉపయోగించడం తప్పనిసరి. అయితే ఇవి కూడా అదే మాయ యొక్క అంతర్గతమే!

ఈ నేపథ్యంలో రచయిత స్వయంగా మాయలో ఉండి జగత్తు మిథ్య లేదా "మాయ" అనే విషయంపై ఒక పుస్తకం రాయడం అనేది దాదాపు అసాధ్యం. నేను ఈ విషయం గురించి మొదట రచయితకు ఐదు సంవత్సరాల క్రితం చెప్పాను. పుస్తక రచనపై జరుగుతున్న పురోగతి గురించి ఆయన నాకు క్రమం తప్పకుండా అప్పుడప్పుడు చెబుతూనే ఉన్నారు. అయితే నేను పైన చెప్పినట్లుగా, రచయిత కూడా మాయ యొక్క అంతర్గతమే. దీని ఫలితంగా, పుస్తకం రాయడంలో పురోగతి నెమ్మదిగా ఉండేది. రాయవలసిన విషయం క్లిష్టమైనది కాబట్టి రచయిత తరఫున జరిగిన ఆలస్యం అర్థం చేసుకోవచ్చు. ఈ పుస్తకం కూడా మాయ యొక్క అంతర్గతం అయినప్పటికీ పుస్తక రచన చివరకు ఒక వాస్తవంగా పరిణామం చెందడం నాకు సంతోషంగా ఉంది.

ఏదేమైనా, ఒక పర్వత దారి అదే పర్వతంలో ఒక భాగం అయి మరియు అదే పర్వతం పైకి ఎక్కడానికి మార్గంగా కూడా ఉపయోగ పడుతుంది. అదేమాదిరిగా ప్రాపంచిక భ్రమ నుండి పైకి ఎదగడానికి ఈ పుస్తకం యోగ సాధకులను విజయవంతంగా ప్రేరేపిస్తుంది.

ప్రాచీన సంస్కృత గ్రంథాల ప్రకారం, మానవుడు ప్రాథమికంగా భగవంతుని యొక్క స్వరూపం. ఈ విషయాన్ని మరొక విధంగా కూడా వ్రాయవచ్చు. విశ్వం భగవంతుని యొక్క స్థూలకాయం అయితే, మానవ శరీరం అదే భగవంతుని యొక్క సూక్ష్మ కాయం. ఏది ఏమయినప్పటికీ, అగ్నియొక్క రవ్వ అగ్ని జ్వాల నుండి భిన్నంగా ఏమీ ఉండదు. అదే విధముగా మానవ శరీరంలో నివసించే ఆత్మ కూడా విశ్వాత్మ లేదా దేవుడు లేదా పరమాత్మ లేదా దైవత్వం యొక్క స్వభావంతో సమానంగా ఉంటుంది. కావాలంటే భగవంతుణ్ణి ఏ పేరుతోనైనా

పిలవండి లేదా దైవత్వాన్ని ఏ రూపంలో నైనా ఊహించుకోండి లేదా కోరుకున్న విధంగా భావించుకోండి!

అయితే, ఇక్కడ ఒక చిన్న మెలిక ఉంది! మనం ఆత్మ గురించి ప్రస్తావించినపుడు అది మానవునిలో కేంద్రీకృతమై ఉందని సంపూర్ణంగా అర్థమవుతుంది. కానీ మనం విశ్వం లేదా బ్రహ్మాండం గురించి ప్రస్తావించినపుడు ఆధునిక పాఠకుల మనస్సులలో కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి.

విశ్వం లేదా బ్రహ్మాండం లేదా భగవంతుని స్థూలకాయంపై ఏమైనా పరిమితి ఉన్నదా ? ఒకవేళ అలాంటిది ఏమైనా ఉంటే ఉన్న పరిమితి ఏమిటి?

విశ్వం యొక్క చుట్టుకొలత ఎక్కడ ఉంది?

అసలు భగవంతుడు అని పిలువబడే ఆ పెద్దమనిషి ఎక్కడ ఉన్నాడు?

చివరగా, ఆత్మ యొక్క కేంద్రం మానవునిలోనే ఉంటే, అప్పుడు అతని చుట్టుకొలత గురించి ఏమిటి? అది మానవ భౌతిక శరీరానికి పరిమితమా?

మానవుడు భ్రమ యొక్క ముసుగును చింపివేసినప్పుడు లేదా మాయ యొక్క ఆవరణ కొంచెం కొంచెం తొలగిపోతున్నపుడు తన చుట్టుకొలత శరీరంలో గాని లేదా మనస్సులో గాని లేదా బుద్ధిలో గాని లేదు అనే విషయం అంతర్గతంగా మరియు క్రమంగా గ్రహించడం జరుగుతుంది.

ఈ పుస్తకంలో రచయిత అనేక ఇతర అంశాలతో పాటు ప్రధానంగా చర్చించిన కొన్ని విషయాలు ఇవి. ఈ విషయం గురించి రాస్తున్నపుడు రచయిత తనను తాను దేనికి పరిమితం చేసుకోలేదు. అలాగే ఎలాంటి హేతుబద్ధమైన లేదా అహేతుక ఆలోచన ప్రక్రియకు, మతం లేదా తత్వశాస్త్రం లేదా ఇంకా ఏదైనా ఉంటే దానికి కట్టుబడి ఉండలేదని తెలిసి నాకు సంతోషంగా ఉంది!

ఏదేమైనా, విషయం రాయడానికి క్లిష్టమైనది. కాబట్టి నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, ఈ విషయాన్ని సరళీకృతం చేసి రాయడం అనేది రచయితకు కఠినమైన పని అయిఉంటుంది. అంతేగాకుండా ప్రస్తుతం ఈ విషయం గురించి చర్చిస్తున్నప్పుడు మనమందరం కూడా భ్రమ లేదా మాయ

యొక్క ఒకే పరిధిలో జీవిస్తున్నామని గుర్తుంచుకోవడం కూడా ముఖ్యం. అందువలన, పుస్తకంలో ఏవైనా పొరపాట్లు ఉంటే లేదా ఎక్కడైనా సరిపోని వివరణ ఉంటే రచయితను క్షమించమని పాఠకులందరినీ కోరుతున్నాను. బదులుగా, భావి తరాల ప్రయోజనం కోసం ఈ అంశంపై మరింత లోతుగా అన్వేషించడానికి రచయిత ప్రోత్సాహానికి అర్హుడు.

ఈ పుస్తకం మాయ యొక్క సంక్లిష్టమైన పని గురించి తెలుసుకోవాలనే వారికి లేదా దానిని అధిగమించి పైకి ఎదగాలని కోరుకునేవారికి ఒక అంతర్దృష్టిని ఇస్తుందని ఆశిస్తున్నాను.

భావి తరాలకు ఈ పుస్తకం ఈ అంశంపై ఒక ప్రామాణిక గ్రంథముగా మిగిలిపోగలదని ఆశిస్తున్నాను.

రచయిత ఆయన చిన్నప్పటి నుండి నాకు తెలిసిన నా ప్రత్యక్ష శిష్యులలో ఒకడు. కొంతకాలం క్రితం ఆయనకు శక్తిపాత్ దీక్షాధికారం లేదా శక్తిపాత్ దీక్ష ఇవ్వడానికి అధికారం ఇవ్వడం జరిగింది. ఆయన చాలా తక్కువ వ్యవధిలోనే 300 మందికి పైగా శక్తిపాత్ దీక్షను ఇవ్వడం జరిగింది. ఆయన యొక్క వేగవంతమైన ఆధ్యాత్మిక ప్రగతిని చూసి, తరువాత నేను ఆయనను శక్తిపాత్ పరమ గురువుగా కూడా చేసాను. ప్రస్తుతం శక్తిపాత్ గురువులుగా ఉన్న ఆయన శిష్యులు కొందరు; శక్తిపాత్ పరంపర యొక్క సందేశాన్ని ప్రపంచమంతా వ్యాప్తి చేయడంలో చురుకుగా నిమగ్నమై ఉన్నారు! తత్ఫలితంగా, ఆయనను ఇతర బాధ్యతల నుండి విముక్తి చేయడం జరిగింది. తద్వారా ఆయన సేవలను ఇంకా మంచి పనుల కోసం ఉపయోగించుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఇలా చేయడం జరిగింది. ఈ పుస్తకం అతి ప్రాచీనమైన శక్తిపాత్ పరంపరలోని గురువులకు ఆయన చేసిన నిస్వార్థ సేవ యొక్క ప్రత్యక్ష ఫలితం.

రచయిత తన మొదటి పుస్తకం పరాశక్తి (ఆంగ్ల భాషలో ది పవర్ అన్నోన్ టు గాడ్) రాశారు. తరువాత దీనిని ప్రపంచంలోని దాదాపు 20 ప్రధాన భాషలలోకి అనువాదం చేయించారు. ప్రస్తుత పుస్తకం తన మొదటి పుస్తకంతో కలిపి యోగ సాధన చేసేవారికి ఎంతో ప్రయోజనం

చేకూరుస్తుంది. అంతేగాకుండా రచయిత తన శిష్యుల యొక్క వివిధ అనుభవాలను మరియు వారి ప్రశ్నలను బహుళ సంపుటాలలో సంకలనం చేశాడు. ఆ పుస్తకాన్ని శక్తిపాత్ చింతామణి (ఆంగ్ల భాషలో సీక్రెట్స్ ఆఫ్ శక్తిపాత్ అండ్ కుండలిని యోగ) పేరుతో ప్రచురించడం జరిగింది. రచయిత ప్రస్తుత పుస్తకంతో పాటు ఆ విలువైన సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లేతర ఇతర భాషలు మాట్లాడే వారికి అందుబాటులోకి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను.

– శ్రీ స్వామి సహజానంద తీర్థ

# ముందుమాట

భారతదేశపు పశ్చిమ కనుమలలో అరేబియా సముద్రం యొక్క కోస్తాతీరం ! కేరళ రాష్ట్రంలోని 'కన్నూర్ ' అనే చిన్న పట్టణం! జిల్లా హెడ్క్వార్టర్స్ కి అది కేంద్రం కూడా ! ఆ పట్టణం లో ప్రజలు ఎక్కువగా విహారానికి వెళ్లే కోస్తాతీర ప్రాంతాన్ని 'పయ్యంబలం ' బీచ్ అంటారు.

ప్రకాశవంతమైన ఉదయభానుని కిరణాలు నా కుడివైపు నుండి బీచ్ మీద పడుతున్నాయి. నా ఎడమ వైపు ఎగసి పడుతున్న అరేబియా సముద్రపు అలలు ! మెత్తని ఇసుక, పాదరక్షలు లేని నా పాదాలకు మెత్తగా తగులుతూ ఉన్నది. క్రొత్తగా ప్రతిరోజూ బీచ్ కి వెళ్లి ఒక గంటసేపు నడవటం అలవాటయినది. బీచ్, దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంటుంది. ఒకసారి ముందుకి వెళ్లి వెనక్కి తిరిగి వస్తే దాదాపు ఒక గంట సమయం పడుతుంది. ఉదయం పూట నా నడక కార్యక్రమం కూడా పూర్తయినట్లు అవుతుంది.

సముద్రం ప్రశాంతంగా ఏమీ లేదు! అయినా సముద్రపు అలజడి కూడా పెద్ద ఎక్కువగా ఏమీ లేదు! సముద్రపు ఉపరితలం మీద దూరంగా చేపల పడవలు తిరుగుతూ ఉండటము కనిపిస్తున్నది. కొంతమంది చేపలు పట్టే కార్యక్రమాన్ని బీచ్ మీద నుండే నడిపిస్తున్నారు. వాళ్ళు తమ చేతులలో చేపల వలలకు తగిలించి ఉన్న పొడవాటి త్రాళ్లను పట్టుకొని 'బీచ్ ' మీద నడుస్తున్న

వాళ్లకు ఆటంకం కలిగిస్తున్నారు. అంటే నేను బీచ్ మీద నడుస్తుంటే మధ్య మధ్యలో ఆ త్రాళ్లను దాటి వెళ్ళవలసి వస్తుందన్నమాట!

సముద్రపు తీరం పొడుగునా అంటే 'బీచ్' కి సమానాంతరంగా ఎన్నో 'బీచ్ రిసార్ట్స్' కట్టి ఉన్నాయి. విహారానికి వచ్చి ఉన్న ఎంతోమంది యాత్రీకులు హోటళ్ల నుండి బయటికి వచ్చి 'బీచ్' వైపు , మరలా తిరిగి కొంతమంది హోటళ్ల వైపు కదులుతూ కోలాహలం చేస్తున్నారు. సముద్రపు తీరం పొడవునా కోలాహలాన్ని ఇంకా ఎక్కువ చేస్తూ, నా తల మీద ఆకాశంలో ఒక పెద్ద పక్షుల గుంపు తీరం నుండి సముద్రం లోపలికి పోతూ కనిపించినది! అయితే అవి ఎక్కువసేపు సముద్రం లోపలి వైపుకి వెళ్ళలేవు! ఎందుకంటే విశ్రాంతి తీసుకోవడానికి, అంటే నేల మీద దిగడానికి సముద్రం యొక్క ఉపరితలం మీద అవకాశం ఉండదు కాబట్టి! మరీ ఎక్కువ దూరం వెళితే అలసిపోయి సముద్రంలో పడిపోవలసిన పరిస్థితి కూడా ఎదురుకావచును. ఒక క్షణం సేపు ఏదో ఆలోచన నా అంతరంలో మెరిసినది! ఈ పక్షులకి ఏమైనా పిచ్చి పట్టినదా! అనిపించినది. లేనిచో తీరం వదిలి సముద్రం లోపలికి ఎందుకు వెళతాయి? సముద్రపు ఉపరితలం మీద నాకు ఎక్కడా 'ద్వీపం' లాంటిది ఏదీ కనిపించడము లేదు. అయితే అవి ఎక్కడ నేలమీద దిగి విశ్రాంతి తీసుకొనగలవు?

నా అంతరంలో మెరిసిన మరొక ఆలోచన! బహుశా ఇది ఏమైనా పక్షుల యొక్క అహం పూరితమైన ఆకాశయానమా! అలా అయితే అతి త్వరలోనే సువిశాలమైన సాగరము పక్షుల యొక్క అహాన్ని అణగ త్రొక్కడం ఎలాగూ ఖాయం! నా అంతరంలో మెరిసి మాయమవుతున్న ఆలోచనా పరంపర ఒక్కసారిగా ఆగిపోయినది. దీనికి కారణం ఒక పెద్ద అల వచ్చి నన్ను నడుము మీద బాదుట! నా బట్టలన్నీ దాదాపు తడిచిపోయాయి. అదృష్టవశాత్తు నా మొబైల్ ఫోన్ చేతిలో పట్టుకొని ఉన్నాను. అందువలన ఫోన్ చెడిపోకుండా తప్పించుకోగలిగాను.

ఇంతలో నా అంతరంలో మెరిసిన మరొక ఆలోచన! ఎగిసి పడుతున్న సముద్రపు అలలు నా మనసులో ఎగిసిపడుతున్న ఆలోచనల మాదిరిగానే

ఉన్నట్లుగా ఉన్నది. మనసులో ఎగిసిపడే భావోద్వేగాలకు మరియు సముద్రపు కెరటాలకి మధ్యన పెద్దగా తేడా ఏమీ లేదని అనిపించినది. సముద్రపు కెరటాలు ఒకే మాదిరిగా ఉండవు. ఒక్కొక్కసారి భయానకమైన పెద్ద కెరటం వచ్చి తీరాన్ని తాకుతుంది. మరొకసారి కెరటం అతి స్వల్పంగా ఉంటుంది. సముద్రం యొక్క లోపలివైపు ఉపరితలం మీద దృష్టిసారిస్తే సముద్రం ఎంతో ప్రశాంతముగా ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే సముద్రం యొక్క అంతర్భాగాన మరొక ప్రపంచం ఉంటుందనే విషయం పాఠకులందరికి తెలిసినదే! లెక్కించడానికి అలవికానన్ని సముద్రపు జీవరాశులు సముద్రపు అంతర్భాగంలో అలజడి సృష్టిస్తూ ఉంటాయి. కనుక సముద్రపు ఉపరితలం మీద కనిపించే ప్రశాంతత అంతర్భాగాన ఉండదు. మనిషి యొక్క అంతరాన్ని సముద్రంతో పోల్చిచూస్తే రెండూ సరిపోతాయి అనిపిస్తుంది.

2015 వ సంవత్సరం శ్రావణ మాసంలో నేను వృత్తిరీత్యా కేరళ రాష్ట్రానికి రావడం జరిగింది. దీనికి కొన్ని వారాల ముందు నా గురుదేవులు అయిన శ్రీ స్వామి సహజానంద తీర్థుల వారిని విజయవాడ నగరంలో కలవడం జరిగింది. నా మొదటి పుస్తకం అయిన 'పరాశక్తి' గ్రంథం గురించి చర్చిస్తున్న సమయంలో, ఆయన అనాలోచితంగా ఒక మాట పలికారు. భగవంతునికి ప్రత్యేకంగా ఏదైనా ఓనామాలతో సంబంధం ఉంటుందా! అని కుతూహలంగా మాట్లాడారు. అంతేగాక నా రెండవ పుస్తకాన్ని వ్రాసే సమయంలో ఈ విషయం మీదే మనసును కేంద్రీకరించి వ్రాయమని కూడా చెప్పారు.

ఆ రోజు ఆయన పలికిన మాటలు వెంటనే నా అంతరంలో ఎక్కడో నిగూఢమైన లోతుల్లో ప్రతిధ్వనించాయి. కొంచెం సేపటిదాకా ఆయన చెపుతున్న విషయమేమిటో స్పష్టంగా నాకు అర్థం కాలేదు. కొన్ని నిమిషాలు నేను ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాను. ఆ తరువాత ఎదో విషయం నాకు స్ఫురించినట్లు సరేనని తల ఊపాను.

నా గురుదేవులు చాలా సాధారణంగా మరియు అనాలోచితంగా పలికిన ఆ మాటల అర్థం ఇక్కడ కొన్ని పేరాలలో లేదా పేజీలలో వివరించడానికి సాధ్యం కాదు. దానికోసమే అసలు ఈ పుస్తకాన్ని వ్రాయవలసి వచ్చినది.

అయితే శక్తిపాత విద్యకు సంబంధించి ముందునుండే అందుబాటులో ఉన్న సాహిత్యంలోని సారాంశాన్ని మరియు దాని అర్ధాన్ని ఉల్లంఘించకుండా ఉండేందుకు చాలావరకు ప్రయత్నం చేశాను. అయితే గురువుగారు అనాలోచితంగా పలికిన కొన్ని మాటలు ఆ సాహిత్యానికి మరొక రూపాన్ని ఇచ్చాయి.

ఆ మాటలను లోతుగా పరిశీలించి చుస్తే ఆయన చెబుతున్న విషయం మానవులు ఉపయోగించే భాషల యొక్క పుట్టుక గురించి అని స్పష్టమవుతుంది. విషయాన్ని ఇంకా లోతుగా అధ్యయనం చేసినపుడు మరొక విషయం స్పష్టమవుతుంది. మానవులందరిలోనూ విరాజిల్లుచున్న ఆత్మ లేదా పరబ్రహ్మం లేదా భగవంతుడు ఒక్కటే అయినపుడు, పరబ్రహ్మానికి ప్రత్యేకించి ఏదైనా ఒక భాషతోనే సంబంధం ఎలా ఉంటుంది? అయితే ఒక విషయం స్పష్టంగా అర్ధమవుతున్నది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో నివసించే మానవుల భాషలు అన్నీ కృత్రిమంగా మానవుల చేత నిర్మాణము చేయబడినవి అని తెలుస్తుంది.

పైన వివరించిన విషయాన్ని ఇంకా లోతుగా అధ్యయనం చేసినపుడు మరొక విషయం స్పష్టమవుతుంది. భగవంతునికి అన్ని భాషల యొక్క వర్ణమాల పరిచయమే కనుక, ప్రత్యేకించి ఏదైనా ఒక భాష యొక్కవర్ణమాలతోనే సంబంధం కలిగి ఉండుటకు అవకాశము లేదు. అయితే ఇక్కడ ఒక పెద్ద సమస్య తలెత్తుచున్నది!

సృష్టి నిర్మాణము 'ఓం 'కార శబ్దం నుండి జరిగినదని మరియు సంస్కృత భాష యొక్క వర్ణమాల అంతా బీజ అక్షరముల లేదా మంత్రముల రూపంలో 'ఓం'కార శబ్దం నుండి పుట్టినవేనని అన్ని ప్రాచీన సంస్కృత గ్రంథములు నొక్కి మరీ చెబుతున్నాయి. ఈ విషయాన్ని క్రైస్తవ మత గ్రంథం అయిన 'బైబిల్ ' కూడా దాదాపు ఒప్పుకుంటుంది. అయితే 'ఓం 'కార శబ్దం గురించి ప్రత్యక్షంగా చెప్పకపోయినా, సంస్కృత శాస్త్రాలు చెబుతున్న శబ్దబ్రహ్మం నుండి సృష్టి నిర్మాణం జరిగినట్లు చెబుతున్నది. అంతేకాకుండా ఆధునిక విజ్ఞాన శాస్త్రం గురించి నాకు తెలిసిన అతికొద్ది సమాచారం ప్రకారం, 'స్ట్రింగ్

సిద్ధాంతం ' కూడా సృష్టి నిర్మాణం గురించి దాదాపు ఈ విధంగానే వివరిస్తున్నది. అంటే భౌతిక జగత్తులోని పదార్థం అంతా చివరికి ఈ 'స్ట్రింగ్స్ ' లేదా తంతుల ద్వారా నిర్మితమైనదని చెబుతున్నది. అయితే 'స్ట్రింగ్స్ ' లేదా తంతులు అన్నపుడు, దీని అర్థం 'శబ్దం' అని లెక్కకు వస్తుంది. అంటే పదార్థం అంతా శబ్ద శరీరాలు కలిగివుండి, ఆ తరువాత స్థూల పదార్థంగా పరిణామం చెందినదని స్పష్టమవుతుంది. కాని ఆ శబ్ద శరీరాలు ఏమిటి అనేది 'స్ట్రింగ్ సిద్ధాంతం' ఇంతవరకు వివరించలేదు.

ఒకవేళ 'స్ట్రింగ్ సిద్ధాంతం'చెబుతున్న శబ్ద శరీరాలు సంస్కృత వర్ణమాల అయివుంటే, ప్రాచీన శాస్త్రాలు మరియు ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఒకే స్వరంలో పలుకుతున్నాయని చెప్పవచ్చును. అంటే విశ్వం యొక్క సృష్టి రచన సంస్కృత భాష ఆధారముగా నిర్మితమైనదని తెలుస్తుంది. అంతేగాకుండా మంత్రశాస్త్రం వివరిస్తున్న శబ్ద ప్రపంచం మరియు అర్థ ప్రపంచాల సిద్ధాంతం కూడా ఋజువు అవుతుంది.

పై విషయాలన్నీ ఈ పుస్తకంలోని కొన్ని భాగాలలో క్లుప్తంగా వివరించడం జరిగింది. అయితే అసలు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు! సంస్కృత భాష వర్ణమాల మాత్రమే ప్రత్యేకించి సృష్టి నిర్మాణానికి ఎందుకు ఉపయోగించ బడినది?

కేవలం ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి కాబట్టి పైన వివరించిన విషయాన్ని నమ్మవలసి వస్తుంది. మంత్ర శాస్త్రం సంస్కృత వర్ణమాల ఆధారంగా నిర్మితమై ఉన్నది కాబట్టి, మంత్రాలు నిజమైనవి మరియు భౌతిక జగత్తులో పనిచేస్తాయని ఋజువైతే అప్పుడు సృష్టి నిర్మాణం కూడా సంస్కృత భాష యొక్క వర్ణమాలతో నిర్మితమైనది అనే విషయం ఒప్పుకోవచ్చును.అంటే ఈ విశ్వమంతా సంస్కృత భాష వర్ణమాల యొక్క స్థూల స్వరూపం అని చెప్పవచ్చును. దీని అర్థం ఈ విశ్వంలో సంస్కృత భాషను ఎక్కడైనా ఉపయోగించవచ్చును. బహుశా ఈ కారణం చేతనే ఆధునిక విజ్ఞాన శాస్త్రం, కంప్యూటర్ యంత్రాలలో ఉపయోగించుటకు సంస్కృత భాష వర్ణమాల మిగిలిన అన్ని భాషలకంటే బాగా సరిపోతుందని తేల్చి చెబుతున్నది.

పై విషయాన్ని ఇంకా లోతుగా అధ్యయనం చేస్తే, ఈ విశ్వమంతా నిండిపోయి ఉన్న విశ్వశక్తి లేదా పరాశక్తి స్వయానా సంస్కృత భాష యొక్క వర్ణమాల అనే విషయం స్పష్టమవుతుంది. ఈ విషయాన్ని ఇంకా సాగదీసినచో సంస్కృత భాష మాత్రమే ప్రత్యేకించి ఎందుకు ఉపయోగించ బడినది అనే విషయం కూడా కొంచెం కొంచెంగా అవగతమవుతుంది.

ఈ పుస్తకాన్ని సంపూర్ణముగా చదివిన తరువాత పైన వివరించిన విషయం గురించి పాఠకులకు కొంచమైనా స్పష్టత లభించగలదని భావిస్తాను.

కేరళ రాష్ట్ర కోస్తా తీరాన నేను ప్రతిరోజూ వ్యాహాళికి వెళ్లిన సమయంలోనే 'మహామాయ'గ్రంథ రచనకు మనసు ప్రేరితమవడం ప్రారంభమయినది. ప్రతిరోజూ నేను తిలకిస్తున్న సముద్రపు కెరటాలు నా మనసులో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న భావోద్వేగాలకు మరియు ఆలోచనలకు ప్రతిబింబాలుగా నిలిచాయి. దీనితో ఈ గ్రంథ రచన కూడా ప్రారంభమయినది.

– రచయిత

# సృష్టి నిర్మాణం

మానవజాతికి జగత్తు రెండు స్థాయిలలో ప్రకటితమవుతుంది. ఒక్కటి వ్యక్తిగత స్థాయిలో మరియు రెండవది సామూహిక స్థాయిలో అనుభవానికి వస్తుంది. అంటే ప్రతిమానవునికి ఒకవైపు వ్యక్తిగతంగా జగత్తు అనుభవానికి వస్తుంది మరియు అదే సమయంలో మానవజాతి మొత్తానికి సామూహికంగా కూడా అనుభవానికి వస్తుంది. ఈ భూమండలం మీద వందల కోట్ల సంఖ్యలో మానవులు మనుగడ సాగిస్తున్నారు. కనుక ప్రతి వ్యక్తికి అనుభవమయ్యే జగత్తు విశేషంగా ఆ వ్యక్తికి మాత్రమే అనుభవానికి వస్తుంది. అయితే వ్యక్తిగత స్థాయి జగత్తుకి మరియు సామూహిక స్థాయి జగత్తుకి తేడా ఏమేమిటని పాఠకులు ప్రశ్నించవచ్చును.

మానవునికి మనసు జాగ్రదావస్థ నుండి నిద్రలోకి జారిపోతే దానిని వ్యక్తిగతస్థాయి ప్రళయం అనవచ్చును. అహం దాదాపు విలీనం అయిపోతుంది కాబట్టి (కాని బీజరూపంలో మాత్రం మిగిలి ఉంటుంది.) వ్యక్తిగతస్థాయిలో అనుభూతి చెందిన జగత్తు కూడా విలీనమవుతుంది. నిద్రనిద్ది మరల తిరిగి జాగ్రదావస్థలోనికి రాగానే ఎప్పటిలాగే సృష్టిరచన జరుగుతుంది. అయితే అదేసమయంలో సామూహిక జగత్తు మాత్రం ఆప్రభావితంగా వినండి యథాస్థితిలో మిగిలిన మానవులకు నిరంతరం

అనుభవమవుతూనే ఉంటుంది. రెండింటికీ మధ్యన వున్నా తేడా ఇంతవరకు మాత్రమే !

సమిష్టిస్థాయిలో ప్రళయం సంభవించినపుడు మానవజాతి మొత్తానికి సామూహిక జగత్తు కూడా విలీనం అవుతుంది. దీనినే పురాణాలలో బ్రహ్మకు రాత్రి సమయం అంటారు. అదే విధంగా బ్రహ్మ మేల్కొనుట అంటే జగత్తు మరలా తిరిగి సృష్టింపబడుట అని అర్ధం.

వ్యక్తిగతస్థాయిలో జాగ్రదావస్థలో ప్రకటితమవుతున్న జగత్తు ఒక ఎండమావి వంటిది. ఎటువంటి అస్థిత్వము లేని మాయా జగత్తు ! కేవలం మానవుని యొక్క మస్తిష్క వ్యవస్థ మీద తను జన్మజన్మలనుండి కూడబెట్టుకొని ఉన్న మాయా ఆవరణ అని చెప్పవచ్చును. ఇంద్రియాల మాధ్యమంగా జగత్తు అనే ఆ మాయా కిరణం బాహ్యంగా వెళ్లి శూన్యంలో ప్రతిబింబించబడుతుంది. అంటే బాహ్యంగా వుండే శూన్యం లేదా ఆకాశం ఇక్కడ అద్దం వలె పనిచేస్తుంది. వ్యక్తిగత స్థాయిలో మానవుడు తనదైన ఒక ప్రత్యేక జగత్తును అనుభూతి చెందుటకు ఇదేవిధంగా సమిష్టిస్థాయిలో ప్రకటితమవుతున్న జగత్తుకూడా ఒక ఎండమావి వంటిది ! ప్రకృతి సహజంగా ఏదైనా ప్రళయం పెద్దఎత్తున ప్రపంచవ్యాప్తంగా సంభవించినపుడు మానవజాతి సామూహికంగా అనుభూతి చెందే జగత్తు కూడా విలీనమవుట జరుగుతుంది. ఎందుకంటే ఆ జగత్తుని అనుభూతి చెందుటకు మానవజాతి అసలు జీవించి ఉండదు కాబట్టి ! ఈ ప్రక్రియను ఇంకా సులభంగా అర్ధం చేసుకోవడానికి ముందుగా, ఆధునిక విజ్ఞానశాస్త్రం సృష్టిరచన గురించి చెబుతున్న విషయాన్ని క్లుప్తంగా వివరిస్తాను. ఆ తరువాత ప్రాచీన శాస్త్రాలు వివరిస్తున్న విషయాన్ని విశ్లేషిస్తాను !

మానవునికి అనుభవమయ్యే భూమండలం మన సౌరకుటుంబంలోని ఒక గ్రహం మాత్రమే ! ఇంకా మన సౌరకుటుంబం చుట్టూ దాదాపు నలభై వేల కోట్లు సౌరకుటుంబాలు లేదా కేవలం నక్షత్రాలు ఉన్నాయని ఆధునిక శాస్త్రవేత్తలు అంచనా వేయడం జరిగింది. ఈ సౌరకుటుంబాలు అన్నీ ఒక సుడిగుండం వలె అంతరిక్షంలో తిరుగుచూ ఉంటాయి. సౌరకుటుంబాలతో

పాటు అనేక కృష్ణ బిలాలు కూడా సుడిగుండం వలె తిరుగాడుతూ ఉంటాయి. సుడిగుండం నడిమధ్యన వుండే ప్రదేశాన్ని "మహా కృష్ణబిలం" అంటారు. ఈ అసంఖ్యాకమైన సౌరకుటుంబాలతో తిరుగుచూ వుండే సుడిగుండాన్ని ఆంగ్లభాషలో "గెలాక్సీ" అంటారు.

మన "గెలాక్సీ" ని పాలపుంత లేదా ఆకాశ గంగ అని పిలుస్తారు. అయితే ఇటువంటి పాలపుంత వంటి "గెలాక్సీ"లు కూడా అనంతాకాశంలో లెక్కకు మించినవి ఉన్నాయని ఆధునిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనినిబట్టి ఆలోచిస్తే విశ్వం ఎంత పెద్దది అనే విషయం వూహించుటకు కూడా అలవి కాదు!

అయితే సౌరకుటుంబాలలో లేదా నక్షత్రాలలో జరిగే ఒక అద్భుతమైన ప్రక్రియను అర్థం చేసుకుంటే అసలు విషయం మొత్తం అంటే సృష్టి నిర్మాణం గురించి సులభంగా అర్థం చేసుకొనవచ్చును.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ప్రతి సూర్యమండలానికి పరిమిత జీవిత కాలం ఉంటుంది. మండుచున్న సూర్యగోళంలో "హైడ్రోజన్" అని పిలువబడే వాయువు హరించుకు పోయిన తరువాత, సూర్యగోళం మండుట మానివేసి చల్లబడుట మొదలవుతుంది. అది చల్లబడిన తరువాత దాని పరిమాణం కూడా కుదించుకు పోవడం మొదలవుతుంది. దానితో దానిచుట్టూ తిరుగుచున్న గ్రహాలూ సైతం కుదించుకు పోతున్న సూర్యమండలం యొక్క ఆకర్షణ శక్తి ఎక్కువ అగుటచేత సూర్యగోళంలో పడిపోవుట జరుగుతుంది. అంటే సౌరకుటుంబం మొత్తం ఒకే ఒక చల్లటి నక్షత్రంగా మారిపోయి, ఆ తరువాత ఇంకా కుదించుకొని పోవుట కూడా జరుగుతుంది. ఈ ప్రక్రియ అంతటితో ఆగకుండా సూర్యగోళం అతి చిన్న పరిమాణంలో అంటే అణువులా మారిపోయి, చివరికి అంతరిక్షంలో అదృశ్యమవుతుంది. అయితే సూర్యగోళం కుదించుకొని పోయే ఒకానొక సమయంలో అది "కృష్ణబిలం" గా మారుతుంది. అంటే కుదించుకు పోతున్న సూర్యగోళం యొక్క ఆకర్షణ శక్తి విపరీతంగా పెరిగిపోవుట వలన చివరికి దానినుండి "కాంతి" పుంజం సైతం బయటకు రాలేదు. అందుకే దానిని "కృష్ణ బిలం" అన్నారు.చివరికి

సూర్యగోళం లేదా కృష్ణ బిలం, ఏకేశ్వరవాదంలో (పాయింట్ ఆఫ్ సింగులారిటీ) లోకి పడిపోయి సంపూర్ణంగా అదృశ్యం అయిపోతుంది. అంటే సౌరకుటుంబం మొత్తం చివరికి ఒక చిన్న బిందువులా (అణువు స్థాయిలో) కుదించుకు పోయి చివరికి శూన్యంలో అదృశ్యం అయిపోతుంది.

పైన వివరించిన విధంగా మన సూర్యమండలం వున్న "పాలపుంత అనే గెలాక్సీ"లో నిరంతరం ఎన్నో నక్షత్రాలు కృష్ణబిలాలుగా మారుతూ ఉంటాయి. చివరికి ఆ కృష్ణబిలాలు సైతం అదృశ్యం అవుతూ ఉంటాయి అని ఇంతకుముందే వివరించాను. అయితే ఈ పద్ధతి వ్యతిరేక దిశలో కూడా జరుగుతూ ఉంటుంది. అంటే క్రొత్త నక్షత్రాలు లేదా సూర్యమండలాలు అంతరిక్షంలో పుడుతూ ఉంటాయి. దీనినే "బిగ్ బ్యాంగ్" సిద్ధాంతం అని ఆధునిక విజ్ఞాన శాస్త్రం చెబుతున్నది. మన "పాలపుంత" "గెలాక్సీ" లోనే లెక్కించుటకు అలవికాని సంఖ్యలో సూర్యమండలాలు లేదా నక్షత్రాలు నిరంతరం పుడుతూ మరియు అదృశ్యం అయిపోతూ ఉంటాయి. ఇవి ఎలా ఉంటాయి అంటే చీకటిలో వెలుగుతూ ఆరిపోతూ వుండే మిణుగురు పురుగుల్లాగా ఉంటాయి. ఇక పాలపుంత విషయానికి వస్తే, ఇది కూడా సుడిగుండమువలె టీకా "మహా కృష్ణబిలం" చుట్టూ తిరుగుతూ ఉంటుందని పైన వివరించాను. అంటే ఏదో ఒక రోజు మన "పాలపుంత" లోని నక్షత్రాలన్నీ ఈ మహా కృష్ణబిలంలో పడిపోయి అదృశ్యం అవుట కూడా ఖాయం ! అలాగే చివరిదశలో "పాలపుంత"కు చెందిన "మహా కృష్ణబిలం" కూడా అంతరిక్షంలో విలీనం చెందుట ఖాయం ! అంటే ఒక సౌరకుటుంబం లేదా నక్షత్రం ఏవిధంగా మిణుగురు పురుగువలె మాయం అవుతున్నదో అదేవిధంగా నలభై వేల కోట్ల సంఖ్యలో వున్న నక్షత్ర వ్యవస్థ మొత్తం మిణుగురు పురుగు వలె మాయమవుతుంది.

పాలపుంత నక్షత్ర వ్యవస్థకు ఏ గతి పట్టనుందో అదే ప్రక్రియ ఈ విశ్వమంతా నిరంతరం మరియు ప్రతిక్షణం జరుగుతున్నదని ఆధునిక విజ్ఞాన శాస్రం చెబుతున్నది. అంటే అనంతమైన ఈ విశ్వమంతా మిణుగురు పురుగులు వంటి గెలాక్సీలతో లేదా నక్షత్ర వ్యవస్థలతో నిండిపోయి వున్నది.

మిణుగురు పురుగులు చీకటిలో వెలుగుతూ మరియు ఆరిపోతూ ఉన్నట్లు, ఒకవైపు "గెలాక్సీ" అంతర్గతమైన చిన్న చిన్న సౌరకుటుంబాలు వెలుగుతూ ఆరిపోతూ ఉంటాయి మరియు రెండోవైపు కొన్ని గెలాక్సీలు సైతం వెలుగుతూ – ఆరిపోతూ ఉంటాయి.

ఇది వూహించుటకు అలవి కానిది, కల్పన చేయుటకు సాధ్యం కానిది మరియు అద్భుతమైన ఖగోళ ప్రక్రియ !

అయితే ఇక్కడ పాఠకులు ఒక ప్రశ్న వేయవచ్చును. ఒక సౌరకుటుంబం లేదా నక్షత్ర వ్యవస్థలో ఎంతో పదార్థం ఉంటుంది కదా ! ఆ పదార్థం అంతా ఎంత కుదించుకుపోయినా అదృశ్యం ఎలా అవుతుందని ప్రశ్నించవచ్చును. అంతేకాదు ! అసలు విశ్వంలో అదృశ్యం అవుతున్న పదార్థం అంతా చివరకు ఎక్కడికి పోతుందనే అనుమానం కూడా రావచ్చును.

పదార్థం అయినా శక్తి అయినా రెండూ ఒకటేనని "సాపేక్షతా సిద్ధాంతం" ప్రకారం ఆధునిక విజ్ఞాన శాస్త్రం వివరిస్తున్నది. "అణు బాంబు"ని ఈ సిద్ధాంతం యొక్క ఆధారంగానే నిర్మించుట జరిగినది. కనుక నక్షత్ర వ్యవస్థలోని పదార్థం (నక్షత్రంలో పదార్థం అంతా అగ్ని మరియు వాయువు రూపంలో ఉంటుంది) అయినా లేదా సౌరకుటుంబంలోని పదార్థం (గ్రహాలు, భూమి, నీరు, వాయువు, అగ్ని మొదలైన వాటితో నిర్మితమై ఉంటాయి) అయినా శక్తి రూపమే కాబట్టి, శక్తి అంతా కుదించుకుపోయి ఆఖరిదశలో అదృశ్యం అవుతుంది.

అనంతమైన శక్తి అంతా శూన్యంలో విలీనం చెందినపుడు అది భగవంతునిలో విలీనమవుతుందని ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి. ఇక్కడ ఆధునిక విజ్ఞాన శాస్త్రం మరియు ప్రాచీన శాస్త్రాలు ఒకే స్వరంతో పలుకుట గమనించమని పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాను. అంతేగాక నక్షత్ర వ్యవస్థలు మరియు సౌరకుటుంబాల గురించి పైన వివరించింది కూడా ప్రాచీన శాస్త్రాలలో చెప్పబడినట్లే వున్నది. ఈ విశ్వమంతా అయిదు తత్త్వాలతో నిర్మితమై వున్నదని శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే పైన నేను వివరించింది నాలుగు తత్త్వాల గురించే ! అయిదవది "ఆకాశము" అనే పదార్థము. దీనిని

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఇంకా ధ్రువపరచలేదు.

భగవంతుని నుండి శక్తి తిరిగి మరల విడుదల చేయబడినపుడు లేదా భగవంతుడే శక్తి రూపాన్ని గ్రహించినపుడు సృష్టి రచన మరలా ప్రారంభం అవుతుంది.

ఇక్కడ మరొక విషయాన్ని కూడా గమనించవలెనని విజ్ఞప్తి చేస్తున్నాను. భగవంతుని నుండి శక్తి ఎప్పుడూ వేరుపడుట జరుగదు. ఏ విధంగా అసంఖ్యాకమైన నక్షత్రవ్యవస్థలు అనంతమైన విశ్వమంతా వ్యాపించి ఉన్నవో, పరబ్రహ్మం కూడా ఆ పదార్థంలో వ్యాపించి వున్నాడని ప్రాచీన శాస్త్రాలన్నీ ఏకగ్రీవంగా నొక్కి మరీ చెబుతున్నాయి.

ఇక "భగవంతుడు" అనే పదం గురించి మానవులు ఎంతవరకు అర్థం చేసుకున్నారనే దాన్ని బట్టి విషయమంతా ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, భారతదేశంలోని "శాక్త సిద్ధాంతం" ప్రకారం పరాశక్తి అయిన మహామాయ, పురాణాలలో స్తుతించబడిన త్రిమూర్తులను సైతం ఒక వేగంగా ప్రయాణించే విమానం వంటి వాహనంలో కూర్చోనబెట్టి విశ్వమంతా త్రిప్పి అదేరూపంలో వున్న అదేరూపంలో వున్న అసంఖ్యాకమైన విష్ణువులను, బ్రహ్మదేవుళ్ళను మరియు శివులను దర్శింప చేయించిన విషయం "దేవీ భాగవతం"లో స్పష్టంగా చెప్పబడి వున్నది. ఇక పురాణాలలో స్తుతించబడిన "జగన్నాథుడు" అనే పదాన్ని ఎంతవరకు అర్థం చేసుకోవాలో ఆధునిక విజ్ఞాన శాస్త్రపరంగా విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను ! ఇది "జగత్తు" అనే పదానికి అర్థం ఏమిటనే దానినిబట్టి ఆధారపడి ఉంటుంది. "పాలపుంత" వంటి గెలాక్సీని జగత్తుగా గుర్తించాలా లేదా అనంతమైన విశ్వంలో లెక్కకుమించి వున్న నక్షత్ర వ్యవస్థ లన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలా ! అనే దానిని బట్టి ఉంటుంది.

ఒక ఉదాహరణ ద్వారా విషయాన్ని ఇంకా లోతుగా విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను !

పదివేల సూర్యులు సామూహికంగా ఒకేసారి ప్రకాశించినపుడు బహిర్గతం అయ్యే వెలుగు ఎంత తీక్షణంగా ఉంటుందో, తన తేజస్సు కూడా బహుశా

అలాగే ఉండి ఉండవచ్చునని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చాల స్పష్టంగా వివరించిన విషయం పాఠకులందరికీ సుపరిచితమే !

అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించవలెనని విజ్ఞప్తి చేస్తున్నాను. చీకటిగా ఉన్న ఒక పెద్ద గదిలో వంద దీపాలు వెలిగిస్తే ఎలా ఉంటుందో అదే ప్రకాశాన్ని కేవలం పది దీపాలు ఒకేసారి ఒకే దీపంగా వెలిగితే బహిర్గతమయ్యే తేజస్సుతో పోల్చవచ్చునని నా అభిప్రాయము. అంటే దీపాల సంఖ్యను కేవలం పదిరెట్లు చేసి గుణించమని చెప్పడం లేదు. దీపాల సంఖ్య ఎంత అయితే అంతే సంఖ్యతో గుణించవలెనని నా అభిప్రాయము. ఈ విధంగా తర్కించినపుడు, భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఉల్లేఖించినా పదివేల సూర్యుల తేజస్సుని మన పాలపుంత గెలాక్సీలో వ్యాపించి వున్న పది కోట్ల సూర్యులతో పోల్చవచ్చును. ఈ తర్కాన్ని ఇంకా పొడిగించి చూస్తే మరొక విషయం కూడా తెలుస్తుంది. ఒకవేళ గదిలో వున్న దీపాల మధ్యన దూరం ఎక్కువ అయితే అప్పుడు దీపాల సంఖ్యను మరింతగా పెంచవలసి రావచ్చును. అంటే ఒక విశాలమైన గదిలో వెలిగే పదివేల దీపాల తేజస్సు, ఒకేసారి వెలిగే పది దీపాల తేజస్సుతో పోల్చవచ్చును. ఈ లెక్కన చూస్తే ఒకేసారి ఒక్కటిగా వెలిగే పదివేల సూర్యుల తేజస్సుని అంతరిక్షంలో దూర దూరంగా వున్నా పదివేల కోట్ల సూర్యులతో కూడా పోల్చవచ్చును. లేదా ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండుటకు అవకాశం వున్నది.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం మన "పాలపుంత" నక్షత్ర వ్యవస్థలో దాదాపు 400 వందల బిలియన్లు (40 వేల కోట్లు) సూర్యులు వుండి ఉండవచ్చునని అంచనా వేయడం జరిగినది.

ఈ లెక్కన చూస్తే "పాలపుంత" లేదా "ఆకాశగంగ" గా పిలువబడుచున్న మన నక్షత్ర వ్యవస్థను ప్రాచీన పురాణాలలో స్తుతించబడిన జగన్నాథునితో పోల్చవచ్చును. అదేవిధంగా జగన్నాథుని నాభి పాలపుంత నక్షత్ర వ్యవస్థ యొక్క మహా కృష్ణబిలంతో పోల్చవచ్చును. ఆ నాభి ఉద్భవించిన బ్రహ్మదేవుని శరీరాన్ని లేదా "బ్రహ్మాండం" లేదా గోళాకారంలో "సుడిగుండం"లా తిరుగుచున్న మన సౌరకుటుంబంతో పోల్చవచ్చును. అయితే బ్రహ్మానందం

మహా కృష్ణబిలంలో విలీనం చెందడం జరుగుతుంది. కనుక నేను పైన వివరించింది దీనికి వ్యతిరేకమైనది అయిన సృష్టి నిర్మాణ నామయంలో జరిగే ప్రక్రియగా గమనించవలెనని పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ విషయాన్ని ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, "బిగ్ బ్యాంగ్" సిద్ధాంతం ప్రకారం సృష్టి రచన యొక్క ప్రారంభం శూన్యంలో జరిగే ఒక విస్ఫోటనముతో మొదలవుతుందని ఆధునిక విజ్ఞాన శాస్త్రం వివరిస్తున్నది. ప్రాచీన పురాణాలలో వివరించిన దానిని బట్టి జగన్నాథుని నాభి నుండి ఉద్భవించిన బ్రహ్మదేవుణ్ణి లేదా బ్రహ్మాండాన్ని పైన వివరించిన ఖగోళ ప్రక్రియతో పోలచవచ్చును.

ఆ తరువాత, ప్రాచీన పురాణాలలో వివరించినట్లు నేను "అనేకం" అవుగాక అని బ్రహ్మదేవుడు సంకల్పించడం జరుగుతుంది. అంటే "బ్రహ్మాండం" అయినా తన శరీరాన్ని అనేక పిండాండములు లేదా మానవ శరీరాలుగా మార్చి సమిష్టి స్థాయిలో ఒకవైపు తను "బ్రహ్మాండమని" మరియు వ్యక్తిగతస్థాయిలో ప్రతి మానవ శరీరాన్ని "పిండాండం"గా సృష్టి రచన చేయడం జరుగుతుంది.

అయితే ఇక్కడ పాఠకులందరూ ఒక విషయాన్ని విస్మరించరాదని విజ్ఞప్తి చేస్తున్నాను. జగన్నాథుడు మరియు బ్రహ్మదేవుడు వేరు వేరుగా ఏమీ వుండరు. అలాగే జగన్నాథుని నాభి నుండి అసంఖ్యాకమైన బ్రహ్మాండాలు కూడా ఉద్భవించుట జరుగుతుందని ప్రాచీన పురాణాలు చెబుతున్నాయి. ఈ బ్రహ్మాండాలను మన పాలపుంత గెలాక్సీలో వున్న ఇతర నక్షత్రాలతో పోల్చవచ్చును. అయితే అన్ని నక్షత్రాలలో మన సౌరకుటుంబం వలెనే గ్రహాలూ మరియు మానవులు వుంటారో లేదో ఇంతవరకూ ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి అంతుచిక్కని విషయం అనేది పాఠకులందరికీ పరిచితమే !

వ్యక్తిగత స్థాయిలో మానవుడు తన శరీరానికి తానే నాథుడునని లేదా తనను తన శరీరం కోసమేనని భ్రమపడుతూ ఉండుట జరుగుతుంది. అదే విధముగా బ్రహ్మాండానికి తానే నాథుడు కనుక "బ్రహ్మాండం" తన శరీరమని బ్రహ్మదేవుడు భ్రమపడుతూ ఉండుట జరుగుతుంది. అదే విధముగా

అసంఖ్యాకమైన బ్రహ్మాండాలకు లేదా పాలపుంత నక్షత్ర వ్యవస్థకు తానే నాథుడు కనుక "జగత్తు" తాన్ శరీరమని మరియు తాను జగన్నాథుడునని భగవంతుడు భ్రమపడుతూ ఉండుట జరుగుతుంది.

పరాశక్తి అయిన మహామాయ త్రిమూర్తులకు విశ్వమంతా వ్యాపించి వున్నా అసంఖ్యాకమైన నక్షత్రాల వ్యవస్థలను లేదా తమ రూపంలోనే వున్న అసంఖ్యాకమైన ఇతర త్రిమూర్తులను దర్శింప చేయించినట్లు "దేవీ భాగవతం"లో చెప్పబడి వున్నది.

అయితే అనంతమైన విశ్వమంతా వ్యాపించి వున్న పరబ్రహ్మం లేదా పరాశక్తి, జగత్తు అంతా వ్యాపించి వున్నా జగన్నాథుడు లేదా లక్ష్మి, బ్రహ్మాండం అంతా వ్యాపించి వున్నా బ్రహ్మదేవుడు లేదా సరస్వతి మరియు పిండాండం అంతా వ్యాపించి వున్నా మానవుడు లేదా కుండలినీ శక్తి అంతా ఒకే ఒకటి. అయితే శక్తి తిరోగమన దిశలోనికి వెళ్లి సృష్టి రచనను విధ్వంసం లేదా విలీనం చేస్తున్న సమయంలో శక్తిని "కాళి"గా మరియు బ్రహ్మాన్ని "శివుని"గా ప్రాచీన పురాణాలు స్తుతించాయి.

కనుక "భగవంతుడు" అనే పదాన్ని మానవులు ఎంతవరకు అర్థం చేసుకోవాలనుకున్న దానిని బట్టి విషయమంతా ఆధారపడి ఉంటుంది. అయితే ఇది కూడా ద్వైత భావనలో ఉన్నంత వరకే ఉంటుంది.

అంటే ద్వైత భావన సమాప్తమైన తరువాత లేదా బ్రహ్మజ్ఞానం లేదా ఆత్మజ్ఞానం ప్రాప్తించిన తరువాత ఇక జగత్తు లేదా విశ్వం లేదా తన శరీరం అనేది ఉండదు.

ద్వైత భావనలో ఉన్నంతవరకే అంటే ఆత్మజ్ఞానం ప్రాప్తించనంత వరకే నేను పైన వివరించిన సృష్టి రచనను నిజమని మానవులు నమ్ముతూ వుంటారు. అలాగే ప్రాచీన పురాణాలు, వేదాలు, శాస్త్రాలు వంటివి కూడా నిజమని మరియు శాశ్వతమైనవి అని భ్రమలో ఉండుట జరుగుతుంది.

పైన వివరించిన విషయాన్ని ఇంకా తర్కించుట చేసినచో, మన భూమండలం చుట్టూ వున్న అంతరిక్షాన్ని ప్రాచీన పురాణములలో 27 భాగములుగా విభజన చేయడం జరిగినది. ప్రతిభాగంలో కొన్ని నక్షత్రములు

ఉంటాయి. ఈ నక్షత్రాల సమూహము ఏదో ఒక ఆకారములో ఉంటుంది. అందువలన ప్రతిభాగానికి ఏదో ఒక పేరును పెట్టడం జరిగినది. ఉదాహరణకు ఏడు నక్షత్రాల ఒక సమూహాన్ని "సప్తఋషి" మండలం అంటారు.

అంతేగాక కొంతమంది గొప్ప గొప్ప ఋషులు ప్రాచీన కాలంలో వివిధ నక్షత్రాలుగా అవతరించినట్లు కూడా పురాణములు స్పష్టం చేస్తున్నాయి. ఉదాహరణకు ధృవనక్షత్రం గురించి పాఠకులకు తెలిసే ఉంటుంది. అయితే మన సౌరకుటుంబం మరియు దానిలో మనుగడ సాగిస్తున్న మన మానవజాతి ఉన్నా లేక ప్రళయం వచ్చి నశించిపోయి మరలా తిరిగి సృష్టి ప్రారంభమైనా ఈ ఋషులు మాత్రం మానవులకు దర్శనం ఇస్తూనే ఉంటారు. అంటే ఈ ఋషులు లేదా నక్షత్రాలు మన పాలపుంత గెలాక్సీ యొక్క అంతర్గతం. అంటే జగన్నాథుడు నిద్రపోనంతవరకూ లేదా నక్షత్ర వ్యవస్థ మొత్తం మహా కృష్ణబిలంలో విలీనం చెందనంత వరకు మాత్రమే ఈ నక్షత్రములు అంతరిక్షంలో మనుగడ సాగిస్తాయని స్పష్టమవుతుంది.

విషయాన్ని ఇంకా తర్కించినచో మన భూమండలం మీద మనుగడ సాగించే మానవులకు మినహాయించి మన సౌరకుటుంబంలో మరే ఇతర గ్రహముమీద మానవులు ఉండరని స్పష్టమవుతుంది. అయితే ఇది కేవలం మన సౌరకుటుంబానికి మాత్రమే వర్తిస్తుంది. సిద్ధాంత పరంగా చూస్తే మాత్రం మన గెలాక్సీలో వుండే ఇతర నక్షత్రాలలో కూడా దీన్ని ఎన్నో సౌర కుటుంబాలు మరియు వాటిలో మానవ నాగరికతలు తప్పకుండా వుంది వుంటాయని చెప్పవచ్చును. అలాగే ఇతర నక్షత్ర వ్యవస్థలలో సైతం మొత్తం సృష్టి రచన ఇదే విధంగా జరిగి ఉంటుందని చెప్పవచ్చును.

ఈ తర్కాన్ని ఇంకా క్షుణ్ణంగా విశ్లేషణ చేసినచో, మానవులు అనుభూతి చెందుచున్న ఈ జగత్తులో మన ప్రాచీన పురాణాలలో వివరించిన విధంగా మిగిలిన అన్ని ఇతర లోకాలు (మొత్తం 14 లోకాలు) భూమండలానికి పైన మరియు క్రింద అంతరిక్షంలో ఎక్కడో ఒక ప్రదేశంలో మనుగడ సాగిస్తున్నాయని చెప్పవచ్చును.

ఉదాహరణకు పురాణాలలో స్వర్గలోకం లోని ఒక సంవత్సర కాలాన్ని భూమండలం మీద వంద సంవత్సరాలతో పోల్చి చెప్పడం జరిగినది. ఇది మనం మనసులో అనుభూతి చెందే "సమయం" అనే "ఆలోచన" లోని వ్యత్యాసం. స్వర్గ లోకానికి మరియు భూలోకానికి వంద రేట్లు తేడా వున్నది. దీని అర్థం స్వర్గ లోకానికి వెళితే సమయం యొక్క వేగం వందరెట్లు తగ్గిపోతుంది. అయితే "సమయం" యొక్క వేగం అనేది కేవలం మనసులో అనుభవానికి వచ్చే అనుభూతి మాత్రమే ! ఇంతకు మించి "సమయం" అనే పదానికి ఎక్కడా మనుగడ సాగించుటకు అస్తిత్వమే లేదు. అయితే భూలోకంలో మానవుడు మనుగడ సాగిస్తున్నాడు కనుక, పంచ భూతముల నియమాల క్రింద ప్రాపంచిక భ్రమలో ఉన్నంత వరకు "సమయం" అనే భావన కూడా ఎప్పుడూ మనసులో వెంటాడుతూనే ఉంటుంది. మనసులో ఆలోచనలు రావడం ఆగిపోయిన తరువాత అంటే సమాధి స్థితిలో సమయం అనే పదానికి అసలు అర్థమే ఉండదు.

అయితే ప్రాపంచిక భావనతో చూస్తే, భూమండలం సూర్యుని చుట్టూ వందసార్లు తిరిగితే అంతరిక్షంలో స్వర్గలోకం ఉన్న ప్రదేశంలో ఒక సంవత్సరకాలం గడిచిపోతుంది. సౌరమానం ప్రకారం కాలాన్ని లెక్కించాలనుకుంటే స్వర్గలోకం వున్న ప్రాంతం సూర్యుని చుట్టూ ఏదో ఒక కక్ష్యలో ఒకసారి తిరిగి రావలసి వున్నది. అప్పుడు సౌరమానం ప్రకారం స్వర్గలోకంలో ఉండేవారికి ఒక సంవత్సరం గడిచిపోయినట్లు లెక్కకు వస్తుంది. ఈ ప్రక్రియ జరుగుతున్న వ్యవధిలో పురాణాలలో చెప్పబడిన దాని ప్రకారం భూలోకంలో వంద సంవత్సరాలు గడచి పోవాలి. అయితే ప్రాచీన పురాణాలలో సమయాన్ని "చంద్రమానం" ప్రకారం లెక్కించుట జరిగినది. చంద్రమానం ప్రకారం సమయాన్ని కొలిచి చూస్తే చంద్రమండలం భూమండలం చుట్టూ 360 మార్లు (30X12నెలలు) తిరిగినప్పుడు భూమండలం మీద ఒక సంవత్సరకాలం గడిచిపోయినట్లు లెక్కకు వస్తుంది. అయితే సౌరమానం ప్రకారం ఈ వ్యవధిలో భూమి కూడా సూర్యుని చుట్టూ ఒకసారి తిరిగి వస్తుంది. ఈ లెక్కన చంద్రుడు భూమిచుట్టూ 36,000 మార్లు

తిరిగితే భూలోకంలో వంద సంవత్సరాలు గడిచి పోతాయి. అంటే స్వర్గలోకంలోని ఒక సంవత్సరంతో సరి సమానం అవుతుంది.

పైన తర్కించిన విధముగా ఆలోచిస్తే స్వర్గలోకం వుండే ప్రాంతం సూర్యుని నుండి చాలా దూరంలో వుండి ఉండవచ్చని స్పష్టమవుతుంది. మన భూమండలం సూర్యుని నుండి ఎనిమిది కాంతి నిమిషాల దూరంలో ఉన్నది. అంటే కాంతి పుంజం సూర్యుని నుండి మన భూమండలానికి చేరే సమయం! కాంతి పుంజం యొక్క వేగం ఒక "సెకను"లో మూడు లక్షల కిలోమీటర్లు అనే విషయం పాఠకులందరికీ సుపరిచితమే!

ఈ లెక్కన చూస్తే ఎనిమిది కాంతి నిమిషాల దూరంలో వున్న కారణం చేత భూమి ఒకసారి సూర్యుని చుట్టూ తిరిగి వచ్చుటకు దాదాపు ఒక సంవత్సరకాలం పడుతుంది. అంటే చంద్రుడు భూమి చుట్టూ 360 సార్లు భ్రమణం చేయుట జరుగుతుంది. అయితే స్వర్గలోకపు ఒక సంవత్సర కాలానికి సరిసమానంగా కాలాన్ని కొలవాలంటే భూమండలం వంద సార్లు సూర్యుని చుట్టూ తిరగవలసి వున్నది. ప్రాచీన పురాణాలలో చెప్పబడిన ఈ వ్యత్యాసాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, స్వర్గలోకం సూర్యుని నుండి చాలా దూరంలో వున్నది కనుక ఒకసారి తిరిగి వచ్చుటకే చాల సమయం (భూలోకం మీద వంద సంవత్సరాలు) పడుతుందని స్పష్టమవుతున్నది. అంటే వంద రెట్లు తేడా ఉండుట చేత, స్వర్గలోకం సూర్యునినుండి దాదాపు ఎనిమిది వందల కాంతి నిమిషాల దూరంలో ఉండి ఉండవచ్చునని అంచనా వేయవచ్చును. కనుక భూమండలం నుండి స్వర్గలోకానికి దూరం 79.2 (800-8) కాంతి నిమిషాలు అయివుండవచ్చునని అంచనా వేయవచ్చును.

అంతేగాక హిందూ పురాణాలలో వివరించినట్లుగా స్వర్గలోకానికి చక్రవర్తి అయిన ఇంద్ర భగవానుని అధీనంలో భూమండలం చుట్టూ మేఘాలు తిరుగుచూ ఉంటాయి. అలాగే భూమండలం చుట్టూ విస్తరించి వున్న వాయుదేవుడు, అగ్నిదేవుడు మరియు వివిధ గ్రహములు అన్నీ ఇంద్రభగవానుని కొలువులోనే వుంటారు. ఈ లెక్కన చూస్తే మానవులకు అనుభవానికి వచ్చే మన బ్రహ్మాండం కేవలం మన సౌరమండలానికి మాత్రమే

పరిమితమైనది చెప్పవచ్చును. అంతా కేవలం "పాలపుంత" లేదా "ఆకాశగంగ"గా పిలవబడుతున్న మన నక్షత్ర వ్యవస్థ మాత్రమేనని తెలుస్తుంది.

ఇదే పద్ధతిలో జగత్తులో ఉన్న మిగిలిన లోకాలు వుండే ప్రాంతాలను గుర్తించుటకు వీలవుతుందని చెప్పవచ్చును. ఈ అధ్యాయాన్ని ముగించే ముందు, ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం, నక్షత్ర వ్యవస్థల గురించి ఒక వింతైన విషయాన్ని పాఠకుల ముందు ఉంచదలచుకున్నాను ! దీనితో దృశ్యమాన జగత్తు యొక్క అస్తిత్వం కేవలం భ్రమపూరితమైనదనే విషయం పాఠకులకు సులభంగా అర్థమవుతుందని భావిస్తాను.

ఉదాహరణకు మనం ఏదైనా ఒక నక్షత్రాన్ని తిలకిస్తాము. అంతరిక్షంలో మెరుస్తూ కనిపించే ఆ నక్షత్రం భూమినుండి లక్ష కాంతి సంవత్సరాల దూరంలో ఉందనుకుందాము. అంటే ఆ కాంతి మనకు చేరడానికి లక్ష సంవత్సరాల సమయం పడుతుంది. అంటే ప్రస్తుతం మనం తిలకిస్తున్న ఆ నక్షత్రం ఇప్పటిది కాదు. లక్ష సంవత్సరాల క్రిందట ఆ నక్షత్రం నుండి బయలుదేరిన కాంతి పుంజం నేటికీ మన భూమండలానికి చేరింది. అందువలన ప్రస్తుతం దానిని మనం తిలకించగలుగుతున్నాము. అంటే మనం తిలకిస్తున్నది కేవలం ఆ నక్షత్రం యొక్క దెయ్యపు బొమ్మని ! అంతరిక్షంలో లక్ష సంవత్సరాలు ప్రయాణించి మన కళ్ళకు చేరుతున్న కాంతి అది ! ప్రస్తుతం ఆ నక్షత్రం ఇంకా బతికి ఉన్నదో లేదో కూడా తెలియదు.

ఉదాహరణకు పైన వివరించిన ఆ నక్షత్రం ఈ రోజు ఏదో కారణం చేత రెండు ముక్కలుగా పేలిపోయిందనుకోండి ! ఆ వార్త మనకు తెలియడానికి మరొక లక్ష సంవత్సరాల సమయం పడుతుంది. అప్పటికి మనము బ్రతికి ఉందాము. అయితే నేటి నుండి లక్ష సంవత్సరాల తరువాత ఈ భూమండలం మీద నివసించే జనానికి మాత్రం రెండు ముక్కలు కనిపిస్తాయి. ఆ నక్షత్రం ఒకానొక సమయంలో ఒకటిగా ఉండేదని వారికి ఎప్పటికీ తెలియబోదు. దీనిని బట్టి పాఠకులు ఈ దృశ్యమాన జగత్తు అనేది కేవలం ఒక ఎండమావి వంటిది అని సులభంగా గ్రహించగలరని భావిస్తాను.

ఈ దృశ్యమాన జగత్తు, ప్రాచీన శాస్త్రాలలో వివరించబడిన లోకాలు, దేవుళ్ళు, దేవతలు, ఆధునిక విజ్ఞాన శాస్త్రం చెబుతున్న ఖగోళ ప్రక్రియలు మొదలైనవన్నీ, మానవునికి కేవలం ద్వైతభావనలో ఉన్నంతవరకే అనుభూతికి వస్తాయి. సమాధిలో ఆలోచన రహిత స్థితిలో స్థిరపడిన తరువాత ఇవి అన్నీ శాశ్వతంగా మాయమవుతాయి. అంతేగాక ఈ జగత్తు అంతా కేవలం ఎండమావి వంటిదని స్పష్టమవుతుంది. ఇంకా చెప్పాలంటే తానొక మానవుడినన్న భావన సైతం మానవునికి విలీనమై పోతుంది మరియు ఈ అనంత విశ్వంలో ఉన్నది కేవలం తాను మాత్రమేనని స్పష్టమవుతుంది.

# సృష్టి రచనా క్రమం

సృష్టి రచన జరుగక ముందు అంటే ఆధునిక విజ్ఞానశాస్త్రం చెబుతున్న "బిగ్ బ్యాంగ్" సిద్ధాంతం ప్రకారం అంతరిక్షంలో విస్ఫోటనము జరుగక ముందు అంతరిక్షంలో ఏమీ లేదు. కేవలం శూన్యం మాత్రమే ఉండేది. అటువంటి స్థితిని భగవంతునికి రాత్రివేళ అని చెప్పవచ్చును. నిద్రిస్తున్న సమయంలో అహం దాదాపు విలీనమై ఉంటుంది. కాబట్టి భగవంతునికి తాను జగన్నాథుడిని అనే భావన వుండి ఉండదు. ఇంకా జగత్తు యొక్క సృష్టి రచన జరుగలేదు కాబట్టి తాను జగత్తుకు నాథుడననే భావన భగవంతునిలో ఇంకా పుట్టలేదని అర్థం ! ఈ స్థితిలో శక్తి సంపూర్ణంగా భగవంతునిలో విలీనం అయి ఉంటుంది. అంటే ఉన్నది అంతా కేవలం బ్రహ్మం లేదా భగవంతుడు మాత్రమే ! కనుక అంతరిక్షం లేదా శూన్యం అనే పదాలకు కూడా అసలు అర్థం లేదు. అంతరిక్షం అయినా, శూన్యం అయినా జగత్తు యొక్క అంతర్గతం అవుతాయి. ఎందుకంటే శక్తి సంపూర్ణంగా బ్రహ్మంలో విలీనమై వున్నది కాబట్టి ! అంతరిక్షం లేదా శూన్యం అనే పదాలు మానవుని మనసులో ఉద్భవించిన భావనలు మాత్రమే ! కనుక అసలు సృష్టిరచనే జరుగని స్థితిలో ఈ పదాలకు కూడా ఎటువంటి అర్థం లేదు.

కనుక భగవంతునిలో శక్తి విలీనమై ఉన్న స్థితిని "శివతత్త్వము" అని శాస్త్రాలలో చెప్పబడినది. భగవంతునిలో సృష్టి రచన చేయుటకు "సంకల్పం"

ఉదయించగానే శక్తియొక్క స్పందన ప్రారంభమవుతుంది. అయితే భగవంతుని యొక్క ఈ సంకల్పాన్ని మానవునిలో ఉద్భవించే ప్రాపంచిక సంకల్పంతో పోల్చలేము. ఎందుకంటే మానవునిలో ఉదయించే సంకల్పము మరియు వికల్పము అనే భావనలు వ్యక్తిగత స్థాయిలో సృష్టి రచన జరిగిన తరువాత మనోమయ కోశం యొక్క అంతర్గతం అవుతాయి. అంటే అప్పటికే మాయ, బుద్ధి మరియు అహం జన్మించి ఉంటాయి. కానీ ఇక్కడ మనం సమిష్టిస్థాయిలో సృష్టిరచన జరుగకముందు ఉండే భగవంతుని యొక్క స్థితిని లేదా శివతత్త్వాన్ని విశ్లేషణ చేస్తున్నాము. కనుక "నేను అనేకం అవుగాక" అని భగవంతునిలో ఎప్పుడైతే భావన లేదా దివ్య సంకల్పం ఉదయిస్తుందో ఆ తరువాతే శక్తి యొక్క స్పందన ప్రారంభమవుతుంది.

శక్తి యొక్క స్పందన అంటే కదలిక. అసలు కదలిక అంటేనే శక్తి అనే విషయం ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి మరియు పాఠకులందరికీ సుపరిచితమే! కనుక శక్తి యొక్క ఈ కదలికను "నాదము" అంటారు. ఎందుకంటే "నాదము" అనే పదానికి సంస్కృతంలో కదలిక అని అర్థం కాబట్టి ! అయితే ఈ నాదం లేదా కదలిక భగవంతుని నుండి బహిర్గతం అయిన తరువాత వృత్తాకారంలో తిరుగుట జరుగుతుంది. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు భగవద్గీతలో కూడా వివరించుట జరిగినది. ఇది సృష్టి రచనకు అవసరం కనుక ఇలా జరుగుతుంది. ఎప్పుడైతే శక్తి భగవంతునిలో నాద రూపంలో ప్రకటితమైనదో లేదా భగవంతుడు "నేను అనేకం అవుగాక" అని సంకల్పించాడో, ఆ స్థితిని "శక్తి తత్త్వము" అని శాస్త్రాలలో వివరించబడినది. అయితే శక్తి తత్త్వము నాదరూపమవుట చేత దానిని నాద తత్త్వము అనికూడా పిలుచుట జరిగినది. శక్తి లేదా నాదం తిరుగుట ప్రారంభించిన తరువాత దానిని "బిందు తత్త్వము" అంటారు.

శబ్దం నాద తత్త్వములో వున్నపుడు దానిని "పరా" స్థితి అంటారు. నాద తత్త్వము నుండి బిందు తత్త్వముగా పరిణామము చెందినపుడు, శబ్దం "పశ్యంతి" స్థితిలో వున్నది అంటారు. రెండూ కలిసిన "ఓమ్" శబ్దాన్ని శక్తి తత్త్వము అంటారు. మొదట వున్నది శివ తత్త్వము అయితే రెండవది శక్తి

తత్త్వము ! లేదా బ్రహ్మం మరియు "శబ్ద బ్రహ్మం" అని కూడా అంటారు. అయితే ఈ ప్రక్రియ ఇంతటితో ఆగదు.

"నేను అనేకం అవుగాక" అని భగవంతుడు సంకల్పం చేయడం జరుగుతుంది. అయితే ఈ సంకల్పానికి మూడు అంగాలు ఉంటాయి. మొదటిది "ఇచ్ఛ" అంటారు. ఈ స్థితిలో వున్న భగవంతుణ్ణి సదాశివ తత్త్వము అంటారు. రెండవది జ్ఞానము. ఈ స్థితిని ఈశ్వర తత్త్వము అంటారు. మూడవది "క్రియ". ఈ స్థితిని "శుద్ధ విద్య" తత్త్వము అంటారు. అయితే ఇచ్ఛ, జ్ఞానము మరియు క్రియ అనేవి బిందు తత్త్వము తరువాత వస్తాయి. అందువలన ఈ మూడింటిని కలిపి "మహా బిందు" లేదా "త్రి బిందు" లేదా "కామ కళ" అని కూడా అంటారు. ఇచ్ఛ, జ్ఞానము మరియు క్రియలకు ప్రతిరూపమైన "కామ కళ"ను శబ్దము యొక్క "మధ్యమ స్థితి అని కూడా అంటారు.

ఇంతవరకు పైన వివరించిన దానిని బట్టి పాఠకులకు ఒక విషయం స్పష్టంగా అర్థమయ్యే ఉంటుందని భావిస్తున్నాను. ఒకవైపు బ్రహ్మం (సమిష్టి స్థాయిలో), సృష్టి రచన ప్రారంభం కాగానే అయిదు తత్త్వాలలో పరిణామం చెందుట జరుగుతుంది. మొదటిది శివ తత్త్వము, రెండవది శక్తి తత్త్వము, మూడవది సదాశివ తత్త్వము, నాల్గవది ఈశ్వర తత్త్వము మరియు అయిదవది శుద్ధవిద్య తత్త్వము. అదే సమయంలో రెండోవైపు, సృష్టి రచన ప్రారంభమయినది కాబట్టి శివతత్త్వము నుండి "శబ్ద బ్రహ్మము" లేదా శక్తి తత్త్వముగా భగవంతుడు పరిణామం చెందుట జరుగుచున్నది. శబ్ద బ్రహ్మం అంటే ఓంకారం. దీనికి ముందు శక్తి సంపూర్ణంగా విలీనమై వున్న కారణంచేత శివతత్త్వములో సృష్టిరచన ప్రారంభం కాలేదు అని అర్థం ! ఓంకారము నుండి అసలు సృష్టి ప్రారంభమైనది చెప్పవచ్చును. ఇక్కడ ఓం శబ్దం కూడా ముందుగా నాద తత్త్వము మరియు ఆ తరువాత బిందు తత్త్వముగా పరిణామం చెంది "పరా" మరియు "పశ్యంతి" రూపాలతో ఉంటుంది. ఆ తరువాత స్థూలంగా మార్పుచెంది "మధ్యమ" స్థాయిలో "కామకళ"గా రూపాన్ని సంతరించుకుంటుంది.

ఇక ఇక్కడ నుండి సృష్టి రచన ప్రారంభమవుతుంది. అయితే సృష్టి క్రమాన్ని వివరించే ముందు పాఠకుల కోసం పైన ఉల్లేఖించిన "కామకళ" గురించి మరికొన్ని విషయాలను వివరిస్తాను. "కామకళ" అనేది శబ్దం యొక్క ఒక స్థితి. పరా మరియు పశ్యంతి తరువాత వచ్చే "మధ్యమ" స్థితి ! అంటే ఓంకారం యొక్క స్థూల స్థితి అని చెప్పవచ్చును. ఇక్కడ పాఠకులు అర్థం చేసుకోవలసినది ఏమిటంటే, శబ్దం ఇంకా ముక్కలుగా అంటే "మాతృకలు"గా అంటే సంస్కృత వర్ణమాల యొక్క అక్షరాలుగా పగులగొట్ట బడలేదు. మధ్యమ స్థితిలో కామకళ లేదా స్థూలరూపాన్ని గ్రహించిన "ఓం" శబ్దం ఇంకా ఒకటిగానే వున్నది. అయితే దీనికి ఇచ్ఛ, జ్ఞానము మరియు క్రియ అనే మూడు అంగాలు వున్న కారణంగా "కామకళ"ను భగవంతుని యొక్క అహంగా చెప్పవచ్చును. అయితే భగవంతుడు ఇంకా "మాయ" ఆవరణలో కప్పబడి లేడు. కనుక ఇంతవరకు జరిగిన సృష్టిరచన అంటే స్థూలరూపంలో వున్నా ఓంకారమును స్వచ్ఛమైన సృష్టి అని చెప్పవచ్చును. "కామకళ" గురించి ఇంకా చెప్పాలంటే ఇది మూడు గుణాలతో ఉంటుంది. ఇచ్ఛకు ప్రతీక అయిన బిందు, జ్ఞానానికి ప్రతీక అయిన నాదం మరియు "క్రియ"కు ప్రతీక అయిన బీజ స్థితులు. బిందువు తెలుపు రంగుకి, చంద్రునికి మరియు ప్రకాశానికి కూడా ప్రతీక. నాదం ఎరుపు రంగుకి, అగ్నికి మరియు విమర్శకు ప్రతీక. అలాగే బీజస్థితి తెలుపు మరియు ఎరుపు మిశ్రమానికి, సూర్యునికి మరియు ప్రకాశము – విమర్శ యొక్క మిశ్రమానికి ప్రతీక అంటారు.

ఇక ఇక్కడ నుండి సృష్టి రచనా క్రమాన్ని వివరిస్తాను !

సృష్టి రచన రెండువిధములుగా జరుగుతుంది ! మొదటిది శబ్ద ప్రపంచము మరియు రెండవది అర్థ ప్రపంచము. అంటే నామము మరియు రూపము ! లేదా నామము మరియు దృశ్యమాన జగత్తు ! రెండూ సమాంతరంగా సృష్టింపబడినాయి. శబ్దప్రపంచమంతా పాఠకులకు సుపరిచితమైన మంత్రం శాస్త్రం మీద ఆధారపడి ఉన్నది. దృశ్యమాన జగత్తు మంత్రం శాస్త్రానికి సమాంతరంగా సృష్టింపబడినది. కాబట్టి మంత్రం యొక్క ప్రభావం చేత దృశ్యమాన జగత్తులో పరిణామం తీసుకురావచ్చును. అంటే

మహిమలు మరియు సిద్ధులకు మంత్రాలతో వున్నా సంబంధం అన్నమాట !

ముందుగా శబ్దప్రపంచం లేదా మంత్రశాస్రం గురించి వివరిస్తాను !

శబ్ద ప్రపంచం ఇంతకుముందు వివరించిన "కామకళ" అనే శబ్దం యొక్క స్థితినుండి ప్రారంభం అవుతుంది. ఈ స్థితిలో శబ్దం "వైఖరి" స్థితిలో ఉంటుంది.

వైఖరి స్థితిలో శబ్దం రెండు స్థాయిలలో ఉంటుంది. మొదటిది సూక్ష్మస్థాయి మరియు రెండవది స్థూలస్థాయి ! మానవులు మాట్లాడే స్తతిలో వుండే శబ్దాన్ని లేదా వినగలిగే స్థితిలో వుండే శబ్దాన్ని "వైఖరి" అంటారు. పెదవుల ద్వారా బయటకు వచ్చే శబ్దం స్థూలస్థాయిలో ఉంటుంది. పెదవులు కదిలించకుండా కేవలం మనసులో మననం చేసుకునే శబ్దం సూక్ష్మస్థాయిలో ఉంటుంది. అయితే "వైఖరి" స్థితిలో వుండే శబ్దం పగులగొట్టబడిన "ఓం"కారము అని చెప్పవచ్చును. అంటే "ఓం" అనే శబ్దం ఏబది ముక్కలుగా పగులగొట్టబడినది అని చెప్పవచ్చును. ఈ ఏబది ముక్కలు రెండు స్థితులలో ఉంటాయి. మొదటి స్థితిలో వీటిని మాతృకలు అంటారు. రెండవ స్థితిలో వీటిని సంస్కృత వర్ణమాల యొక్క అక్షరాలు అంటారు. అక్షరాలతో పదాలు మరియు వాక్యాలు నిర్మితమైనాయి ! వీటితో మంత్రశాస్త్రం యొక్క నిర్మాణం కూడా జరిగినది.

ఇక అర్ధ ప్రపంచం గురించి వివరిస్తాను !

ఇంతకుముందే వివరించినట్లు "కామకళ" స్థాయిని భగవంతుని యొక్క అహంగా చెప్పవచ్చును. ఆ తరువాత "శక్తి" "మాయ"గా పరిణామం చెందుతుంది. అనంతమైన బ్రహ్మం లేదా వ్యక్తిగత స్థాయిలో వున్న "ఆత్మ" మీద "మాయా" ఆవరణాన్ని కప్పివేస్తుంది. దీనితో అశుద్ధమైన సృష్టిరచన ప్రారంభమవుతుంది. లేదా సృష్టిరచనకు కారణమవుతుంది. ఈ స్థితిలో ఆత్మ మీద వ్యక్తిగత స్థాయిలో కారణం శరీరం యొక్క నిర్మాణం మొదలవుతుంది. కారణ శరీరం మీద కప్పివున్న మాయా ఆవరణను ఆనందమయ కోశం అనికూడా పిలుస్తారు. అంటే జీవుని కప్పివుంచే ఐదు కోశాలలో ఇది మొదటిది అని అర్ధం !

కారణ శరీరం యొక్క నిర్మితం ఐదు కంచుకలు, పురుషుడు మరియు

ప్రకృతితో జరుగుతుంది.

ముందుగా ఐదు కంచుకలను గురించి విశ్లేషణ చేస్తాను. మొదటిది "కాలము". అంటే సమయానికి సంబంధించిన నిబంధన. ఆత్మకు సమయం అనేది ఎప్పుడూ బంధం కాదు. ఆత్మ అనాది అని కూడా అంటారు. ఆత్మ అసలు ఎప్పటినుండి మొదలైనది చెప్పడానికి సాధ్యం కాదు ! ఎందుకంటే అది శాశ్వతమైన పరబ్రహ్మం యొక్క రూపం కాబట్టి ! అయితే మాయ యొక్క ప్రభావం చేత అనంతమైన ఆత్మ మీద "సమయం" అనే భావనను ముద్రించుట జరుగుతుంది. అంటే మొదటిసారిగా జీవుని ఆత్మ భ్రమలో పడిపోవుట జరుగుతుందన్నమాట ! అయితే ప్రస్తుతానికి ఈ భ్రమ సమయానికి సంబంధించినది మాత్రమే !

ఆ తరువాత జీవాత్మ "నియతి" అనే నిబంధనకు లోనవుతుంది. "నియతి" అంటే జీవాత్మ మీద పరిమితమైన భావనను ముద్రించుట ! అనంతమైన ఆత్మ అంటే సర్వమూ వ్యాపించి ఉన్న ఆత్మకు, తాను పరిమితమైనదనే భావనను ఏర్పరచడం !

ఈ విషయాన్ని మరికొంచెం వివరిస్తాను !

పరబ్రహ్మం లేదా భగవంతునికి ఆది మరియు అంతం అనేవి వుండవు అని శాస్త్రాలు చెబుతున్నాయి. అంటే భగవంతుణ్ణి ఒక గుండ్రటి చక్రముగా కల్పనా చేస్తే, ఆ చక్రము యొక్క మధ్యస్థము ఎక్కడో ఎవరికీ తెలియదు. అంటే ఆ చక్రానికి మధ్యస్థము అనేది అసలు ఉండదు అని అర్థం ! అదేవిధంగా ఆ చక్రము యొక్క అంచు కూడా ఎక్కడో ఎవరూ చెప్పలేరు ! అంటే పరబ్రహ్మం అనంతమైన విశ్వమంతా వ్యాపించి ఉన్నాడని అర్థం ! దీనినిబట్టి స్పష్టమవుతున్న భావన ఏమిటంటే అనంతమైన ఈ విశ్వమే భగవంతుడు అని లేదా అసలు ఉన్నదంతా కేవలం భగవంతుడు మాత్రమే అని అర్థమవుతుంది. ఇక జీవాత్మ విషయానికి వస్తే అది కూడా భగవంతునివలె సర్వమూ వ్యాపించి ఉన్నదని శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే జీవాత్మను కూడా గుండ్రటి చక్రముగా కల్పనా చేస్తే, ఆ చక్రము యొక్క మధ్యస్థము మాత్రం జీవుని శరీరంలో ఉన్నదని శాస్త్రాలు చెబుతున్నాయి. కానీ ఆ చక్రము

యొక్క అంచు మాత్రం భగవంతునివలె అనంతమైనది కూడా చెప్పబడినది. కనుక రెండూ అనంతమైనవి ! కానీ ఈ విశ్వమంతా ఒకటి ముందే (పరబ్రహ్మం) వ్యాపించి ఉన్నది. కనుక, ఒకే ప్రదేశంలో రెండూ ఉండుట సంభవము కాదు. ప్రాపంచిక తర్కంతో ఆలోచించినా ఇది అర్థరహితమైన భావన. కాబట్టి ఇంతకు ముందు వివరించినట్లు విశ్వమంతా వ్యాపించి ఉన్నది కేవలం బ్రహ్మం మాత్రమే ! జీవాత్మలన్నీ అగ్నిలో నుండి పుట్టే కణికలు వంటివని చెప్పవచ్చును. అంటే పరబ్రహ్మం యొక్క అంతర్గతమేనని అర్థం ! కానీ మాయా ఆవరణ కప్పబడుటవలన, నియతి అనే పరిమిత భావన ముదిరింపబడుట చేత అనంతమైన జీవాత్మ తను పరిమితమైనదని భావించుట ప్రారంభిస్తుంది.

ఆ తరువాతది "రజస్సు" అనే గుణము. ఈ నిబంధన కారణము చేత జీవాత్మ మీద మోహము అనే నిబంధన ఏర్పడుట ప్రారంభమవుతుంది. ఈ విషయాన్ని సునిశితంగా పరిశీలన చేసినచో, ప్రాపంచిక తర్కముతో ఆలోచించినా కూడా ఒక విశేషమైన అర్థం స్పష్టమవుతుంది. అనంతమైన విశ్వమంతా వ్యాపించి ఉన్న పరబ్రహ్మానికి "మోహము" అనే భావన ఎక్కడి నుండి ఉంటుంది? ఇష్టత మరియు అయిష్టత అనేవి మాయా పూరితమైన ఆవరణలు కనుక పరబ్రహ్మమువలె అనంతమైన జీవాత్మ మీద కూడా మామూలుగా ఇటువంటి నిబంధన వుండి వుండకూడదు. కానీ మాయా పూరితమైన కంచుకలతో బంధింపబడుట చేత జీవాత్మ మీద ఈ నిబంధన ఏర్పడుట జరుగుతుంది.

ఆ తరువాతది "విద్య" అనే నిబంధన ! పరబ్రహ్మం లేదా ఆత్మకు సర్వమూ తెలుసు ! అనంతమైన జ్ఞానము బ్రహ్మం యొక్క లక్షణము. అటువంటి పరమాత్మ మీద ఈ నిబంధన ఏర్పడుట చేత జీవాత్మ మాయలో కూరుకుపోవుట జరుగుతుంది. అంటే తనకు తెలిసినది పరిమితమైన జ్ఞానము అనే భావన ముదిరింపబడుట ప్రారంభమవుతుంది.

ఆ తరువాతది "కళ" అనే నిబంధన ! దీని అర్థం జీవాత్మ మీద తాను పరిమితము అనే భావన ముద్రింపబడుట జరుగుతుంది. ఇది

ఇంతకుముందు "నియతి" అనే కంచుక గురించి వివరించిన భావన కాదు. నియతి అనేది జీవాత్మ చుట్టూ విస్తరించివున్న ఆకాశము లేదా అంతరిక్షము గురించి ఉన్న నిబంధన. "కళ" అనేది జీవాత్మకు తన మీద ఉన్న లేదా తన సామర్థ్యం గురించి ఉండే నిబంధన ! అంటే అనంతమైన సామర్థ్యం కల జీవాత్మ మీద తాను పరిమితమైన సామర్థ్యం కలిగినదని భావన ముద్రింపబడుతుంది.

కనుక జీవాత్మ మీద కప్పివున్న మాయా ఆవరణ కాలము, నియతి, రజస్సు, విద్య మరియు కళ అనే ఐదు విషయాలకు సంబంధించి ఉంటుంది. దీనితో ఒకవైపు జీవాత్మ "పురుషునిగా" (అంటే మానవునిగా) పరివర్తన చెందుతుంది. మరియు రెండోవైపు ప్రకృతి యొక్క సృష్టి రచన జరుగుతుంది. అంటే జీవాత్మ పురుషునిగా (అంటే మానవునిగా) అవతారము ఎత్తి తనమీద ఏర్పడిన నిబంధనలను అనుభూతి చెందుటకు మాధ్యమము అనేది ఒకటి కావాలి కాబట్టి ప్రకృతి అనే అనుకూలమైన భావన సృష్టిరచన చేయబడుతుంది. దీని అర్థం, ఉదాహరణకు "వేడి" అనే భావనను అనుభూతి చెందుటకు, అగ్ని బాహ్య ప్రపంచంలో మాధ్యమముగా పని చేస్తుంది. అదే విధముగా అపరిమితమైన ఆత్మ, పరిమితమైన జీవాత్మగా లేదా పురుషునిగా (మానవునిగా) ఐదు కంచుకలని అనుభూతి చెందుటకు ప్రకృతి అనే బాహ్య జగత్తు ఏర్పడుతుంది.

దీని తరువాత సృష్టిరచనా క్రమంలో ఏర్పడేది "బుద్ధి" లేదా "మహత్". దీని తరువాత "అహంకారము" ఏర్పడుతుంది. అయితే "బుద్ధి" మరియు "అహంకారము" రెండూ కలిసి ఉంటాయి. ఈ మాయా ఆవరణను "విజ్ఞానమయ కోశం" అంటారు. ఇంద్రియాల ద్వారా జీవుడు అనుభూతి చెందే సంస్కారాలు అన్నీ ఇక్కడే ముద్రింపబడుట జరుగుతుంది. ఆంగ్ల భాషలో దీనినే "సబ్ కాన్షస్ మైండ్" అని పిలుస్తారు. జీవుడు జన్మ జన్మల నుండి కూడబెట్టుకుని వున్న సంస్కారాలన్నీ ఇక్కడే ముద్రింపబడుతాయి మరియు జీవుని యొక్క విధిరాతకు కారణమవుతాయి.

దీని తరువాత సృష్టి రచనా క్రమంలో ఏర్పడేది "మనసు". ఆ తరువాత

ఐదు జ్ఞానేంద్రియములు (కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు మరియు చర్మము) మరియు ఐదు కర్మేంద్రియములు (చేతులు, కాళ్ళు, గొంతు, జననేంద్రియము మరియు మల విసర్జన చేయు ఇంద్రియములు) ఏర్పడుట జరుగుతుంది. అయితే నేను చెబుతున్నది ఈ ఇంద్రియముల యొక్క మూల స్థానాన్ని గురించి ! స్థూలంగా శరీరంలో నిర్మాణమై ఉన్న అవయవాలను గురించి కాదు. కనుక మనసుతో మొదలు పైన వివరించిన ఇంద్రియములు అన్నీ "మనోమయ కోశం" యొక్క అంతర్గతమవుతాయి. ఐదు జ్ఞానేంద్రియములకు మరియు ఐదు కర్మేద్రియములకు మూలస్థానం మరియు కేంద్రస్థానం "మనసు" అని అర్ధం !

ఆ తరువాత పంచభూతములకు సంబంధించిన ఐదు తన్మాత్రలు ఏర్పడుట జరుగుతుంది. తన్మాత్రలు అంటే ఐదు తత్త్వాలకు మూలం. అవి ఆకాశము, వాయువు, అగ్ని, నీరు మరియు భూమి యొక్క మూలాలు ! ఇవి ప్రాణమయ కోశం యొక్క అంతర్గతం అవుతాయి. మానవ శరీరంలోని మెదడు – వెన్నుపాము వ్యవస్థలోని చక్రాలలో వీటి మూలస్థానం ఉంటుంది. మూలాధార చక్రంలో భూమి తత్త్వము, స్వాధిష్టాన చక్రంలో జల తత్త్వము, మణిపుర చక్రంలో అగ్ని తత్త్వము, అనాహత చక్రంలో వాయువు మరియు విశుద్ధ చక్రంలో ఆకాశము తత్త్వము ఉంటాయి.

పైన వివరించిన తత్త్వాలే గాక ఇంకా ఐదు రకముల ప్రాణ వాయువులు (ముఖ్యమైనవి) మరియు ఐదు రకముల ఉప వాయువులు కూడా ప్రాణమయ కోశం యొక్క అంతర్గతం అవుతాయి. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము మరియు సమానము మొదలైనవి ముఖ్యమైనవి. ఒక్కొక్క ప్రాణ శక్తికి శరీరంలో ఏదో ఒక పని ఉంటుంది. ఉదాహరణకు అపానము యొక్క పని శరీరం నుండి మలాన్ని విసర్జన చేయుట. అదే విధంగా మూత్రాన్ని విసర్జన చేయుట మరియు లైంగిక ప్రక్రియలో వీర్యాన్ని విసర్జన చేయుట కూడా అపాన వాయువు ద్వారా జరుగుతుంది. ప్రాణవాయువు శరీరంలోని ఊపిరితిత్తులను కదిలించడం చేస్తుంది. దీనితో శరీరంలో శ్వాస ప్రక్రియ మొదలవుతుంది. ఇదే ప్రకారం మిగిలిన వాయువులు కూడా శరీరంలో ఇతర

పనులు చేస్తాయి.

ఆ తరువాత ఆఖరిగా స్థూల రూపంలో అంటే అన్నమయ కోశంలో పంచ భూతాలు (ఆకాశము, వాయువు, అగ్ని, జలము మరియు భూమి) ఏర్పడుతాయి. ఇది కేవలం శరీరంలోనే గాక, బాహ్య ప్రపంచంలో కూడా ఉన్నట్లు మానవునికి అనుభవానికి వస్తాయి.

దీనితో అర్ధ ప్రపంచము యొక్క నిర్మాణం పూర్తి అవుతుంది.

అయితే శబ్ద ప్రపంచంలో కూడా, అర్ధ ప్రపంచానికి సమాంతరంగా శబ్దాలు ఏర్పడుట జరుగుతుంది. ఉదాహరణకు పంచ భూతాలకు సమాంతరంగా, ఆకాశమునకు "హం", వాయువునకు "యం", అగ్నికి "రం", జలమునకు "వం" మరియు భూమికి "లం" అనే బీజాక్షరాల సృష్టి రచన జరుగుతుంది. అయితే ఈ శబ్దాలన్నీ "ఓం" అనే శబ్దం నుండి ఉద్భవించినవి అని ఇంతకు ముందే వివరించాను.

పైన వివరించిన దాని ప్రకారం మిగిలిన అర్ధ ప్రపంచానికి సంబంధించిన అన్నింటికి సమాంతరంగా శబ్దప్రపంచం యొక్క నిర్మాణం లేదా మంత్ర శాస్త్రము తయారు చేయబడినది!

మంత్రం అంటే ఏమిటి ?

మంత్రం అనేది ఒకానొక విశిష్టమైన రూపాన్ని సంతరించుకొనిఉన్న శబ్ద శరీరం లేదా శబ్ద శక్తి కలిగి ఉన్న ఒక పొట్లము. దాని శరీరం శబ్దంతో నిర్మితమైఉన్న కారణంగా, దానిని ఎక్కడికి తీసుకు వెళ్లాలన్నా కేవలం నోటి ద్వారానో లేదా ఏదైనా ఒక భాషా ఒక భాషా వర్ణమాల మాధ్యమంగానో చేయాలి. అంటే మంత్రం అనేది ఏదైనా ఒక భాష యొక్క వర్ణమాలతో మరియు మనసులో ఉదయించే ఆలోచనా తరంగాలతో అతి దగ్గర సంబంధం కలిగి ఉన్నది. కనుక మంత్ర జపం అనే విషయం కేవలం మానసిక ప్రపంచంలో నిక్షిప్తమై ఉంటుంది. దీని అర్ధం ఏమిటంటే, మంత్ర జపం అనేది ఒక మానసిక కసరత్తు లేదా వ్యాయామం. మానవ శరీరంలో కండలను అభివృద్ధి చేయాలంటే ఏదైనా ఒక వ్యాయామశాలకు వెళ్లి బరువులు ఎత్తి దీర్ఘకాలికంగా కసరత్తు చేయవలసి ఉంటుంది. అదేమాదిరిగా మానసిక

ప్రపంచంలో కూడా మంత్ర జపం చేసే కొద్దీ నిదానంగా మరియు నెమ్మదిగా మంత్రం యొక్క శక్తి మూటగట్టి బడుతుంది. అంటే మంత్ర జపం చేస్తున్న వ్యక్తి యొక్క మనసు మంత్ర శక్తి (ఒక రూపంలో ఉండే శబ్ద శక్తి) వలన ప్రభావితం అవడం జరుగుతుంది.

ఒక భవనం యొక్క నిర్మాణానికి ఇటుక రాయి అనే దానిని వాడుతాము. అది మట్టితో చేయబడి ఉండవచ్చు లేదా మరేదైనా పదార్ధంతో చేయబడి ఉండవచ్చు. చిన్న ఇటుక రాళ్లను పెద్ద సంఖ్యలో ఉపయోగించి ఎంత పెద్ద భవనాలను నిర్మాణం చేయవచ్చునో పాఠకులందరికీ తెలిసిన విషయమే! అంతేగాకుండా భవనాలను ఏ రూపంలో అయినా లేదా ఎంత పెద్ద పరిమాణంలో అయినా నిర్మాణం చేయవచ్చును. ఒక మంత్ర సాధన అనేది కూడా ఇలాంటి ప్రక్రియ! అయితే దీనిలో ఉండే ఒకే ఒక తేడా ఏమిటంటే మంత్ర సాధన అనేది మానసికంగా జరుగుతుంది. భవనం అయితే నిర్మించిన వ్యక్తే గాకుండా ఎవరైనా వెళ్లి నివసించవచ్చు. నివసించవచ్చు. కాని మంత్రంతో నిర్మాణం జరిగిన శక్తి యొక్క ఉపయోగం మాత్రం సాధన చేసిన వ్యక్తికే దక్కుతుంది. మంత్ర జపం అనేది ఒక వ్యక్తి అంతరంలో చేయడం జరుగుతుంది. కాబట్టి తను ఎంత ప్రగతి సాధించాడనే విషయం వెంటనే అవగాహన ఉండదు. అయితే కొంతవరకు మాత్రమే మంత్రం మనసు మీద చూపించే ప్రభావాన్ని అనుభూతి చెందడం జరుగుతుంది.

మంత్ర శాస్త్రాన్ని పైన వివరించిన సిద్ధాంతం మీద ఆధారపడి తయారు చేయడం జరిగింది. ప్రాచీన కాలం నుండి పెద్ద సంఖ్యలో ఎన్నో రకాల మంత్ర శాస్త్రాలను అభివృద్ధి చేయడం జరిగింది. రకరకాల మంత్రాలు మనసు మీద రకరకాలుగా ప్రభావం చూపిస్తాయి. అయితే పాఠకులందరూ గమనించవలసిన విషయం ఒకటుంది! అదేమిటంటే మంత్ర శాస్త్రం కూడా ఆధునిక విజ్ఞాన శాస్త్రం లాంటిదే! కేవలం మంత్ర శాస్త్రం అనేది ప్రస్తుతం ఉన్న విజ్ఞాన శాస్త్రాలకంటే సూక్ష్మమైనది మరియు గొప్పదనే విషయం గమనించాలి. ప్రాచీన శాస్త్రాలను ప్రామాణికంగా తీసుకుంటే, మంత్ర శాస్త్రాలు ప్రాచీన కాలంలోనే సంపూర్ణంగా అభివృద్ధి చేయబడ్డాయి. బహుశా కొంతమంది

పాఠకులకు ప్రాచీన శాస్త్రాల మీద అంతగా నమ్మకం ఉండకపోవచ్చు. అందువలన వాళ్ళ దృష్టిని ప్రస్తుతం ఆధునిక విజ్ఞాన శాస్త్రం ద్వారా ప్రతిపాదించ బడిఉన్న "స్ట్రింగ్ థియరీ" మీదకు తీసుకు వెళతాను. ప్రస్తుతం ఆధునిక కాలంలో ప్రతిపాదించ బడిఉన్న "స్ట్రింగ్ థియరీ" ప్రకారం విశ్వంలో ఉన్న పదార్ధం లేదా శక్తి అంతా ప్రాథమిక స్థాయిలో కేవలం శబ్దం మాత్రమే అనే విషయం తెలుస్తుంది. కనుక మంత్ర శాస్త్రం మీద ఎక్కువగా పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఏ కోణంలో చూసినా మంత్ర శాస్త్రం అనేది ఒక అద్భుతమైన శాస్త్రం అనుటలో ఎలాంటి సందేహం లేదు. బహుశా రానున్న కాలంలో ఏదో ఒక నాటికి ఈ మంత్ర శాస్త్రం తిరిగి ప్రాచీన కాలంలో ఉన్నట్లు తన పూర్వపు వైభవాన్ని పొందగలదని ఆశించవచ్చును. తప్పకుండా కనీసం నా జీవిత కాలంలో ఈ విషయాన్ని తిలకించగలనని కోరుకుంటున్నాను.

ప్రాథమికంగా "మంత్ర శాస్త్రం" అనేది ఒక ఉన్నత శ్రేణికి చెందిన విషయం. ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి ఇంకా అంతుచిక్కని ప్రాచీన శాస్త్రాలలో ఇది ఒకటి. అయితే ఆధునిక శాస్త్రం "మంత్ర శాస్త్రం" మీద దృష్టి పెట్టే సూచనలు మాత్రం కనిపిస్తూనే ఉన్నాయి. మనం అందరం ఎన్నోరకాల సంగీతం వింటూనే ఉంటాము కదా! సంగీతం మానవుని మేధస్సు మీద ఎలాంటి పరిణామం చూపించగలదనే విషయం పాఠకులందరికీ తెలిసినదే! కనుక "మంత్ర శాస్త్రం" పరిశోధన చేయుటకు ఒక అద్భుతమైన శాస్త్రం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

మంత్ర శాస్త్రాన్ని గురించి ప్రాచీన సంస్కృత గ్రంథాలలోనూ మరియు క్రైస్తవ మత గ్రంథమైన "బైబిలు" లోనూ ప్రస్తావించడం జరిగింది. ప్రాచీన సంస్కృత గ్రంథాల ప్రకారం విశ్వం అంతా "ఓం" అనే శబ్దం నుండి సృష్టించ బడినదని చెప్పబడినది. ఇదే విషయం గురించి ప్రత్యక్షకంగా "ఓం" అనే శబ్దం కాకుండా కేవలం "పదం" లేదా "శబ్దం" అని ప్రస్తావిస్తూ "బైబిలు" కూడా చెబుతున్నది. సృష్టి ఆదిలో ఉన్నదంతా కేవలం ఒక "పదం" లేదా "శబ్దం" మాత్రమే అని, ఆ "పదం" భగవంతుని దగ్గర ఉండినదని చెప్పబడింది. కనుక

విశ్వం అంతా కేవలం "శబ్దం" నుండి సృష్టించ బడినదనే ప్రాథమిక నిజాన్ని ప్రాచీన సంస్కృత గ్రంథాలు, క్రైస్తవ మత గ్రంథం అయిన "బైబిలు" మరియు ఆధునిక కాలంలో విజ్ఞాన శాస్త్రం ద్వారా ప్రతిపాదించ బడిన "స్ట్రింగ్ థియరీ" అన్నీ ఒప్పుకుంటున్నాయి.

"శబ్దం" అనేది అన్ని ప్రపంచ భాషలకు మూలం. భాష యొక్క వర్ణమాలలో ఉండే "అక్షరం" అనేది ఒక చిన్న ఇటుక రాయి వంటిది. చిన్న చిన్న ఇటుక రాళ్లతో ఏ విధంగా మనం పెద్ద పెద్ద భవనాలను నిర్మిస్తామో అదే మాదిరిగా అక్షరాలతో పుస్తకాలను తయారు చెయ్యడం జరుగుతుంది. మానవ మేధస్సు నుండి ఉత్పత్తి చెందిన సంగీతం, నాట్య శాస్త్రం, కవిత్వం, కథ మొదలైన గొప్ప కళలకు సంబంధించిన సాహిత్యాన్ని అంతా కేవలం చిన్న చిన్న అక్షరాలతో నిర్మించడం జరిగింది. అంతే గాకుండా మానవ మేధస్సులో ఉత్పత్తి చెందే అన్ని రకాల ఆలోచనలకు మరియు శాస్త్రాలకు మూలం "శబ్దం" లేదా భాష. అయితే ఇక్కడ ఒక చిన్న వివరణ ఇవ్వదలచుకున్నాను. మానవుని మనస్సులో చెలరేగే తొమ్మిది రకాల భావోద్వేగాలు మేధస్సు కు సంబంధించినవి కావు. ఎందుకంటే ఈ భావోద్వేగాలనేవి కేవలం మనసులో మాత్రమే చెలరేగుతాయి. వీటితో మానవుని అహంకారం కలిసినపుడు మాత్రమే అవి కర్మలుగా విజ్ఞానమయ కోశంలో లేదా మానవుని మేధస్సులో ( ఆంగ్ల భాషలో "ఇంటెలెక్ట్" అంటారు) సంచితం అవుతాయి.

నాకున్న అతి కొద్ది జ్ఞానంతో వినమ్రతతో నేను చెప్పదలచు కున్నదేమంటే బహుశా భవిష్యత్తులో ఆధునిక విజ్ఞాన శాస్త్రం, ప్రస్తుతం ఉన్నట్లు గణిత శాస్త్రం మూలంగా కాకుండా మంత్ర శాస్త్రం మూలంగా నిర్మించ బడవచ్చని! పాఠకులందరికీ ఒక విషయం బాగా పరిచయం ఉండే ఉంటుంది. విశ్వం యొక్క నిర్మాణం గురించి ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఎలా మార్పు చెందుచూ వస్తున్నాయో! ప్రారంభంలో రెండు వేల సంవత్సరాల క్రితం అరిస్టాటిల్ విశ్వం యొక్క నిర్మాణం గురించి ప్రతిపాదించడం జరిగింది. ఆ తరువాత కోపర్నికస్, ఆ తరువాత గలీలియో, ఆ తరువాత ఐసాక్ న్యూటన్, ఆ తరువాత ఐనస్టీన్ వరుసగా రకరకాల

కాలాలలో వివిధ రకముల సిదాంతాలని ప్రతిపాదించడం జరిగింది. అంతేగాకుండా ఐనస్టీన్ జీవించిన కాలంలోనే క్వాంటమ్ మెకానిక్స్ అనే సిదాంతాన్ని కూడా ప్రతిపాదించడం జరిగింది. అయితే ఐనస్టీన్ ప్రతిపాదించిన "సాపేక్షతా సిద్ధాంతం" సరైనదా లేక "క్వాంటం మెకానిక్స్" అనే సిద్ధాంతం సరైనదా అనే విషయం నేటికీ ఇంకా స్పష్టంగా ఎవరికీ తెలియదు.

కనుక విశ్వ నిర్మాణం గురించి మనకున్న అవగాహన ఎప్పుడూ ఒకే విధంగా లేదు. భవిష్యత్తులో కూడా ప్రస్తుతం ఉన్న సిద్ధాంతమే శాశ్వతంగా నిలిచి ఉంటుందనే నమ్మకమూ లేదు. ఈ పాఠాన్ని మానవ జాతి యొక్క చరిత్ర మనకు బాగా అర్ధమయ్యేలా చేసింది. కనుక భవిష్యత్తులో విజ్ఞాన శాస్త్రం మరొక మలుపు తిరగవచ్చని చెప్పడంలో పెద్ద అతిశయోక్తి ఏమీ లేదు. బహుశా విశ్వ నిర్మాణాన్ని గురించి ఆధునిక విజ్ఞాన శాస్త్రం, మంత్ర శాస్త్రం యొక్క ఆధారంగా సిద్ధాంతాలను ప్రతిపాదించ వచ్చును. పైన వివరించిన విధంగా క్రొత్తగా ప్రతిపాదించ బడిన "స్ట్రింగ్ థియరీ" అనేది కూడా ఈ దిశలోనే మనకు వేలెత్తి చూపెడుతుంది.

అయితే కొందరి అనుమానం ఏమిటంటే "మంత్రం" అనేది వేగంగా పనిచేయదు కదా! అని. ఎందుకంటే వాళ్లకు ఫలితం వేగంగా లభ్యం కాదు. అందుచేత వాళ్ళు ఈ సిద్ధాంతాన్ని గురించి విమర్శ చేస్తూ ఉంటారు. ఈ సిద్ధాంతాన్ని బాగా నమ్మేవాళ్ళు సైతం కొంత సమయం గడిచాక ఫలితం ఏమీ కనిపించక నిరాశ చెంది ఈ సిద్ధాంతాన్ని వదిలివేస్తూ ఉంటారు.

ఒక్క సారి అందరూ ఆలోచించండి! ఎవరైనా వ్యాయామశాలకు వెళ్లి శరీరంలో కండలు పెంచడానికి ప్రయత్నించినపుడు కసరత్తు ఎన్ని రోజులు చేయవలసి వస్తుందో! ఒక చిన్న కండను పెంచడానికి కూడా ఎన్నో నెలల తరబడి సాధన చేయవలసి వస్తుంది. వాళ్ళు కసరత్తు చేసే సమయంలో చేతితో ఏదైనా చిన్న ఇనుప ముక్కను ఎత్తి పరికరంగా వాడుతూ ఉంటారు. ఇనుప ముక్కను చేతిలో పట్టుకొని అదేపనిగా ఎన్నోసార్లు కసరత్తు చేయవలసి ఉంటుంది. చేతిలో కండ మాత్రం తప్పనిసరిగా అభివృద్ధి

చెందుతుంది. కాని దీనికి చాలా రోజుల సమయం పడుతుంది. ఒక్కోసారి కనీసం ఆరు నెలల పాటు ప్రతిరోజూ వ్యాయామం చేస్తే గాని ఫలితం కంటికి కనిపించదు. కాబట్టి మనం "మంత్ర శాస్త్రం" లో చెప్పిన విధంగా ఎవరైనా మంత్రాన్ని అదేపనిగా జపం చేయవలసిన వచ్చినపుడు ఫలితం కనిపించడానికి చాలా సమయం పట్టవచ్చని సులభంగానే గ్రహించవచ్చును. కనుక కనుక ఇలాంటి మంత్ర సాధన చేయుటకు చాలా ఓపిక అనేది అవసరం.

ఎవరైనా మంత్ర శాస్త్రాన్ని విమర్శ చేయాలన్నా దానికి కూడా ముందుగా మంత్ర శాస్త్రం గురించి సాధన చేసి క్షుణ్ణంగా పరిశోధన చేయవలసి ఉంటుంది. లేనిచో విమర్శ చేసినా దానికి ఏమాత్రం విలువ ఉండదు. ఏది ఏమైనా మంత్ర శాస్త్రం అనేది విశ్వం యొక్క నిర్మాణం లేదా సృష్టి రచన గురించి ప్రస్తావిస్తుంది కాబట్టి అంత పెద్ద సిద్ధాంతం గురించి విమర్శ చేసే ముందు పరిశోధన చేయడం అనేది తప్పనిసరిగా చేయవలసి ఉన్నది. విషయం అంత పెద్దదైనపుడు విమర్శ చేయడానికి సైతం ఎంత సమయం మరియు శ్రమ వృధా అయినా లెక్కచేయవలసిన అవసరం లేదని నా అభిప్రాయం.

మంత్ర శాస్త్రాన్ని బాగా అర్ధం చేసుకోవడం ద్వారా మానవ మేధస్సు ఎంతో ఉన్నతి సాధించడం జరుగుతుంది. అంటే మనసు ఎంతో గొప్పగా మార్పు చెందడం అనేది జరుగుతుంది. మననం చేసేవాడిని రక్షించడమే "మంత్రం" యొక్క పని. దానివలన "జ్ఞానం" అనేది మానవునికి మనస్సులోనే అంతర్గతంగా ఉదయించడం జరుగుతుంది. జ్ఞానం యొక్క లాభం జ్ఞానమే! ఇది ఒక గొప్ప సత్యమనే విషయం అందరికీ తెలిసినదే! అంతేగాక జానమే శక్తి! ఇది కూడా ఒక గొప్ప సత్యం! అంతేగాకుండా శక్తే ఈ విశ్వం! ఈ విషయాన్ని ఆధునిక విజ్ఞాన శాస్త్రం కూడా ఒప్పుకుంటుంది. కనుక శక్తే మానవ జాతి సృష్టికి కారణం లేదా శక్తే పరబ్రహ్మం! ఎందుకంటే శక్తి మరియు శక్తిమాన్ ఎప్పుడూ వేరు వేరు కాదు కాబట్టి!

# మస్తిష్క వ్యవస్థ మీద భ్రమ ఉత్పత్తి

మాయ అనే శబ్దం ఒక శక్తి. అంతేగాకుండా మాయ అనే శబ్దం యొక్క అర్థం కూడా శక్తి యొక్క స్వరూపం. అంటే శక్తిని రెండు భాగములుగా విభజన చేసినపుడు (కేవలం సిద్ధాంత ధోరణిలో మాత్రమే! అంతేకాని, శక్తిని విభజన చేయడం అనేది కుదరదు) ఒకటి శబ్ద శరీరాన్ని కలిగి ఉంటుంది మరియు రెండవది అర్ధ శరీరాన్ని కలిగి ఉంటుంది. శబ్ద శరీరాన్ని మాయ అంటారు. అర్ధ శరీరాన్ని జగత్తు అంటారు. అయితే ఈ రెండూ ఒకే నాణానికి రెండు వైపులు ఉన్నట్లు, శక్తి యొక్క రెండు వైపులు అని చెప్పవచ్చును. కనుక మాయ అనే శబ్ద శరీరం లేదా పదం మరియు జగత్తు అనే అర్ధ శరీరం అనుభూతి రెండూ ఒకటే! అయితే జగత్తు అనేది కూడా ఒక పదం. కాబట్టి 'జగత్తు' అనే పదం కూడా శబ్ద శరీరాన్ని కలిగి ఉంటుంది. అయితే ఈ పదం యొక్క స్వరూపం మాత్రం కేవలం అనుభూతి చెందబడేది. అందుకే దానిని అర్ధ శరీరం అన్నారు. అంటే జగత్తు అనేది కేవలం మానసికమైనది మరియు మానసికంగా అనుభూతి చెందబడేది. అర్ధ ప్రపంచానికి కూడా ఎదో ఒక పేరు ఉంటుంది కాబట్టి, దానిని జగత్తు అనడం జరిగింది.

కనుక "మాయ" లేదా "జగత్తు" రెండూ ఒకటే! ఈ రెండు పదాలు కేవలం ఒకే శక్తి యొక్క రెండు స్వరూపాలు మరియు విభజన చేయడానికి కుదరనివి. మాయ అనేది శబ్ద స్వరూపం అయితే, జగత్తు అనేది దాని యొక్క అర్థం లేదా

భావన.

నేను పైన వివరించిన విషయాన్ని చాలా స్పష్టముగా అర్థం చేసుకోవలసిందిగా పాఠకులందరికీ మనవి చేస్తున్నాను. ఎందుకంటే ఈ సిద్ధాంతం మీదే మనం అనుభూతి చెందే జగత్తు లేదా అనంతమైన విశ్వం అంతా నిర్మించబడి ఉన్నది కాబట్టి! దీనిని శాక్త సిద్ధాంతం అంటారు.

ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నది మరియు అనంతమైనది కేవలం శక్తి మాత్రమే! ఈ విషయాన్ని ఆధునిక విజ్ఞాన శాస్త్రం కూడా ఒప్పుకుంటుంది.

అయితే ఈ శక్తి చైతన్య వంతమైనది. సాధారణంగా మనం అనుభూతి చెందే జగత్తు అంతా శక్తి యొక్క స్థూల స్వరూపం. ఎందుకంటే జగత్తు అనేది "మాయ" అనే శబ్ద శరీరం యొక్క అర్థ శరీరం కాబట్టి. అయితే జగత్తులో సాధారణంగా అనుభూతి చెందే శబ్దం కూడా స్థూల స్వరూపాన్ని కలిగి ఉంటుంది. కనుక పాఠకులు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది. మనం అనుభూతి చెందే శబ్దం (భౌతికంగా వినిపించే శబ్దం లేదా మానసికంగా స్ఫురణకు వచ్చే శబ్దం) స్థూలమైనది. అంటే శబ్దం తన యొక్క శబ్ద స్వరూప స్థాయి నుండి పరిణామం చెంది అర్థ స్వరూప స్థాయికి చేరిందని అర్థం. అందువలన సాధారణంగా మనం అనుభూతి చెందే ఈ శబ్దం చైతన్య వంతమైనది ఎలా అవుతుంది? అని పాఠకులకు అనుమానం రావచ్చును. అందుకనే పైన వ్రాసిన సుదీర్ఘ వివరణకు కారణం.

శక్తి శబ్ద స్వరూపం యొక్క స్థాయిలో లేదా తన సూక్ష్మాతి సూక్ష్మమైన స్థాయిలో ఉన్నపుడు చైతన్య వంతమైనదని అన్ని ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ శక్తే పరిణామం చెంది స్థూల జగత్తుగా అనుభూతికి రావడం జరుగుతుంది. అయితే స్థూల జగత్తుగా పరిణామం చెందినపుడు మానవునికి వ్యక్తిగత స్థాయిలో జగత్తుని నిర్మించడం కూడా సమాప్త మవుతుంది. దీనివలన మానవ శరీరంలో విరాజమానమై ఉన్న మరియు అనంతమైన ఆత్మ మీద లేదా బ్రహ్మం మీద లేదా భగవంతుని మీద భ్రమ పూరితమైన ఆవరణ కప్పబడుట జరుగుతుంది. దీనితో మాయ శబ్ద శరీరం నుండి అర్థ శరీరంగా మారుట మరియు మానవునికి జగత్తు అనే అర్థ శరీరం

అనుభవానికి రావడం ఒకేసారి జరుగుతాయి. బహుశా ఈ పాటికి పాఠకులు అసలు విషయాన్ని గ్రహించి ఉంటారని భావిస్తున్నాను.

శక్తే తన సూక్ష్మ స్థాయినుండి జగత్తుగా పరిణామం చెందినది. అంటే మానవునికి వ్యక్తిగత స్థాయిలో మరియు మానవ జాతికి సామూహిక స్థాయిలో సృష్టిని నిర్మాణం చేయడం సమాప్తమయినదని అర్థం. అయితే నిర్మాణం చేయబడిన సృష్టి లేదా జగత్తు కేవలం మానసికమైన అనుభూతి మాత్రమే! అంటే అద్దంలో కనిపించే ప్రతిబింబం లాంటిది లేదా ఎండమావి లాంటిది. కేవలం మాయ యొక్క అధీనంలో ఉన్నంత కాలం ఈ సృష్టి లేదా జగత్తు అంతా నిజమైనదనే భ్రాంతి కలుగుతుంది. ఇది మానవునికి అన్ని ఇంద్రియాల మాధ్యమంగా అనుభవానికి రావడం చేత జగత్తు సత్యం అనే భ్రమ ఏర్పడుతుంది. అంటే అజ్ఞానంలో ఇరుక్కుపోవడం జరుగుతుంది. మనం సాధారణంగా చదువుకునే ఆధునిక శాస్త్రాలు అన్నీ ఈ భ్రమ పూరితమైన లేదా ఎండమావి లాంటి జగత్తుకి సంబంధించినవి. అంటే ఎండమావిని గురించి అధ్యయనం చేయడం అన్నమాట. అసలు ఎండమావి అనేది లేదు మరియు అది కేవలం భ్రమ! దానిని అధ్యయనం చేయడానికి నిర్మించ బడిన శాస్త్రాలు అన్నీ అర్థం లేనివి అవుతాయి.

అయితే వీటి వలన మరొక ఉపయోగం మాత్రం ఉన్నది. జగత్తు సత్యం కాదని మరియు కేవలం ఎండమావి లాంటి మిధ్య అనే విషయం చివరిలో తెలుసుకోవడానికి పరోక్షంగా శాస్త్రాలన్నీ ఉపయోగ పడతాయి. అయితే ఇలాంటి అధ్యయనం జ్ఞానమార్గం పరిధిలోకి వస్తుంది మరియు చాలా సుదీర్ఘమైన సమయం కూడా పడుతుంది. అందువలన మోక్షం వచ్చేలోపు ఈ జగత్తు సత్యమైనదనే భ్రమలో చాలాకాలం గడపవలసి ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవలసినదిగా పాఠకులందరికీ మనవి చేస్తున్నాను.

జగత్తు కేవలం భ్రమ పూరితమైనది అన్నపుడు, దాని పరిణామం ఎలా ఉంటుంది అనే విషయాన్ని అధ్యయనం చేద్దాం!

ఇది మానవుని మీద అన్ని విధాలుగా పరిణామం చూపిస్తుంది. మానవుని

యొక్క భౌతిక జగత్తు అంటే అయిదు ఇంద్రియాల మాధ్యమంగా అనుభూతి చెందబడే ప్రపంచం భ్రమపూరితమైనది. అంతేగాకుండా మనసుతో అనుభూతి చెందే జగత్తు (ప్రేమ,దయ,భక్తి,గర్వం,ఆశ,కామం,క్రోధం లాంటివి) కూడా కేవలం భ్రమపూరిత మైనది. అంతేగాక బుద్ధి తో తర్కించ బడిన విజ్ఞాన శాస్త్రాలు అన్నీ భ్రమ పూరితమైనవి. ఒక్క మాటలో చెప్పాలంటే అనుభూతి చెందబడే జగత్తు అంతా మిధ్య! ఈ విషయం ప్రస్తుతం ఈ పుస్తకాన్ని రాస్తున్న నాకు కూడా వర్తిస్తుంది. అంటే జగత్తు మిధ్య అని నేను చేస్తున్న ఈ వివరణ సైతం ఎండమావి లాంటిది.

ఇటువంటి పరిస్థితుల్లో అసలు దేనిని నమ్మాలి దేనిని నమ్మకూడదు? అయితే ఈ ప్రశ్న కూడా భ్రమపూరితమైనది. అయితే ఈ పుస్తకాన్ని వ్రాయడంలో అర్ధం ఏమిటి? ఈ ప్రశ్న సైతం భ్రమపూరితమైనది. ఒక విషయాన్ని అధ్యయనం చేసినపుడు, దానిని అన్ని కోణాల నుండి అధ్యయనం చేయడం జరుగుతుంది. ఈ పుస్తకం యొక్క ఉపయోగం కూడా అంతవరకే!

ప్రతి మానవునిలో విరాజమానమై ఉన్న ఒకే ఒక సత్యం పరబ్రహ్మం. అనంతమైన ఆత్మ! కనుక, అనంతమైనది మరియు బ్రహ్మ స్వరూపం అయిన ఆత్మకు భ్రమపూరితమైన భాషల్లో అడిగే ప్రశ్నలతో మరియు వాటి సమాధానాలతో పనిలేదు. ఎందుకంటే భాషలు సైతం భ్రమపూరితమైనపుడు, వాటి అంతర్భాగం అయిన ప్రశ్నలకు మరియు సమాధానాలకు అసలు అస్థిత్వమే లేదు కాబట్టి!

అయితే పాఠకులందరికీ ఒక అనుమానము రావచ్చును. మాయ అనే శబ్ద శరీరం లేదా పదం శక్తి స్వరూపం అనటానికి ప్రామాణికం ఏమిటి? అని ప్రశ్నించవచ్చును. అంతేగాకుండా "మాయ" అనే శబ్దం మాత్రమే అర్ధ ప్రపంచంగా పరిణామం చెందినది అనే భావనకు ప్రామాణికం ఏమిటి? దీనికి సమాధానం పరోక్షంగా లభ్యమవుతుంది. ఎవరికి మాయ యొక్క ఆవరణలు ఒక్కొక్కటి తొలగి పోవడం ప్రారంభం అవుతుందో, కేవలం వాళ్ళకి మాత్రమే అప్పటివరకు తాము అనుభూతి చెందినది కేవలం మాయ అని లేదా

భ్రమపూరిత మైనదని స్పష్టంగా తెలుస్తుంది. అంటే చీకటి గుహలో ఉన్న వ్యక్తికి బయటి నుండి వస్తున్న మొదటి వెలుగు రేఖను చూసినపుడు తాను అంతవరకూ అనుభూతి చెందివున్న అంధకారం సత్యం కాదనే విషయం స్ఫూరణకు వచ్చినట్లు అన్నమాట! మరొక మాటలో చెప్పాలంటే, ఆత్మ జ్ఞానం ప్రాప్తించుట మొదలు కాకుండా, ఈ జగత్తు మిధ్య అనే విషయం కూడా అవగతం కాదు.

ఇది వృక్షం ముందా లేదా విత్తనం ముందా లాంటి ప్రశ్న. జగత్తు మిధ్య అనే విషయం అవగతం అవడం అంటే ఆత్మ జ్ఞానం ప్రాప్తించడం మొదలైనది అని అర్ధం. బావిలో ఉన్న కప్పకు సముద్రం గురించి ఎంత వివరించినా అర్ధం కాదు మరియు అదే బావిలోఉన్న మరొక కప్పకు ఆ వివరణ చేయడం సాధ్యం కాదు. అయితే సముద్రంలో ఉన్న ఏ కప్పా మాత్రం ఏ బావిలోకి దిగి ఈ విధంగా బ్రహ్మ జ్ఞానం బోధించుటకు ఇష్టపడదు మరియు అసలు బావిలోకి దిగుట అనేది సాధ్యం కాదు. కానీ ఆ విధంగా బావిలోకి దిగి వచ్చి బ్రహ్మ జ్ఞానం బోధించిన మహా పురుషులు ఈ భూమండలం మీద జన్మించుట మాత్రం జరిగిందనే విషయం పాఠకులందరికీ సుపరిచితమే! అయితే ఇది ఎలా సాధ్యం అనే ప్రశ్నకు మాత్రం నా దగ్గర ఎలాంటి సమాధానం లేదు.

ఈ పుస్తకం వ్రాయడం అనేది కేవలం శాక్త సిద్ధాంత పరంగా, పరాశక్తి మరియు విశ్వశక్తి అయిన మహామాయ, రచయిత కలం మాధ్యమంగా వ్యక్తమవుచున్న ఒక చిన్న ప్రకంపన మాత్రమే!

సామూహికస్థాయిలో సృష్టిరచన జరిగిన తరువాత అనాది నుండి మానవునికి కూడా భగవంతుడు వ్యక్తిగతస్థాయిలో సృష్టిరచన చేసి మాయలో పడవేయుట జరిగినది. ఈ మాయ యొక్క సంపూర్ణమైన ప్రణాళికలోని ఒకానొక ముఖ్యమైన అంగము మానవునికి కలిగించే "లింగబేధము" అనే భ్రమ. పురుషునికి మహిళ రూపంలో మరియు స్త్రీ జాతికి మగవాని రూపంలో విశ్వశక్తి అయిన మహామాయ లింగబేధాన్ని సృష్టిరచన చేస్తుంది. అయితే ఈ లింగబేధము కూడా రకరకాలుగా విభజన చేయబడినది. పితృభావన, సోదరభావన, ప్రియతముని భావన లేదా మాతృభావన, సోదరీభావన,

ప్రేయసిభావన మొదలైనవి మానవుని మనోమయకోశంలో వివిధ ఆవరణలుగా నిర్మాణము చేయబడుట జరిగినది.

అతి శక్తివంతమైనవి మరియు భ్రమపూరితమైనవి అయిన ఈ మోహబంధాలను ఛేదించి బయ పడటం అనేది మానవుడు తన అంతరజగత్తులో జరిపే ఆఖరిపోరాటం అని చెప్పవచ్చును.

ఈ విషయం మీద ఆలోచన చేసినపుడు కొన్ని సందర్భాలలో చాల హాస్యంగా కూడా అనిపిస్తూ ఉంటుంది. మానవుడు మహిళ రూపంలో ఉన్న లేక మగవాని రూపంలో ఉన్న అది కేవలం రక్తమాంసాలతో నిర్మితమైన శరీరము అనే విషయాన్ని విస్మరించుట జరిగినది. మానవుని అంతరంలో విరాజమానమై ఉన్న ఆత్మ అనంతమైనది మరియు విశ్వమంతా వ్యాపించి ఉన్నది అయిన అఖండమైన చిదాకాశం. అటువంటి దానికి మానవశరీరమనేది కేవలం ఒక వస్త్రం వంటిది మాత్రమే ! ఎందుకంటె "లింగభేదము" అనే భ్రమ మానవుని మస్తిష్కవ్యవస్థ మీద ధారణ చేయబడుట జరిగినది కాబట్టి ! ఇది ఎలా ఉంటుందంటే ఖరీదైన వస్త్రాలు ధరించి వున్న మానవుడు (మహిళ లేదా మగవాడు) మామూలు వస్త్రాలు ధరించి ఉన్న ఎదుటి వ్యక్తిని చూసి, తాను భాగ్యశాలిని అని భ్రమపడినట్లు ఉంటుంది.

అంటే అది కేవలం మానసికమైన అనుభూతి మాత్రమే !

వస్త్రాలు తీసివేసినచో ధనవంతునికి మరియు బీదవానికి మధ్యన ఎటువంటి తేడా ఉండదు. సూక్ష్మదృష్టితో ఆలోచిస్తే లింగభేదం కూడా అటువంటిదేనని చెప్పవచ్చును. అయితే అందరూ వాదించే విషయం ఏమంటే, లింగభేదము అనేది భగవంతుడు చేసిన సృష్టిరచన అని మరియు వస్త్రాలు మధ్య ఉన్న బేధం మానవుడు చేసిన సృష్టిరచన అని. కావున లింగభేదము అనేది ప్రకృతి సహజమైనది అని మరియు అందరూ తప్పనిసరిగా పాటించవలసినదని వాదించుట జరుగుతుంది.

సరిగ్గా ఇక్కడే ఆ ప్రాథమిక తప్పిదం చోటు చేసుకుంటుంది.

ముఖ్యంగా మానవుడు శృంగారభావన అనే దానిని తన జన్మహక్కుగా భావించుట జరుగుతుంది. అంతేగాక తాను భగవంతుని సృష్టిరచనలో

భాగమని, కాబట్టి గృహస్థుజీవనం చేయుట ధర్మబద్ధమైనదని కూడా విశ్వసించుట జరుగుతుంది. అయితే ఈ విషయాన్ని మరొకమాటలో చెప్పాలంటే భగవంతుడే స్వయంగా మానవుణ్ణి భ్రమపూరితమైన జగత్తులో ఇరికించి వేశాడని కూడా చెప్పవచ్చును.

మానవుడు కూడా శృంగారభావన మధురంగా ఉండటం చేత దానికి ఆకర్షింపబడి గృహస్థుజీవనంలో లేదా ఇంద్రియాల సుఖానుభూతికి బానిసగా మారిపోవుట జరుగుతుంది. తననుతాను భ్రమపూరితమైన ధర్మసూత్రాలు మధ్యన సమర్థించుకొనుట కూడా జరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో భ్రమపూరితమైన మాయను లేదా ఈ బాహ్యజగత్తుని అధిగమించి మోక్షం పొందుట అనేది ఎలా జరుగుతుంది? ఒకవైపు ఆత్మ అనంతమైనది మరియు స్వయానా పరబ్రహ్మ స్వరూపమని శాస్త్రాలు, పురాణాలు మరియు అనేక ఇతర మతపరమైన సిద్ధాంతాలు చెబుతున్నపుడు అందరూ తలాడిస్తారు మరియు వాటిని గొప్పగా ఉన్నాయని కొనియాడుతారు. అయితే అతి స్వల్పవ్యవధిలో అన్నింటినీ విస్మరించి ఎప్పటివలె జగత్తు విషయాల ప్రవాహంలో కొట్టుకుపోవడం జరుగుతుంది. కనుక విశ్వశక్తి అయిన మహామాయ మానవుణ్ణి భ్రమింపచేయు విధానం ఇలాగే ఉంటుంది.

సూర్యుని చుట్టూ గ్రహములు నిరంతరం పరిభ్రమిస్తూ ఉంటాయి. వాటికీ పగలు అని రాత్రి అని ఉండదు. సూర్యుని వెలుగు మీద వాటి మనుగడ ఆధారపడి ఉంటుంది (ఏ ప్రాంతంలో వెలుగు పడుతుందో దానిని పగలు అని, ఏ ప్రాంతంలో వెలుగు పడదో దానిని చీకటి అని అంటారు). అయితే పగలు మరియు రాత్రి లేదా వెలుగు మరియు చీకటి అనేవి ప్రతి గ్రహం మీద నిరంతరం ఉంటాయి. అంటే రెండూ ఎప్పుడూ ఉంటాయి. గ్రహం తన చుట్టూ తాను తిరుగుచున్న కారణంగా, సూర్యుని కాంతి కిరణాలు పడే ప్రాంతం గ్రహం మీద నిరంతరం మారుతూ ఉంటుంది. దీని వలన మనకు భూమి మీద ఉదయం, మధ్యాహ్నం మరియు సాయంత్ర సమయాలు అనుభవానికి వస్తుంటాయి. ప్రతి గ్రహం మీద పరిస్థితి ఇలాగే ఉంటుంది.

ఇదే విధంగా మానవ మస్తిష్క వ్యవస్థ తొమ్మిది రకముల భావనలకు

లొంగబడి లేదా వాటి ఆధీనంలో మనుగడ సాగిస్తూ ఉంటుంది. వాటిని నవరసాలని శాస్త్రాలలో చెప్పబడింది. రసము అంటే మస్తిష్క వ్యవస్థలో చెలరేగే ఒక భావన. దానినే ఆంగ్ల భాషలో సెంటిమెంటు అంటారు. అవి శృంగారము (శృంగారప్రేమ, అందము, ఆకర్షణ మొదలైన వాటితో సంబంధం కలిగి ఉంటుంది), రౌద్రము (కోపము), హాస్యము (నవ్వు), కరుణ (దయ, దుఃఖము), వీర (ధైర్యము, వీరత్వము), భయానకము (భయము, భీతి), భీభత్సము (అసహ్యము, చిరాకు), అద్భుతము (ఆశ్చర్యము, విస్మయము) మరియు శాంతము (శాంతి, ప్రశాంతత). ప్రాచీన కాలం నుండి భారతీయ సంస్కృతిలో పురోగతి చెందిన కళలన్నీ ఈ నవరసాలను వ్యక్తపరిచేందుకే తయారు చెయ్య బడ్డాయి. నటన, పాట, సంగీతము, నాట్యము, కవిత్వము, శిల్పకళ, చిత్రకళ మొదలైన ప్రాచీన కళలన్నీ మానవ మస్తిష్క వ్యవస్థను తాత్కాలికమైన భ్రమ పూరిత జగత్తులోకి తొయ్యడానికి మాత్రమే తయారు చెయ్య బడ్డాయి.

మానవ జీవితం ఈ నవరసాలతో మనుగడ సాగిస్తూ ఉంటుంది. అంటే మానవ మేధస్సు జాగృత లేదా స్వప్న అవస్థలో ఉన్నంత కాలం ఏదో ఒక రసం పరిభ్రమిస్తూ ఉంటుంది. అయితే అంతరంలో విరాజమానమై ఉన్న ఆత్మయొక్క వెలుగు అహంతో మిళితమై వాటి మీద పడినపుడు మాత్రమే అవి కనిపిస్తాయి లేదా వాటి ప్రభావం మనసు మీద పడుతుంది. దైనందిన జీవితంలో నిరంతరం ఈ రసాలు మస్తిష్కంలో పరిభ్రమిస్తూ ఉంటాయనే విషయం అందరికీ తెలిసినదే!

ప్రాచీన కళలన్నీ తాత్కాలికంగా మరియు కృత్రిమంగా వీటిని కల్పితం చేయుటకు మాత్రమే తయారు చెయ్య బడ్డాయి. అంటే మానవుల మనో రంజనం కోసం ఈ కళలన్నీ నిర్మించబడ్డాయి. దైనందిన జీవితంలో మానవుని అనుభవానికి వచ్చే జగత్తు ఎంత నిజమో, ఈ కళల ఆధారంగా నిర్మించబడిన తాత్కాలిక జగత్తు కూడా అంతే నిజం.

అయితే మానవునికి దైనందిన జీవితంలో అనుభవానికి వచ్చే జగత్తు తను అంతరంలో కూడబెట్టుకొని ఉన్న సంస్కారాల మీద ఆధారపడి ఉంటుంది.

కళల మాధ్యమంగా అనుభవానికి వచ్చే జగత్తు కళాకారుల నైపుణ్యం మీద ఆధార పడి ఉంటుంది. అయితే రెండు సందర్భాలలోనూ ఇంద్రియాల మాధ్యమంగా మాత్రమే జగత్తు అనుభవానికి వస్తుందనే విషయం గమనించాలి. మరలా గుర్తుంచు కోవలసిన మరొక విషయం ఏమిటంటే, రెండు సందర్భాలలోనూ కేవలం మానవుడు జాగృత అవస్థలో ఉన్నపుడు లేదా స్వప్న అవస్థలో స్మరణకు వచ్చినపుడు మాత్రమే జగత్తు అనుభవానికి రావడం జరుగుతుంది.

ఏ విధంగా సూర్యుని చుట్టూ తిరిగే గ్రహముల యొక్క అస్థిత్వము సూర్యుని యొక్క కాంతి పుంజం మీద ఆధారపడి ఉంటుందో, అదే విధంగా గ్రహములు కూడా ఈ నవరసాలతో ముడిపెట్టబడ్డాయి. అంతేగాకుండా దైనందిన జీవితంలో మానవుని అనుభవానికి వచ్చే రకరకముల రంగులు కూడా! ఉదాహరణకు శృంగార రసం గురుగ్రహంతో మరియు పచ్చటి రంగుతో ముడిపెట్ట బడిఉన్నది. అలాగే శాంత రసం చంద్రునితో మరియు తెలుపు రంగుతో, అద్భుత రసం రాహువుతో మరియు పసుపు రంగుతో, భయానకం కేతువు మరియు నలుపు రంగుతో, కారుణ్యం శని గ్రహంతో మరియు బూడిద రంగుతో, రౌద్రం కుజునితో మరియు ఎరుపు రంగుతో, వీర భావన బుధునితో మరియు గోధుమ రంగుతో, భీభత్సము శుక్రునితో మరియు బులుగు రంగుతో, ఆఖరిగా హాస్యము సూర్యునితో మరియు తెలుపు రంగుతో ముడిపెట్టబడి ఉన్నాయి. ఇదే విధంగా ప్రతి రసానికి లేదా గ్రహానికి లేదా రంగుకి ఎదో ఒక భగవంతుణ్ణి కూడా ముడిపెట్టడం జరిగింది. ఉదాహరణకు శృంగార రసం, పచ్చటి రంగు మరియు గురుగ్రహాన్ని విష్ణుభగవానునితో లేదా వైష్ణవశక్తి అయిన లక్ష్మితో పోల్చడం జరిగింది. అలాగే మిగిలిన వాటిని కూడా ఏదొక భగవానునితో పోల్చడం జరిగింది. ఇంతకన్నా ఎక్కువగా ఈ విషయాల మీద అధ్యయనం చేయడం అనవసరం. ఎందుకంటే ఈ శాస్త్ర జ్ఞానమంతా భ్రమపూరితం కాబట్టి. కేవలం విషయాన్ని వివరించడానికి మాత్రమే ఈ తర్కాన్ని అంతా వ్రాయ వలసి వస్తుందని గమనించాలి. మానవునికి జగత్తు ఎలా అనుభవానికి వస్తుందనే విషయాన్ని

జ్యోతిశాస్త్రంతో ముడిపెట్టడం కూడా పైన వివరించిన విధంగానే జరిగింది. అలాగే ఇతర శాస్త్రాలను కూడా నిర్మించడం జరిగింది. ఉదాహరణకు వివిధ రకములైన రంగులు ఏ విధంగా మానవుని జీవితాన్ని ప్రభావితం చేస్తాయి మరియు ఆ రంగులకు సంబంధించిన వివిధ మణులు ఏ విధంగా ప్రభావితం చేస్తాయి అని చెబుతూ ఉంటారు. అంతేగాకుండా వీటన్నింటికి సంబంధించిన ఏ దేవతను సంతృప్తి పరిస్తే ఏ విధంగా మానవుని జీవితం ప్రభావితం అవుతుంది అని కూడా వివరించడం జరిగింది.

ఇక్కడందరూ ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ఒక బానిస, తన బానిస బ్రతుకుని ఎలా సుఖవంతం చేసుకోవాలనే విషయం మీద దృష్టి పెట్టబడింది. అంతేగాని అసలు బానిసత్వం నుండి బయట పడితే ఈ శాస్త్రాలన్నీ ఎందుకూ ఉపయోగపడవనే విషయాన్ని విస్మరించడం జరిగింది. పైన వివరించినట్లు, ఈ భ్రమపూరిత జగత్తు అంతా కేవలం కూడబెట్టుకొని ఉన్న సంస్కారాల మీద ఆధారపడి ఉన్నది. వాటి ప్రభావంగా ఆత్మ యొక్క స్వచ్ఛమైన ప్రకాశం మనసు మీద పడుటలేదు. అహంతో మిళితమై ఉన్న కారణంగా జీవాత్మ యొక్క వెలుగు రసాల నుమనస్సులో ప్రకాశితం చేస్తున్నాయి. అంటే జీవాత్మ వెలుగు అంధకారంలా మారింది. అందువలననే అంధకారంలో ఉన్న కారణంగా నవరసాలనేవి మనస్సులో పరిభ్రమిస్తూ జీవుని అనుభవానికి వస్తున్నాయి. స్వచ్ఛమైన ఆత్మ యొక్క వెలుగు మనస్సు మీద పడితే ఈరసాల అనుభూతి అంతా క్షణంలో మాయమవుతుంది. అయితే ఈ ఆత్మ యొక్క వెలుగు మనస్సు మీద పడకుండా సంస్కారాలు (అహంతో మిళితమైన కారణంగా) అడ్డం వస్తున్నాయి అని గమనించాలి. మనం భూలోకంలో ఉన్నపుడు, పగటి పూట ఈ గ్రహాలు ఏవీ కంటికి కనిపించవు. అయితే అంధకారంలో ఉన్నపుడు మాత్రం చక్కగా కనిపిస్తాయి. నక్షత్రాల మాదిరిగా వెలుగుతూ కనిపిస్తాయి. ఇదే విధంగా స్వచ్ఛమైన ఆత్మయొక్క వెలుగు మనసు మీద ప్రకాశించినపుడు ఇవన్నీ కనిపించవు లేదా మానవునికి అనుభవానికి రావు. జీవాత్మ అహంతో మిళితమై ఉన్న కారణంగా అంధకారంలో ఉంటుంది కాబట్టి మనస్సులో నవరసాలన్నీ అనుభవానికి

రావడం జరుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే భ్రమపూరితమైన జగత్తు అనుభవానికి వస్తుంది.

ఒక వైపు పైన వివరించిన విధంగా అనుభవానికి వచ్చే జగత్తు అంతా భ్రమపూరితమైతే, మరలా భ్రమలో మరొక భ్రమను నిర్మించడం జరుగుతుంది. అంటే మనం తెరమీద చలనచిత్రం చూస్తున్నపుడు, చలనచిత్రంలో మరొక చలనచిత్రాన్ని వీక్షించినట్లు అన్నమాట. అది ఎలా అనేది విశ్లేషణ చేద్దాము.

ఉదాహరణకు కొంతమంది మానవులు కోరుకొనే ప్రాపంచిక విషయాలలో ఒకటైన 'శక్తి' అనేది ఎలా ఉంటుందో చూద్దాము. ఇది సహజంగా మనం రాజకీయ నాయకులలో చూస్తుంటాము. ప్రాచీన కాలంలో అయితే రాజులు ఉండేవారు. ఆధునిక కాలంలో ఉన్నది ఎక్కువగా ప్రజాస్వామ్యం లాంటి ప్రభుత్వాలు కాబట్టి, రాజులు లేరు. ఏ వ్యక్తికి అయినా సమాజంలో ఇతర మానవులను శాసించగల శక్తి పెరిగినపుడు దానికి వ్యతిరేకంగా శత్రువులు కూడా అంతే శక్తివంతంగా లభ్యమవడం జరుగుతుంది. అంటే మొత్తం మీద మిగిలే శక్తి (అదీ ఒకవేళ శత్రువుల మీద విజయం సాధించ గలిగితే) చాలా తక్కువ. ఒక వేళ శత్రువుల చేతిలో ఓడిపోవడం జరిగితే ఉన్న 'శక్తి' అంతా హరించుకు పోవడం జరుగుతుంది. ఇదే పద్ధతిని జీవితంలో అన్ని రంగాలకు ఆపాదించవచ్చు. కీర్తి ప్రతిష్టలు ముఖ్యమనుకొనే వ్యక్తికి, అపవాదు వచ్చే సందర్భాలు కూడా ఎక్కువ అవుతుంటాయి. ఏ చిన్న పొరపాటు చేసినా సమాజం పెద్ద ఎక్కువ మోతాదులో వేలెత్తి చూపిస్తుంది. అలాగే ధన సంపాదన ధ్యేయంగా పెట్టుకొని ఉన్న వ్యక్తికి, ఎప్పుడు ఆ ధనం ఎగిరి పోతుందో తెలియదు.

అసలుశక్తి అంటే మాయ లేదా మాయ అంటే శక్తి అని అర్థం. ఈ విషయాన్ని మరొక విధంగా కూడా వివరించా వచ్చును. శక్తి అనే శబ్దం మరియు మాయ అనే శబ్దం మధ్యన తేడా ఏమీ లేదు. అవి కేవలం రెండు వేరు వేరు శబ్దాలు మాత్రమే. అయితే ఈ విషయాన్ని మనసులో జీర్ణించుకొనుటకు చాల వింతగా అనిపిస్తుంది. ముఖ్యంగా అందరికీ పరిచయమైన స్థూల జగత్తులోని వేడి, చలి, జల శక్తి, వాయు శక్తి, సౌర శక్తి

మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుంటే, ఇవి అన్నీ మాయ ఎలా అవుతాయి అనిపిస్తుంది. ఇవేగాక, అణు శక్తి , విద్యుచ్ఛక్తి , అయస్కాంత శక్తి మొదలైన శక్తుల గురించి ఆధునిక కాలంలోని పాఠకులందరికీ పరిచయమే. మాయ అనే శబ్దానికి ఉన్న అర్థం ఏమిటి అనే విషయాన్ని ఆలోచించి చూసినపుడు, ఇది ఎంతో వింతగా అనిపిస్తుంది. అయితే ఇవి అన్నీ బాహ్యంగా మానవుడు పంచ జ్ఞానేంద్రియాలతో అనుభూతి చెందే శక్తులు మాత్రమే !

మానవుడు అంతరంలో అనుభూతి చెందే శక్తులు వేరుగా ఉన్నాయి. వాటిని మూడు రకములుగా విభజన చేయవచ్చును. అన్నింటికన్నా మొదటిది బుద్ధి , ఆ తరువాత మనసు మరియు ఆఖరిగా భౌతిక శరీరాన్ని నడిపించే ప్రాణ శక్తి. అయితే ఈ మూడు రకముల శక్తులు ఆదిశక్తి యొక్క స్థూల స్వరూపాలుగా పాఠకులందరూ గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే తన ప్రాథమిక స్వరూపంలో ఆది శక్తి లేదా పరాశక్తి లేదా విశ్వ శక్తి కేవలం మాయ మాత్రమే !

మాయ అంటే ఒక విధమైన ఇంద్రజాలం కదా ! అని అనుకుంటారు అందరూ. అయితే ఇదే విషయాన్ని భగవంతునికి అంటగట్టినపుడు లేదా భగవంతుడే స్వయంగా అందరికీ ఇంద్రజాలం లాంటిది ప్రదర్శించినపుడు, ఆ మాయ శక్తి అవుతుంది అని అర్థం. ఈ విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే ముందుగా ఒక విషయాన్ని ఒప్పుకొని ఆ తరువాత శక్తిని గురించి అధ్యయనం చేసే పనిని ప్రారంభించాలి.

అదేమంటే, భగవంతుని ఇంద్రజాలం మాయ అని చెప్పినపుడు, ఆ భగవంతుని కృప లేకుండా ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం కుదరదు. అంతరంలోని అహంకారాన్ని అణగత్రొక్కి, భగవంతునికి సంపూర్ణంగా ఆత్మ సమర్పణ చేసినపుడు, భగవంతుడే స్వయంగా తన ఇంద్రజాలం అర్థమయ్యేటట్లు చెయ్యడం జరుగుతుంది. ఈ విషయాన్ని మరొక విధంగా కూడా చెప్పవచ్చును. ఏ విశ్వశక్తి నానా రకముల స్థూల స్వరూపాలు ధరించి, సృష్టి రచన చేసిందో , ఆ పరాశక్తే స్వయంగా విలీనం అయిపోయి

మానవునికి తన నిజ స్వరూపాన్ని అవగతం చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా పరాశక్తి తన ప్రాథమిక అవస్థ అయిన మాయ నుండి మొదట మానవుని మేధస్సు మరియు అహంకారంగా పరిణామం చెందుతుంది. కాబట్టి మానవుడు తన అహాన్ని సంపూర్ణంగా విలీనం చేసి, మనసును ఆలోచనారహిత స్థితికి తీసుకొని వెళితేగాని, విశ్వశక్తి యొక్క నిజ స్వరూపం మాయ అనే విషయం అవగతం కాదు. ఈ విషయాన్ని సూక్ష్మ దృష్టితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించ వలసినదిగా పాఠకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

అయితే ఇక్కడ పాఠకులు ఒక ప్రశ్న వేయుటకు అవకాశం ఉన్నది. ఈ జగత్తు అంతా మాయ అని చెప్పినపుడు, దీని అర్థం మనిషికి ప్రతిదినం జాగ్రదావస్థలో అనుభవానికి వచ్చే చెట్లు, పర్వతాలు, గాలి,నీరు, అగ్ని మొదలైనవి అన్నీ కూడా అసలు ఈ విశ్వంలో లేనట్లేగా! అంటే వాటిని చూసి అవి లేకపోయినా ఉన్నట్లు భ్రమపడి అనుభూతి చెందడం జరుగుతుందా? ఇలా అయితే ఉదాహరణకు ఒక మనిషి ఇటుక రాళ్లతో నిర్మించిన ఒక గోడను సునాయాసంగా దాటి వెళ్లిపోవాలిగా ! సాధారణంగా అందరికీ వచ్చే అనుమానం ఇది. ఇటువంటి ప్రశ్నలన్నింటికి సమాధానం ఒకటే!

మనసు ఆలోచనా రహిత స్థితిలో స్థిర పడుట మొదలైన తరువాత ఇటువంటి మహిమలు ప్రకటితం అవడం జరుగుతుంది. విశ్వశక్తి అయిన మహామాయ తన స్థూల రూపాలన్నింటిని వదిలి, జీవుని యొక్క ఆత్మను భ్రమ నుండి ముక్తి చేయడం ప్రారంభించినపుడు, అనేక రకములైన సిద్ధులను సాధకునికి ప్రసాదిస్తుంది. భ్రమ తొలగిపోయే కొలదీ ఈ జగత్తులో అనుభవానికి వస్తున్నదంతా కేవలం స్వప్నం లాంటిది అనే విషయం కూడా అవగతమవుతుంది.

ఏ విధంగా ఒక మానవుడు స్వప్నంలో కలల ప్రపంచాన్ని సంపూర్ణంగా అనుభూతి చెంది, నిద్ర నుండి మేల్కొని తను అనుభూతి చెందినదంతా నిజం కాదని, కేవలం స్వప్నం అని తెలుసుకుంటాడో, అదే విధంగా ఆలోచనా రహిత స్థితిలో స్థిర పడుట ప్రారంభించిన తరువాత ఈ జగత్తు కూడా కేవలం

భ్రమపూరితమైనదనే విషయాన్ని తెలుసుకోవడం జరుగుతుంది. అప్పుడు అసలు మహిమలు లేదా సిద్ధులు అనే పదాలకి అర్థం ఏమీ లేదనే విషయం కూడా అవగతమవుతుంది. అసలు జగత్తు అనే దానికి అస్థిత్వం ఉంటేగా ? జగత్తే భ్రమపూరితమని అవగతమైన తరువాత ఇక జగత్తు ఆధారంగా ప్రకటితమయ్యే మహిమలకు, సిద్ధులకు అర్థం లేదు కదా! అయితే ఈ విషయం సమాధి స్థితిలో (ఆలోచనా రహిత స్థితిలో) స్థిర పడిఉన్న యోగికి మాత్రమే వర్తిస్తుంది. మిగిలిన మానవులకు అవి అన్నీ మహిమలుగానే కనిపిస్తాయి.

కొన్ని సందర్భాలలో మనసులో కొన్ని రకముల క్రియలు వ్యక్తమవుతాయి. మేఘాలు గర్జించే ధ్వని వినిపించుట మరియు విద్యుత్ మెరుపు కనిపించుట మొదలైనవి. ఇవి మనసులో సంచితమైఉన్న ఇంద్రియాల అనుభూతులు మరియు జ్ఞాపకాలకు సంబంధించినవి. అంటే ప్రతి వ్యక్తి ఎన్నో సందర్భాలలో లేదా ఎన్నో జన్మలలో మేఘాలు గర్జించే ధ్వనిని విని ఉంటాడు. అదే విధంగా విద్యుత్ మెరుపుని కూడా చూసి ఉంటాడు. ఈ అనుభవాలు అన్నీ మనసులో ముద్రితమై ఉంటాయి. అందువలన ఇలాంటి క్రియలు అంతరంలో వ్యక్తమవుతాయి. క్రియల ఫలితంగా అవి శాశ్వతంగా అంతరం నుండి చెరిపి వేయబడుట జరుగుతుంది. అయితే ఇక్కడ పాఠకులకు ఒక అనుమానము రావచ్చు. అంతరంలో శబ్దం వినిపించుట మరియు మెరుపుని దర్శించుట ఎలా సాధ్యం ? ఇవి తత్వాల ఆధారంగా ప్రకటిత మవుతాయి.

ఈ విషయాన్ని ఇంకా క్షుణ్ణంగా వివరిస్తాను.

మనకు అనుభవమయ్యే జగత్తు అంతా అయిదు తత్వాల ఆధారంగా నిర్మితమై ఉన్నదని అన్ని ప్రాచీన శాస్త్రాలు విరివిగా చెబుతున్నాయి. జగత్తు ఒక్కటే కాకుండా మానవ శరీరం సైతం ఈ పంచ తత్వాలతోటే నిర్మితమై ఉన్నది. ఈ అయిదు తత్వాల యొక్క స్థూల రూపాలను పంచ భూతాలని కూడా పిలుస్తారు.

అవి భూమి, నీరు, అగ్ని, గాలి లేదా వాయువు మరియు ఆకాశము. ఆకాశం అంటే మన కళ్ళకు కనిపించే శూన్యం. ఇది భూమండలం చుట్టూ

ఉపరితలం మీద అనుభవమయ్యే వాతావరణం వరకు మాత్రమే పరిమితం కాదు. శూన్యం అంటే బ్రహ్మాండం అంతా వ్యాపించి ఉన్న అంతరిక్షం సైతం లెక్కలోకి వస్తుంది. శూన్యం అంటే ఏమీ లేనిదని కదా అర్థం అని పాఠకులు ప్రశ్నించ వచ్చును. అయితే ఏమీ లేని శూన్యం అనేది ఎవరికీ అనుభవానికి రాదు. ఏదైనా ఉన్నదని అనుభూతి చెందుతున్నాము అంటే దాని అర్థం అది ఉన్నదని. కనుక ఏ శూన్యం మన అనుభవానికి వస్తుందో ( అంటే మన కళ్ళకు కనిపించే ఆకాశం మరియు అంతరిక్షం ) అది ఆకాశము అనే అతి సూక్ష్మమైన సాంద్రత కలిగిన పదార్థంతో నిర్మితమై ఉన్నదని అర్థం. ఇది ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి ఇంకా అంతు చిక్కని రహస్యం. ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు శూన్యము లేదా ఆకాశము అనే పదార్థం ఏమీ లేదని ప్రయోగాల ద్వారా ఋజువు చేసి తేల్చి చెప్పడం జరిగింది. అయితే ప్రాచీన శాస్త్రాలు చెబుతున్న విషయం ' ఆకాశము ' అనే పదార్థం ఉన్నదని. ఈ ఆకాశం నుండి మిగిలిన నాలుగు తత్వాలు ( అంటే వాయువు, అగ్ని, నీరు, భూమి ) ప్రకటిత మవడం జరిగింది. దీని ఫలితంగా బ్రహ్మాండమంతా ఎన్నో సౌర కుటుంబాలు, నక్షత్రాలు, గ్రహాలు మొదలైన వాటితో నిండిపోయి ఉన్నది.

కాబట్టి నక్షత్రాల మధ్యన మరియు గ్రహాల మధ్యన అంతా వ్యాపించి ఉన్న శూన్యము లేదా అంతరిక్షము మరియు మన భూమి చుట్టూ ఉన్న ఆకాశము రెండూ ఒకటే !

ఇక్కడ పాఠకులకు మరొక విషయాన్ని స్పష్టం చేయదలచుకున్నాను. ఈ బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్నది మరియు మానవుని అనుభవానికి రానిదేమైనా ఉన్నది అంటే అది బ్రహ్మం లేదా భగవంతుడు మాత్రమే. అంటే ఈ జగత్తు అంతా వ్యాపించి ఉన్నది మరియు జగత్తు అనే శరీరానికి తనే నాథుడు అనుకుంటున్నది 'జగన్నాథుడు' అని అర్థం. కాబట్టి ఆధునికశాస్త్రవేత్తలు చెబుతున్నట్లు 'ఆకాశము' అనే పదార్థం ఏమీ లేదనేది తప్పు అని చెప్పవచ్చును.

అయితే ఈ అయిదు తత్వాలు మరియు వాటి స్థూల రూపాలు అయిన పంచ భూతాలు మానవుని యొక్క పంచ జ్ఞానేంద్రియములకు ప్రతీకలు.

భూమికి వాసన, నీటికి రుచి, అగ్నికి రంగు మరియు రూపం, గాలికి స్పర్శ అనుభూతి మరియు ఆకాశమునకు శబ్దం అనునవి ప్రతీకలు. అంతేగాక భూమి మూలాధార చక్రానికి, నీరు స్వాధిష్టాన చక్రానికి, అగ్ని మణిపూరక చక్రానికి, గాలి అనాహత చక్రానికి మరియు ఆకాశము విశుద్ధ చక్రానికి సంబంధించినవి. ఈ రెండు విషయాలను కలిపి విశ్లేషణ చేస్తే, మానవుని మనసులో అనుభూతి చెందే వాసన, రుచి, రంగు మరియు రూపం, స్పర్శ అనుభూతి మరియు శబ్దం వినిపించుట మొదలైనవన్నీ శరీరంలోని మెదడు–వెన్నుపాము వ్యవస్థలోని చక్రాలతో ముడిపెట్టబడి ఉన్నాయని అర్థమవుతుంది. అందువలన మానవుని అనుభవానికి వచ్చే స్థూల జగత్తు అంతా పంచ భూతాలు మరియు అతని యొక్క అయిదు ఇంద్రియములతో ముడిపెట్టబడి ఆ వ్యక్తి యొక్క మస్తిష్కం మీద ధారణ చేయబడుతుంది. అంటే బ్రమపూరితమైన సృష్టి రచన పూర్తి అయిపోయినదని అర్థం.

బహుశా ఇప్పటికి పాఠకులు అసలు విషయాన్ని అంటే ఈ జగత్తు లేదా మానవ శరీరం లేదా శక్తి, మాయ ఎలా అవుతుందో అనే విషయాన్ని గ్రహించి ఉంటారని భావిస్తాను.

అంటే ఏ తత్వాలతో ఈ జగత్తు అంతా నిర్మితమై ఉన్నదో, ఆ తత్వాలతో మానవుని శరీరం కూడా నిర్మితమై ఉన్నది. దీని అర్థం మానవ శరీరం ఈ తత్వాల యొక్కవిలీనం అంటే భూమి నీరుగా మారుట (భూమండలం లోతుల్లో భూమి అంతా ద్రవ రూపంలో ఉంటుంది) , నీరు అగ్నిగా మారుట ( సూర్యునిలో జరిగే ప్రక్రియ ఇదే ) , అగ్ని వాయువుగా మారుట ( ఇది పాఠకులు సులభంగా అర్థము చేసుకొనవచ్చును) , వాయువు మరలా తిరిగి 'ఆకాశము' అనే పదార్థంలో విలీనమవుట మొదలైన ప్రక్రియలు సాధకుడు అనుభూతి చెందినపుడు ఈ శక్తి అంతా మాయ, లేదా ఈ జగత్తు అంతా మాయ అనే విషయం అర్థమవుతుంది. చివరికి ఆకాశము సైతం మానవ శరీరంలోనే విరాజిల్లుచున్న ఆత్మ లేదా బ్రహ్మం లేదా భగవంతునిలో విలీనం అవుట జరుగుతుంది. అంటే మోక్షము అనుభూతి చెందే విధానము అని అర్థం.

అయితే ఇలాంటి అనుభవాలు రావాలంటే సాధకులు ఆధ్యాత్మికంగా

ఉన్నత స్థాయిని పొందాలి. అంటే దీని అర్ధం మనసు ఆలోచనా రహిత స్థితికి చేరుకోవాలి. అంటే దీని అర్ధం మనసులో జన్మ జన్మల నుండి ముద్రితమైఉన్న ఇంద్రియాల అనుభూతులు మరియు వాటి జ్ఞాపకాలు చెరిపి వేయబడాలి. అంటే వ్యక్తిగత స్థాయిలో మానవుని యొక్క జగత్తు ( ఇది అంతరంలోనే భ్రమగా ప్రతి వ్యక్తి అనుభూతి చెందుతూ ఉంటాడు) విలీనం కావాలి. అయితే ఈ ప్రక్రియ అంతా జరుగుట అంత సులభమా! అని పాఠకులు భయపడవలసిన అవసరం లేదు. ఏ మానవుడూ తన స్వంత ప్రయత్నంతో ఈ ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితిని పొందలేడు. ఏ విశ్వశక్తి అయిదు తత్వాల రూపంలో మానవ శరీరంగా సృష్టింప బడినదో, ఆ పరాశక్తి ద్వారా మాత్రమే తిరిగి మరలా ఈ శరీరం యొక్క విలీనం జరుగుతుంది. జీవాత్మకి ఈ తత్వాలు విలీనం చెందే ప్రక్రియ యొక్క జ్ఞానం కూడా సంపూర్ణంగా అనుభవానికి వస్తుంది. దీని అర్ధం ఆ వ్యక్తికి మహిమలు, సిద్ధులు మొదలైనవి ప్రాప్తిస్తాయి. అంతేగాక, ఈ జగత్తు అంతా కేవలం భ్రమపూరితమైనదనే విషయం కూడా స్పష్టమవుతుంది.

సాధారణంగా సాధకులకు ఈ అనుభవాలు కలగకపోవడానికి కారణం మనసులో ఇంకా పేరుకొని ఉన్న సంస్కారాలు. మనసులోని సంస్కారాలు అన్నీ క్షీణించిన తరువాత మాత్రమే తత్వాలు విలీనం చెందే అనుభవం పొందడం జరుగుతుంది.

కుండలినీ శక్తి జాగృతం అయిన వెంటనే తన క్రియాత్మక దిశనుండి ఊర్ధ్వదిశలోకి మరలి మానవునికి భ్రమపూరితమైన జగత్తు నుండి ముక్తిని ప్రసాదించుట ప్రారంభిస్తుంది.

అంటే అంతరంలో కూడిఉన్న ఇంద్రియ అనుభూతులను మరియు జ్ఞాపకాలను అతివేగంగా చెరిపివేయుట ప్రారంభిస్తుంది. దీని కోసం సాధకుని శరీరంలో, మనసులో మరియు దైనందిన జీవితంలో అతివేగంగా క్రియలను వ్యక్తపరచడం ప్రారంభిస్తుంది. క్రియలు వ్యక్తమయ్యే కొలదీ మానవునిలోని సంస్కారాలన్నీ శుభ్రపరుచ బడుట ప్రారంభమవుతుంది.

దీని ఫలితంగా సాధకుని యొక్క మనసు అతివేగంగా ఉన్నత

భూమికలకు చేరుకోవడం ప్రారంభమవుతుంది. అంటే మనసు యొక్క స్థితి వేగంగా మారుతూ ఉంటుంది.

# అహం బ్రహ్మాస్మి

మానవుడు మనుగడ సాగిస్తున్న ఈ విశ్వం అతి సువిశాలమైనదని ఆధునిక శాస్త్రం సైతం చెబుతుంది. ఆధునిక పరికరాల ద్వారా ఈ విశ్వం ప్రస్తుతం ఎంత సువిశాలమైనది అనే విషయాన్ని చెప్పడం జరిగింది. అంతేగాకుండా ఈ విశ్వం నిరంతరం ఇంకా పెద్దది అవుతూనే ఉన్నది అని కూడా చెప్పడం జరిగింది. అంటే పెరిగే నీటిబుడగలాగా అన్నమాట! అయితే ఈ సువిశాల విశ్వం మానవుని ఊహకు సైతం అంతుచిక్కనిది. కేవలం ప్రస్తుతం ఉన్న ఆధునిక పరికరాల సామర్థ్యాన్ని బట్టి శాస్త్రజ్ఞులు అంచనావేసి చెప్పిన విషయం మాత్రమే ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఈ లెక్క ప్రకారం చూసినా ఈ విశ్వం అతి పెద్ద సువిశాలమైనదని చెప్పవచును. ఇంత పెద్ద సువిశాల విశ్వంలో కనీసం 40వేల కోట్ల గెలాక్సీలు ఉంటాయని చెబుతున్నారు. ఒక్కక్క గెలాక్సీలో మనకు కనిపించే సూర్యభగవానుడు లాంటి నక్షత్రాలు వేల కోట్లలో ఉంటాయి. ఉదాహరణకు మన సూర్యభగవానుడు ఉండే గెలాక్సీని "పాలపుంత" లేదా "ఆకాశగంగ" అంటారు. ఈ గెలాక్సీలోనే దాదాపు పది వేల కోట్ల నక్షత్రాలు (సూర్య భగవానుని లాంటి నక్షత్రాలు) ఉంటాయని చెప్పడం జరిగింది. ఈ లెక్క ప్రకారం ఈ విశ్వం ఎంత పెద్దది అనేది అర్థం అవుతుంది.

ఇంకా చెప్పాలంటే ఆధునిక పరికరాలు పసిగట్టలేని విశ్వం ఇంకా

ఎంతవరకు ఉన్నదో ఎవరికీ తెలియదు.

అయితే మానవుడు మనుగడ సాగిస్తున్నది ఈ సువిశాల విశ్వంలోనే అనే విషయం స్పష్టమవుతుంది. లేదంటే మానవుడు ఎక్కడి నుండి వచ్చాడు? అనే ప్రశ్న తలెత్తుతుంది. అంతేగాకుండా మానవునిలో ఉండే మేధస్సు సైతం ఈ విశ్వంలోని భాగం మాత్రమే! లేదంటే మానవుని మేధస్సు ఎక్కడి నుండి వచ్చింది? అనే మరొక ప్రశ్న తలెత్తుతుంది. అలాగే మానవ మేధస్సుతోపాటు మానవుని మనస్సు, మనస్సులోని భావనలు, సంకల్పం మరియు వికల్పం చేసే శక్తి మరియు ఇతర అన్ని మానసిక శక్తులు కూడా ఈ విశ్వంలో భాగమే అని ఒప్పుకోవలసి వస్తుంది. లేదంటే ఇవన్నీ ఎక్కడి నుండి వచ్చాయి? అనే ఇంకొక ప్రశ్న తలెత్తుతుంది.

ఒక వేళ ఇవన్నీ భాగమైతే, అప్పుడు విశ్వం అంతా కేవలం స్థూలమైన భౌతిక శక్తే గాకుండా, సూక్ష్మమైన మానసిక శక్తులతో కూడా నిండి ఉంటుందనే విషయాన్ని ఒప్పుకోవలసి వస్తుంది. లేదంటే మానవుడు విశేషంగా ఈ విశ్వంలో ఎక్కడి నుండి ఊడిపడ్డాడు? అనే ప్రాధమిక ప్రశ్న ఉదయిస్తుంది.

మానవుడు విశ్వంలో భాగం అని ఒప్పుకుంటే ఇది మరొక విషయానికి దారి తీస్తుంది. విశ్వానికి మరియు మానవునికి భేదం లేదనే విషయాన్ని ఒప్పుకోవలసి వస్తుంది. అంటే అగ్నికి మరియు అగ్ని కణానికి తేడా ఏమీ లేనట్టు అన్నమాట! ఈ రెండూ విడివిడిగా ఉండటం అనేది సిదాంత పరంగా కూడా సాధ్యం కాదు. సముద్రం మరియు సముద్రపు నీటి బుడగ రెండూ ఎప్పటికీ వేరు కాదు. అలాగే ఈ సువిశాల విశ్వం మానవుడు అని చెప్పవచ్చును మరియు మానవుడే ఈ సువిశాల విశ్వం అని కూడా చెప్పవచ్చును.

మానవుడే ఈ సువిశాల విశ్వమైతే, మానవుడు తప్ప ఇంకేమీ లేదని కూడా చెప్పవచ్చును. అలాగే మానవునికి తాను తప్ప తనకి ఇంకేదైనా కనిపిస్తుంది లేదా ఉన్నట్లు అనుభవమవుతుంది అంటే అది కేవలం అసత్యమైనదని కూడా చెప్పవచ్చును.

అయితే విషయం తర్కించినంత సులభంగా ఉండదు అనే విషయం అందరికీ తెలిసిందే! ప్రతి మానవునికి తాను వేరు మరియు ఈ విశ్వం వేరు అని మాత్రమే స్ఫూరణకు వస్తుంది. సిద్ధాంతం మాత్రం మానవునికి అవగతం అయ్యే జ్ఞానాన్ని తప్పు పడుతుంది. అంటే మానవుని మేధస్సుకి అవగతం అవుతున్న సిద్ధాంతం నిజమా లేదా ద్వైతభావనతో అనుభూతి చెందుచున్న ఈ విశ్వం నిజమా?

ఇటువంటి పరిస్థితుల్లో ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే ఒకే ఒక మార్గం ఉన్నది. ప్రత్యక్షంగా అనుభవం చెందడం. ప్రతి మానవునికి ఈ విషయం స్వయంగా తన అంతరంలోనే అనుభవం చెందడం అనేది తప్పనిసరిగా జరగాలి. అంటే రావలసింది అంతా మానసిక స్థితిలో మార్పు. అంటే బయట నుండి ఏ జ్ఞానమూ రాదని అర్థం. అంటే జగత్తు కేవలం భ్రమపూరితమైనదనే విషయం అర్థమవుతుంది.

అయితే ఇక్కడ పాఠకులు మరొక ప్రశ్న వేయవచ్చును. మానవుడు విశ్వంలో భాగం అయినంత మాత్రాన స్వయంగా విశ్వం అవ్వాలని లేదు కదా! (అగ్ని కణం అగ్నిలో భాగమే అయినా స్వయంగా అగ్ని ఏమీ కాదు. అంటే పరిమాణంలో చాలా చిన్నది.) అని ప్రశ్నించవచ్చును. ఈ విషయానికి సమాధానం చెప్పేముందు పాఠకుల దృష్టిని ఇంతకుముందు పైన వివరించిన విశ్వం యొక్క పరిమాణం వైపు తీసుకు వెళతాను.

ఈ సువిశాల విశ్వంలో దాదాపు 400 బిలియన్ల (ఒక బిలియన్ అంటే వంద కోట్లు) గెలాక్సీలు ఉన్నాయని ఆధునిక విజ్ఞాన శాస్త్రం చెబుతున్నది. ప్రతి గెలాక్సీలో దాదాపు ఇంతే సంఖ్యలో నక్షత్రాలు వున్నాయి. ఉదాహరణకు మన "సూర్యుడు" ఉండే గేలక్సీలోనే (దీనిని "పాలపుంత" లేదా "ఆకాశగంగ" అని పిలుస్తారు.) దాదాపు 100 బిలియన్ల సూర్యులు లేదా నక్షత్రాలు ఉన్నాయని విజ్ఞాన శాస్త్రం చెబుతున్నది. అయితే ఈ విశ్వం యొక్క పరిమాణం నిరంతరం పెద్దది అవుతూ కనిపిస్తుందని విజ్ఞాన శాస్త్రం చెబుతున్నది (నిరంతరం పెరుగుతూ పెద్దది అవుతున్న నీటిబుడగ మాదిరిగా). ఇక్కడ అందరికీ మనస్సులో తలెత్తే ప్రశ్న ఏమిటంటే విశ్వం తరువాత ఏమి ఉంటుందని.

కేవలం శూన్యం అయితే, అది ఇంకా ఎంతవరకు విస్తరించి ఉండవచ్చు అనే అనుమానం కుడా వస్తుంది. అయితే ఆధునిక శాస్త్రం మాత్రం శూన్యం అనే పదాన్ని మరొక విధంగా అర్ధం చేసుకొని చెబుతున్నది. అసలు "కేవలం శూన్యం" అనేది ఏమీ లేదని చెబుతున్నది. అంటే మన విశ్వం ఎంత వరకు వ్యాపించి ఉంటే అంతవరకే దానిని "శూన్యం" అంటున్నది.

అంటే విశ్వం ఇంకా వ్యాపించని ప్రదేశాన్ని "శూన్యం" అని ఒప్పుకోవడం లేదు. అయితే దానిని ఏమని పిలవాలి? లేదా ఇది కేవలం భాషా పద జాలం యొక్క భ్రమా? మన ప్రాచీన శాస్త్రాల ప్రకారం ఆధునిక విజ్ఞాన శాస్త్రపు "శూన్యాన్ని" ఆకాశం అంటారు. అయితే ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం "ఆకాశం" అన్నది కేవలం భూమి చుట్టూ కొంతవరకు మాత్రమే వ్యాపించి (వాయు మండలం ఉన్నంత వరకు). ఆ తరువాతి ప్రదేశాన్ని "శూన్యం" అని చెబుతున్నది. అంటే ఏమీ లేని ఖాళీ ప్రదేశం అని అర్ధం కాదు. కేవలం గ్రహాల మధ్యన ఉన్న ప్రదేశాన్ని "శూన్యం" అని చెబుతున్నది. అంటే వివిధ రకములైన కిరణాలతో (కాంతి, ఎక్స్-రే మొదలైనవి) నిండి ఉన్న ప్రదేశాన్ని "శూన్యం" అని చెబుతున్నది. అయితే ఏమీ లేని ఖాళీ ప్రదేశం "శూన్యం" అని ప్రాచీన శాస్త్రాలు చెప్పేదానికి అర్ధం? ఏమిటి? అసలు అలాంటిది ఉండదు అని విజ్ఞాన శాస్త్రం చెబుతున్నది. మరి ఇంకా వ్యాపించి ఉండని విశ్వం తరువాత ఉన్న ప్రదేశాన్ని ఏమని పిలవాలి? ప్రాచీన శాస్త్రాల యొక్క నిర్వచనాన్ని అనుసరించి దానిని ప్రస్తుతానికి "శూన్యం" అని పిలుద్దాము. అయితే ఇంకా విశ్వం విస్తరించని ప్రదేశాన్ని "శూన్యం" అని చెప్పవచ్చును. అయితే విశ్వం తరువాత "శూన్యం" అనేది ఎంతవరకు విస్తరించి ఉన్నది అనే ప్రశ్న తలెత్తుతుంది. అది అనంతం అని ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేగాకుండా మన విశ్వం లాంటి సృష్టి రచనలు లెక్కించుటకు అలవికాని సంఖ్యలో ఉన్నాయని కూడా ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి సంబంధించినంత వరకూ అవేమీ లేనట్లు లెక్క. ఎందుకంటే ఇంతవరకూ ఆధునిక పరికరాల మాధ్యమంగా అలాంటి సృష్టి రచనలను పసిగట్టలేదు కాబట్టి!

ఇప్పుడు ఇంతకు ముందు మనం పైన చర్చించిన అసలు ప్రశ్నకు వద్దాము. మానవుడు ఈ అనంతమైన విశ్వంలో భాగం అయినంత మాత్రాన తానేమీ ఈ "విశ్వం" కాదు. అంటే మానవుడు వేరు మరియు "మానవుడు" కానీ విశ్వం అనంతం అని. అసలు సమస్య అంతా ఇక్కడి నుండే మొదలవుతుంది. దానినే ద్వైత భావన అంటారు.

అంటే మానవుని యొక్క మనస్సు తాను వేరని మరియు విశ్వం (లేదా భగవంతుడు) వేరనే భావనలో ఉన్నంత కాలం విశ్వాన్ని గురించి ఇలాంటి అవగాహనతో ఉండుట జరుగుతుంది. పైన చర్చించినట్లు లెక్కలు వేస్తూనే పోవడం జరుగుతుంది. అలాగే తర్కాన్ని సాగదీస్తూనే పోవడం జరుగుతుంది. విజ్ఞాన శాస్త్రం, గణితం, తర్కం మొదలైనవి ఎప్పటికీ ఆగని గానుగ రాళ్ళవంటివి. అలాగే వేదాంతం, మతం మొదలైనవి కూడా ఆ గానుగ రాళ్ళ కన్నా పెద్ద గొప్పవైనవి కూడా ఏమీ కాదు.

ఇంకా చెప్పాలంటే "కేవలం శూన్యం" అనేది అసలు ఉండదు అని ఆధునిక విజ్ఞాన శాస్త్రం చేసే వాదన మరియు శూన్యం అనేది అనంతమైన విశ్వానికి ప్రతీక అని ప్రాచీన శాస్త్రాలు ఎప్పటికీ ఒక కొలిక్కి రాని గానుగ రాళ్ళ వంటివి. మానవుని మనస్సు ఈ భ్రమ పూరితమైన జగత్తులో (శూన్యం మరియు సమయం యొక్క విశ్వంలో) ఉన్నంతకాలం ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతూనే ఉంటుంది. ప్రతి దానిని లెక్కించుట, కొలవడం, తర్కించుట మొదలైన పనులతో మనస్సుని విరామం లేకుండా ఉంచినంత కాలం, సత్యం అనేది ఆగమ్య గోచరంగా ఉంటుంది. ప్రతి విషయాన్ని పై విషయాల మాధ్యమంగానే చూస్తూ పోవడం జరుగుతుంది. అలాగే ప్రతి విషయాన్ని పై విషయాల మాధ్యమంగానే అర్థం చేసుకోవాలని ప్రయత్నించుట జరుగుతుంది. అంటే పై విషయాలను (లెక్కించుట, కొలుచుట, తర్కించుట) చేస్తున్న మానవుని మేధస్సు సైతం ఈ విశ్వంలో ఒక భాగమైతే, మానవుని మేధస్సుకి మించి ఉన్న విశ్వం యొక్క అవగతం ఎప్పటికి అవుతుంది? లేనిచో మానవునికి లేదా మానవుని మేధస్సుకి మరియు భగవంతునికి లేదా భగవంతుని శరీరం అయిన అనంత విశ్వానికి

తేడా ఏమీ లేదని ఒప్పుకోవలసి వస్తుంది.

నేను క్రింద వ్రాయబోతున్న విషయాలను కొంచెం సున్నితమైన మరియు కల్పనా దృష్టితో ఆలోచించమని పాఠకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే ఈ విశ్వమంతా లేదా సృష్టి అంతా మాయాపూరిత మైనదనే విషయాన్ని ఆ మాయా జగత్తులోనే ఉంటూ వివరించడం మరియు అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టం కాబట్టి! ఈ పుస్తకాన్ని వ్రాస్తున్న నేను, ఈ పుస్తకం మరియు ఈ పుస్తకాన్ని చదువుచున్న మీరు  అందరం ప్రస్తుతం ఈ మాయా జగత్తులోనే నివసిస్తున్నాము. అంటే ద్వైత భావన కలిగిన భ్రాంతిలో ఉన్నాము. అందువలన నేను క్రింద వ్రాయబోతున్న విషయాలను కొంచెం సున్నితంగా గ్రహించడానికి ప్రయత్నం చెయ్యమని విజ్ఞప్తి చేస్తున్నాను.

మీలో ఎవరైనా ఒకరు ఒక పెద్ద అద్దాలతో నిర్మించిన గదిలో నడిమధ్యన నిలబడి ఉన్నారని భావించండి. అయితే అద్దం అంటే ప్రతిబింబించే అద్దం. అంతేగాని గాజుతో నిర్మించిన గది కాదు. దీని అర్థం ఏమిటంటే గది బయట నుండి ఎవరూ లోపల ఉన్న దృశ్యాన్ని చూడలేరు. అలాగే గది లోపల ఉన్న మీరు గది బయట ఉన్న దృశ్యాన్ని చూడలేరు. కేవలం మీ శరీరం మాత్రమే అద్దంలో ప్రతిబింబిస్తూ కనిపిస్తుంది. మీరు ఏ దిక్కుకు తిరిగి చూసినా మీ శరీరం మాత్రమే మీకు దర్శనం అవుతుంది. అలాగే మీ కాళ్ళ క్రింద ఉన్న నేల మరియు మీరు తలపైకెత్తి చూస్తే కనిపించే కప్పు లోపలి భాగము (సీలింగ్) కూడా అద్దంతో నిర్మించ బడిఉన్నాయి.

ఇప్పుడు మరొక విషయాన్ని కూడా కల్పన చేయండి! ఆ అద్దం అంతా చిన్న చిన్న పలకలతో నిర్మించబడి ఉన్నది అనుకోండి! అంటే మీ చుట్టూ ఉన్న నాలుగు గోడలు, మీ కాళ్ళ క్రింద ఉన్న నేల మరియు మీరు తల పైకెత్తి చూస్తే కనిపించే కప్పు లోపలి భాగము అన్నీ చిన్న చిన్న అద్దపు పలకలతో (ఆంగ్ల భాషలో టైల్స్) నిర్మించబడి ఉన్నాయి అన్నమాట! అయితే గదిలో వెలుతురు కూడా ఉండే విధంగా గది నిర్మించ బడినది. లేనిచో చీకటిలో మీకు ఏమీ కనిపించక పోవచ్చు. ఇప్పుడు మీకు ఎటు చూసినా అనేకమైన మీ స్వంత రూపాలే దర్శనం అవుతాయి. అంటే ప్రతి అద్దం పలక మీ యొక్క శరీరాన్ని

విడిగా ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఉదాహరణకు మీరు ఏదో ఒకవైపు ఉన్న అద్దాల గోడవైపు చూస్తే ఆ గోడలో ఉన్న ప్రతి అద్దం పలక మీ శరీరాన్ని విడిగా మీకు ప్రతిబింబిస్తూ కనిపిస్తుంది. అంటే మీ శరీరమే మీకు అనేక రూపాలుగా కనిపించడం అన్నమాట! మీరు ఎటువైపు తిరిగి చూసినా మీకు అదే దృశ్యం కనిపిస్తుంది. మీరు చేతులు రెండూ పైకెత్తి నమస్కారం పెడితే అదే విధంగా అనేకమైన అద్దాల పలకలలో ఉండే మీ ప్రతిబింబంలో కూడా అదే దృశ్యం కనిపిస్తుంది.

ఇప్పుడు మీకు మరొక దృశ్యాన్ని కల్పన చేస్తాను. ఆ గదిలో ఏదొక గోడవైపు ఒక అద్దంతో నిర్మించబడిన ద్వారం మరియు తలుపు ఉన్నాయి. ఈ ప్రయోగానికి ముందే ఆ అద్దం తలుపు మీద ఏదో ఒక చిన్న గుర్తు పెట్టబడి ఉన్నది. అంటే అక్కడ తలుపు ఉన్నదనే విషయం మీకు అర్థం కావడానికి అన్నమాట! కొంచెం సేపు నలువైపులా తిరిగి శ్రమిస్తే ఆ తలుపు ఎక్కడ ఉన్నదో మీరు సునాయాసంగానే గుర్తుపట్టగలరు. మీరు ఇప్పుడు ఆ తలుపు తెరిచి ప్రక్కనే ఆ గదికి ఆనుకుని ఉన్న మరొక గదిలోకి వెళతారు అనుకుందాము. ప్రక్క గదిలోకి వెళ్ళగానే మీకు దృశ్యం అంతా మారిపోతుంది. ఇప్పుడు ఆ రెండవ గది అంతా మొదటి గదిలాగే అద్దంతోనే నిర్మించబడి ఉన్నది. లోపల వెలుతురు కూడా ఉన్నది. అయితే అద్దాలన్నీ పెద్ద పెద్దగా ఉన్నాయి. ఒక వైపు ఉండే గది గోడ అంతా ఒకే ఒక పెద్ద అద్దంతో నిర్మించబడి ఉన్నది. అలాగే మిగిలిన గోడలు, క్రింద ఉండే నేల మరియు పైన ఉండే కప్పు అన్నీ ఒకే ఒక పెద్ద అద్దంతో నిర్మించ బడ్డాయి. మొత్తం గదిలో ఆరు పెద్ద అద్దాలు ఉన్నాయి.

ఇప్పుడు మీరు ఎటు తిరిగి చూసినా మొదటి గదిలో కనిపించినట్లే మీ శరీరం యొక్క ప్రతిబింబం కనిపిస్తుంది. అయితే కేవలం ఒకే ఒక శరీరం దర్శనం ఇస్తుంది. మీరు మొదటి గదిలో అనుభూతి చెందినట్లు విడి విడిగా ఉండే అనేక శరీరాలు దర్శనం కావు. ఇప్పుడు ఆ గదిలో మీరు ఒక్కరే ఉన్నట్లు ఎటు వైపుకు తిరిగి చూసినా దర్శనం అవుతుంది. ఇప్పుడు మీరు "నేను అనేకం అవుగాక" అని సంకల్పం చేసి మరలా మొదటి గదిలోకి వెళ్ళండి. మరలా ఎప్పటిలాగే మీకు ఎటు వైపుకు తిరిగి చూసినా అనేక దృశ్యాలు

కనిపించడం జరుగుతుంది.

ఇప్పుడు పైన వివరించిన దృశ్యాన్ని ఇంకా సునిశతంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేద్దాము. మీకు బహుశా ఎటు వైపుకు చూస్తున్నారో కూడా అర్థం కాకపోవచ్చును. అంటే మీకు తూర్పు, పడమర, ఉత్తరం మరియు దక్షిణ దిశల జ్ఞానం లుప్తమై పోతుంది. మీరు ఏ వైపుకు చూస్తున్నారో తెలియదు. అంటే మీరు ఏ వైపుకి ఏ పేరు పెడితే దానికి ఆ పేరే ఉంటుంది. మీరు ఏ వైపుకి ముఖం పెట్టి చూస్తున్నారో అది తూర్పు దిశ అనుకుంటే మీకు సంబంధించినంత వరకు అదే తూర్పు దిశ అవుతుంది. అయితే అద్దాల గది బయట ఉన్న మిగిలిన వాళ్ళకు ఆ దిశ మరొకటి అయి ఉండవచ్చును. మీకు సంబంధించినంత వరకు అష్ట దిక్కులూ మీరే స్వయంగా అవుతారు. అసలు దిక్కు అనే భావన కేవలం ఒక భావనగా మాత్రమే మిగిలిపోతుంది.

ఇప్పుడు ఈ తర్కాన్ని ఇంకా పొడిగించి చూద్దాం! అకస్మాత్తుగా అద్దాల గదిలో ఉన్న వెలుతురు మాయం అయిపోయింది అనుకోండి! ఇప్పుడు అద్దాల గది అంతా అంధకారంతో నిండి పోతుంది. మీకు ఆ అంధకారంలో మీరు ఉన్నారని తప్పితే ఇంకేమీ ప్రతిబింబింప బడదు. అంటే మీరు కళ్ళు మూసుకున్నా లేదా తెరిచి చూసినా అసలు తేడా ఏమీ ఉండదు. అయితే బయట నుండి శబ్దాలు మాత్రం వినిపిస్తాయి. అద్దాల గది బయట నుండి ఎవరైనా అరిస్తే మీకు వినిపించ వచ్చును. ఒకవేళ ఆ అద్దాల మందం బాగా ఎక్కువై ఉంటే ఇప్పుడు ఆ శబ్దాలు కూడా వినిపించవు. అంతా నిశ్శబ్దం! మరియు అంధకారం!

ఇప్పుడు తర్కాన్ని ఇంకా పొడిగిద్దాము. అంధకారంతో నిండి ఉన్న ఆ నిశ్శబ్దమైన గదిలోకి ఏ మూల నుండి అయినా ఏదొక వాసన వచ్చే పరిమళముతో కలిసిన గాలిని వదలండి. ఆ వాసన యొక్క జ్ఞానం మీకు వెంటనే కలుగుతుంది. మరలా తిరిగి ఏదొక పరికరం ద్వారా ఆ గదిలో ఉన్న గాలిని బయటికి వెళ్లగొట్టి మామూలుగా ఏ వాసనా లేని వాయువుని వదలండి. కొంచెం సమయం గడిచాక మీకు ఆ గదిలో ఏ వాసనా

అనుభవానికి రాదు.

ఈ తర్కాన్ని ఇంకా పొడిగించి చూద్దాము. మీరు మీ జేబులో ఏదైనా తియ్యగా ఉండే పదార్థాన్ని పెట్టుకొని ఉన్నారని  భావించండి. ఇప్పుడు ఆ పదార్థాన్ని బయటికి తీసి తినండి. మీకు వెంటనే ఆ రుచి యొక్క జ్ఞానం అనుభవానికి వస్తుంది. అయితే ఇదంతా చీకటితో నిండి ఉన్న గదిలో జరుగుతున్న ప్రయోగం అనే విషయం గుర్తుంచుకోండి. ఇప్పుడు ఆ పదార్థం తినడం అయిపోయింది. జేబులో తినడానికి ఇంక ఏమీ లేదు. కొంచెం సమయం తరువాత మీకు నోటిలో ఇక ఏ రుచి యొక్క జ్ఞానం లేకుండా పోతుంది.

ఈ తర్కాన్ని ఇంకా కొంచెం పొడిగించి చూద్దాము. ఇప్పుడు జేబులో నుండి ఏదైనా మందు తీసి శరీరానికి వేస్తే బహుశా మీకు స్పర్శ యొక్క జ్ఞానం కూడా లేకుండా పోవచ్చును. అయితే ఈ విషయాన్ని ఇంతటితో ఆపేద్దాము. మందు ఏ రూపంలో శరీరానికి వెయ్యాలి అనే విషయం చర్చించ వలసిన అవసరం లేదు. పైన వ్రాసిన సుదీర్ఘమైన ఉదాహరణ కేవలం ఒక విషయాన్ని మీకు బాగా అర్ధమయ్యేలా చేయడానికి మాత్రమే వ్రాయబడినది.

మన శరీరంలో నివసించే ఆత్మ స్వయంగా పరబ్రహ్మం లేదా భగవంతుడు. అద్దాల గదిలో తనకై తాను "నేను అనేకం అవుగాక" అని సంకల్పించినపుడు తానే అనేక శరీరాలుగా మారి కనిపించడం జరుగుతుంది. అయితే ఇక్కడ పాఠకులు ఒక ప్రశ్న వేయవచ్చును. మనకు అద్దాల గదిలో అనుభవానికి వచ్చేది కేవలం మన శరీరం మాత్రమే కదా! అని. అంటే అన్ని శరీరాలు రూపంలో ఉన్నాయి కదా! అని. భగవంతుడు సంకల్పించినపుడు అనేక రూపాలలో ఉండే మానవులుగా మారతాడు కదా! అని ప్రశ్నించవచ్చును. ఇక్కడ భగవంతునికి  మరియు మానవునికి ఉండే తేడా వలన ఇలా జరుగుతుంది. భగవంతుని ద్వైత భావన వేరొకటి మరియు మానవునికి ఉండే ద్వైత భావన మరొకటి. మానవుడు తన యొక్క శరీరం వేరని మరియు అది కేవలం తనదని భావిస్తాడు. తన 'అహం' కారణం చేత ఈ విధంగా స్ఫూరణ ఉంటుంది. తను వేరు మరియు మిగిలిన మానవులు వేరని

భావించడం వలన ఇలా జరుగుతుంది. అందువలన మానవునికి అద్దాల గదిలో ఎటు చూసినా కేవలం తన శరీరం మాత్రమే కనిపిస్తుంది. అంటే అద్దంలో ప్రతిబింబించే అన్ని శరీరాలు మాదిరిగా ఉంటాయి. అయితే ఏదైనా ఒక బ్రహ్మాండానికి నాథుడు అయిన "బ్రహ్మ" కూడా ఇలాగే భావించడం జరుగుతుంది. అందువలన తనని తాను 'బ్రహ్మ' అని భ్రమ పడుట జరుగుతుంది. ఇప్పుడు అదే బ్రహ్మ తనకి తాను "నేను అనేకం అవుగాక" అని సంకల్పించినపుడు తన రూపాన్నే అనేక రూపాలుగా చూడుట జరుగుతుంది. అంటే అనేక మానవ రూపాలుగా తనను తాను చూడుట జరుగుతుంది.

ఇక్కడ పాఠకులు అర్ధం చేసుకోవలసిన విషయం ఏమిటంటే సృష్టి కర్త అయిన "బ్రహ్మ" కు ఉండే ద్వైత భావన "బ్రహ్మాండం" స్థాయిలో ఉంటుంది. మానవునికి వ్యక్తిగత స్థాయిలో ఉండే ద్వైత భావన కేవలం "పిండాండం" లేదా "మానవ శరీరం" స్థాయిలో ఉంటుంది. దీని అర్ధం ఏమంటే మానవునికి తాను కేవలం తన శరీరం మాత్రమే అని మరియు ప్రపంచంలో నివసించే మిగిలిన మానవులు వేరని ద్వైత భావన ఉంటుంది. ఇదే మాదిరిగా మానవుల సృష్టి కర్త అయిన "బ్రహ్మ" కు తన శరీరం లేదా "బ్రహ్మాండం" వేరని మరియు విశ్వంలో ఉన్న మిగిలిన "బ్రహ్మాండాలు" వేరని భావన ఉంటుంది. మానవుడు "పిండాండం" అయిన తన శరీరంలో అనేక రకములైన భాగాలు (చేతులు, కాళ్ళు మొదలైనవి) ఉన్నవని ఎలా భ్రమ పడుతాడో అదే మాదిరిగా "బ్రహ్మ" లేదా "బ్రహ్మాండం" లేదా సృష్టి కర్త అదే విధంగా బ్రహ్మాండంలో నివసించే అనేక మానవులని "తానే అనేకం" అని భ్రమ పడుట జరుగుతుంది.

ఇదే తర్కాన్ని "జగత్తు" కి అన్వయం చేసినపుడు అనేక బ్రహ్మాండాలతో ఉన్న "జగత్తు" ని తన శరీరంగా భావించి భగవంతుడు తనని "జగన్నాథుడు" అని భ్రమ పడుట జరుగుతుంది.

అయితే ఇక్కడ పాఠకులు ఒక విషయాన్ని గుర్తుంచుకోమని విజ్ఞప్తి చేస్తున్నాను. నేను ఉదాహరణకు పైన వివరించినది కేవలం ఒక అద్దాల గది మాత్రమే! అది కూడా కేవలం పాఠకులకు విషయాన్ని వివరించుటకు మాత్రమే! ఏదొక దానిని ఉదాహరణకు తీసుకోవాలి కాబట్టి "అద్దాల గది" ని

ఎంచుకోవడం జరిగింది. కాని "బ్రహ్మాండం" మరియు "జగత్తు" స్థాయిలలో విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినపుడు అది ఎంత చిక్కుగా ఉంటుందో ఆలోచించండి! అన్నింటికన్నా ముందు ఈ పుస్తకాన్ని వ్రాసిన నేను కూడా ఈ మయా పూరితమైన సృష్టిలో "నేను మానవుణ్ణి" అనే భ్రమలో ఉండి వ్రాసినది. కనుక 'సృష్టి కర్త' అయిన "బ్రహ్మ" మరియు 'జగత్తు' కి నాథుడు అయిన "జగన్నాథుడు" ఏ విధంగా భ్రమ పడుతున్నారనే విషయం సంపూర్ణంగా లేదా పూర్తి అవగాహనతో వ్రాయడం ఎలా సాధ్యం అవుతుంది?

ఇది కేవలం 'పుస్తకం' మాత్రమే! నాకు స్ఫూరణకు వచ్చినది ఏదో వ్రాయడం జరిగింది. కనుక పైన వివరించిన 'అద్దాల గది' యొక్క ఉదాహరణని 'బ్రహ్మాండం' తో మరియు అనేక బ్రహ్మాండాలతో నిండి ఉన్న "జగత్తు" తో యధావిధిగా పోల్చి వివరించడం అనేది నాకు సాధ్యం కాని విషయం. పాఠకులు ఈ విషయాన్ని గుర్తుంచుకొని పైన వివరించిన తర్కంలో మీకు కనిపించే లోపాలని నా అసమర్ధతగా భావించి క్షమించగలరని ఆశిస్తున్నాను. ఒక వేళ పైన వివరించిన ఉదాహరణ వలన పాఠకులు ఏ మాత్రం ప్రేరితమయినా అది కేవలం మీ మేధస్సు యొక్క సామర్థ్యం మాత్రమే అని వినమ్రతగా విజ్ఞప్తి చేస్తున్నాను.

# సమయము – దూరము యొక్క భ్రాంతి

అన్నింటికన్నా ముందుగా ఒక విషయాన్ని పాఠకులందరికీ గుర్తుచేసి, ఆ తరువాత అసలు విషయాన్ని గురించి విశ్లేషణ చేస్తాను. సమయము, దూరము మరియు బరువు అనే వాటిని కొలవడానికి విశ్వవ్యాప్తమైన ప్రామాణికత అంటూ ఏమీలేదు. ఉదాహరణకు "సమయం" విషయం గురించి ఆధునికకాలంలో పశ్చిమదేశాల సాంప్రదాయం ప్రకారం విశ్లేషణ చేద్దాము ! భూగ్రహం తనచుట్టూ తాను ఒకసారి తిరిగినచో దానిని ఒకరోజు అంటారు. అంటే ఒక పగలు మరియు ఒక రాత్రి ! దానిని సాధారణంగా 24 భాగాలు చేసి ఒక్కో భాగాన్ని "గంట" అని పిలవడం జరిగింది. అలాగే ఒక గంట సమయాన్ని 60 భాగాలు చేసి, ఒక్కో భాగాన్ని "నిమిషము" అని పిలుస్తున్నారు. ఒక నిమిషాన్ని ఇంకా 60 భాగాలు చేసి ఒక్కో భాగాన్ని "క్షణము" అని పిలుస్తున్నారు.

భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తన కక్ష్యలో తిరిగివస్తే దానిని ఒక సంవత్సరకాలం అంటున్నాము. ఒక సంవత్సరాన్ని 12 భాగాలు చేసి ఒక్కోభాగాన్ని "నెల" అని పిలుస్తున్నారు. అదే విధంగా ఒక నెల సమయాన్ని 30 భాగాలు చేసి ఒక్కోదాన్ని ఒకరోజు అంటున్నారు ! అంటే ఈ విధంగా లెక్కించినచో సంవత్సరానికి 360 రోజులు ఉండవలెను. అయితే

పాఠకులందరికీ బాగా పరిచయమైనది 365 రోజుల సంవత్సరం ! ఈ విషయాన్ని గురించి తరువాత విశ్లేషణ చేస్తాను. ముందుగా పైన వివరించిన 360 రోజుల తర్కాన్ని గురించి విశ్లేషణ చెయ్యనివ్వండి !

భూమి సూర్యుని చుట్టూ తిరిగిరావడానికి పట్టే సమయాన్ని ఒక సంవత్సరం అని పిలిచినప్పుడు అసలు సమస్య ఏమీలేదు ! దానిని 12 భాగాలుగా అంటే నెలలుగా విభజించినపుడు కూడా సమస్య ఏమీలేదు ! అలాగే ఒక్కో "నెల"ని 30 భాగాలు అంటే రోజులుగా విభజించినపుడు కూడా సమస్య లేదు. ఇంతవరకూ అంతా బాగానే ఉన్నది. ఇదేవిధంగా ఒకరోజుని 24 గంటలుగా, ఒక గంట సమయాన్ని 60 నిమిషములుగా మరియు ఒక నిమిషాన్ని ఒక క్షణముగా విభజన చేయడం కూడా సరిగ్గానే ఉన్నది.

అయితే "క్షణము" అనే సమయాన్ని ఎలా కొలవాలి ? దీనికోసం "గడియారం" అనే యంత్రాన్ని తయారుచేయడం జరిగింది. దీనిలోని ఒక ముల్లు ఒకసారి తిరిగితే దానిని ఒక నిమిషము అని, అలాగే మరొక ముల్లు ఒకసారి తిరిగితే 12 గంటలు అని పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

అయితే ఈ విధముగా ఒక సంవత్సరాన్ని ఈ గడియారంలో కొలవడం లేదు ! ఎందుకంటె 360 రోజులలో భూమి సూర్యుని చుట్టూ సంపూర్ణంగా తిరిగి రావడం లేదు. దీనికి కారణం సూర్యుని చుట్టూ భూమి తిరిగే కక్ష్య సంపూర్ణమైన వృత్తాకారంలో లేదని వాదిస్తున్నారు. అందువలన ఒకసారి సూర్యుని చుట్టూ తిరిగి రావడానికి 365 రోజులకన్నా కొంచెం ఎక్కువ సమయం పడుతుంది అంటున్నారు. దీనితో సౌరమానం ప్రకారం సమయాన్ని లెక్కించే పద్ధతి అంతా గందరగోళంగా మారింది. అంతేగాక ఈ గందరగోళ పరిస్థితిని నియంత్రణలోకి తీసుకురావడం కోసం ప్రతి నాలుగు సంవత్సరాలకు వచ్చే సంవత్సరానికి 366 రోజులు అంటగట్టారు. ఆంగ్లభాషలో దీనిని "లీపు" సంవత్సరం అంటారు. అంటే ఫిబ్రవరి నెలకి 28 రోజులు కాకుండా "లీపు" సంవత్సరంలో 29 రోజులు అంటగట్టారు. అంతేగాక కొన్ని నెలలకి 30 రోజులు మరియు కొన్ని నెలలకు 31 రోజులు అంటగట్టారు. ఉదాహరణకు జూన్ నెలలో 30 రోజులు ఉంటే, జులై నెలలో

31 రోజులు ఉంటాయి. మొత్తానికి ఏదీ ఒక క్రమపద్ధతిలో ఉన్నట్లు కనిపించదు. ఈ పద్ధతిని క్రైస్తవయుగం మొదలైన దగ్గరనుండి అమలులోకి తేవడం జరిగింది. క్రైస్తవయుగానికి ముందు జరిగిన చారిత్రక వివరాలు చెప్పవలసివస్తే సౌరమానం ప్రకారం శ్రమతో లెక్కలు వేసి చెప్పవలసి వస్తుంది.

అసలు "క్షణం" అనే సమయాన్ని సరిగ్గా కొలవడం జరిగితే సరిపోతుంది కదా! అని పాఠకులు ప్రశ్నించవచ్చును. అంటే సరిగ్గా సంవత్సరానికి 360 రోజులు వచ్చే విధంగా గడియారంలో ముల్లుని సరిచేస్తే సరిపోతుంది కదా ! కానీ ఇది కూడా సమస్యని పరిష్కరించలేదు. ఆలా చేస్తే ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న గడియారాలన్నింటినీ మార్చవలసి వస్తుంది. అంతేగాక భూమి సూర్యుని చుట్టూ తిరిగివచ్చే వేగం ఎప్పుడూ ఒకేవిధంగా ఉండదని ఆధునిక విజ్ఞానశాస్త్రం చెబుతున్నది.

అసలు "క్షణము" అనే సమయానికి విశ్వవ్యాప్తంగా ఏదైనా ప్రామాణికం ఉన్నదా? అంటే మానవులే గాక ఈ సువిశాల విశ్వంలో ఇంకా ఎవరైనా నివసిస్తుంటే అందరికీ "క్షణం" అనేది ఒకే విధంగా ఉంటుందా? ఇది ఎంత అర్థరహితమైన మరియు తర్కరహితమైన ఆలోచన అనేది పాఠకులకు స్పష్టంగా అర్థమై ఉంటుంది అనుకుంటాను.

అసలు భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి పట్టే సమయాన్ని "సంవత్సరం" అనవలెనని ఎవరు ఏ ప్రామాణికత ఆధారంగా చెబుతున్నారు? మరొక ఖగోళప్రక్రియను, సమయాన్ని కొలవడానికి ఎందుకు ఎంచుకొనుట లేదు. ఉదాహరణకు చాంద్రమానం ప్రకారం చంద్రుడు భూమి చుట్టూ ఒకసారి తిరిగితే ఆ కాలాన్ని 25 రోజులు అంటారు. అలాగే 15 రోజులకు ఒకసారి చంద్రుడు సంపూర్ణంగా కనిపించుట (పౌర్ణమి) లేదా అసలు కనిపించకపోవుట (అమావాస్య) జరుగుతుంది. మానవులందరికీ కళ్ళకు కనిపిస్తున్న ఈ ఖగోళప్రక్రియను ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు?

అంటే చాంద్రమాన ప్రకారం చంద్రునికళలను (ప్రతిరోజు కనిపించే చంద్రుని పరిమాణాన్ని) ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ విధంగా చేస్తే అసలు సమస్య అంతా సంపూర్ణంగా పరిష్కారం అవుతుంది

కదా ! అంటే ప్రతి 14 రోజుల తరువాత 15వ రోజు పౌర్ణమి మరియు 30 వ రోజు అమావాస్య వస్తుంది ! 30 రోజులను ఒక నెలగా మరియు 12 నెలలను ఒక సంవత్సరంగా పరిగణనలోకి తీసుకుంటే సరిపోతుంది కదా! ప్రతిరోజు కనిపించే చంద్రుని పరిమాణం ఒక ప్రామాణికం ! కనీసం సమయాన్ని తెలుసుకోవడంలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉంటుంది. అంతే కాకుండా దీనివలన మరొక ఉపయోగం కూడా ఉంటుంది. ఈ విశ్వంలో జరిగే అన్ని ఖగోళప్రక్రియలకు సరైన సామాన్య సమయాన్ని నిర్ధారించవచ్చును. అంటే ఈ విశ్వంలో సుదూరంగా ఏదైనా గ్రహం మీద మరెవరైనా నివసిస్తుంటే, వాళ్లకు కూడా మన భూలోకంలోని సమయం లెక్కించే విధానం సులభంగా అర్ధమవుతుంది మరియు మన సమయంతో వారి లోకంలోని సమయాన్ని పోల్చి చూసుకోవడానికి సరిపోతుంది కదా !

అదేవిధంగా ఒక "క్షణం" సమయాన్ని కొలవడానికి కృత్రిమంగా మానవులు నిర్మించిన గడియారం అనే యంత్రంతో కాకుండా ఏదైనా సామాన్యంగా జరిగే శారీరకప్రక్రియతో చేస్తే సరిపోతుంది. కనీసం సమయం అనే పదానికి ఏదైనా ఒక అర్ధం ఉంటుంది. అంటే "సమయం" అనేదాన్ని ఏదో ఒక కదిలే ప్రక్రియతో సరిగ్గా పోల్చవచ్చును. అంటే జగత్తులో ఏదైనా కదలిక అనేది శక్తితో సమానం అన్నమాట. ఈ విషయాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా ఒప్పుకుంటుంది. అలాగే ప్రాచీన సంస్కృతశాస్త్రాలు కూడా ఒప్పుకుంటున్నాయి. ఉదాహరణకు మానవశరీరంలో సామాన్యంగా నిరంతరం జరిగే ఏదైనా ఒక కదలికను తీసుకుందాము. కనురెప్పలు కదిలే ప్రక్రియ (కనురెప్పలు మూసుకుని తెరిచే ప్రక్రియ) ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకారం సెకండులో మూడవవంతు కాలంలో జరుగుతుంది అంటారు. అంటే ఒకసారి కనురెప్పలు మూతబడి మరలా తిరిగి తెరవడానికి పట్టే సమయాన్ని మూడింతలు గుణిస్తే దాదాపు ఒక క్షణం సమయంతో సమానమని అర్ధం!

అయితే సమయాన్ని ఈ విధంగా కొలవడం మొదలుపెడితే నేటి ఆధునికకాలంలో జగత్తులో జరిగే వ్యవహారాలన్నింటికీ స్వస్తి పలకవలసివస్తుంది. కానీ ఎన్నో వేల సంవత్సరాల నుండి గడియారములు

లేకుండానే మానవనాగరికతలు ఈ భూమండలం మీద మనుగడ సాగించడం కూడా జరిగిందన్న విషయాన్ని విస్మరించరాదు. సామాజికస్థితులకు అనుగుణంగా జగత్తులో మానవజాతి తమకు అవసరమైన రీతిలో ఏదొక విధంగా సమయాన్ని కొలవడం మరియు ఏ సమస్యా లేకుండా జీవనం సాగించడం జరిగినదని చారిత్రిక గ్రంథాలు చెబుతున్నాయి. కనుక, గడియారమనే ఆధునిక యంత్రానికి ఎటువంటి ప్రామాణికత లేదు ! యంత్రాన్ని ఏ విధంగానైనా తయారు చేసుకొనవచ్చును. అంటే సమయాన్ని మనకు ఇష్టమైన మరియు అనుకూలమైన రీతిలో కొలవడం చేసుకొనవచ్చును.

అలాగే "దూరము" కొలవడానికి కూడా ఎటువంటి ప్రామాణికత లేదు. ఉదాహరణకు ఒక కిలోమీటరు దూరాన్ని వెయ్యి మీటర్లు అంటున్నారు. అయితే ఒక మీటరు దూరాన్ని ఎలా కొలవాలి? దీనికి భగవంతుడే స్వయంగా ఏమైనా ప్రామాణికతను నిర్ధారించడం జరిగిందా? నేటి ఆధునికకాలంలో ఒక మీటరు పొడవు వుండే స్కేలు ఆధారంగా కొలతలను అన్నింటినీ లెక్కవేస్తున్నారు. అయితే ఆ మీటరు స్కేలు పొడవు అంతే వుండాలని ఏ ప్రామాణికతతో చెబుతున్నారు? అంటే ఇక్కడ ఏదొక మార్గాన్ని తీసుకొని దానికి ఆంగ్లభాషలో మీటరు అని పేరు పెట్టడం జరిగింది. ఇక జగత్తులోని దేశాలలో ఎక్కువగా అటువంటి పొడుగు వుండే స్కేళ్లను తయారు చేసుకుని వాడుతున్నారు. ఇదేవిధంగా ఒక మీటరు దూరాన్ని వంద సెంటీమీటర్లని లేదా వెయ్యి మిల్లీమీటర్లని భాగించడం జరిగింది. దీనికి కూడా ఎటువంటి ప్రామాణికత లేదు ! అంటే ఒక మీటరు దూరాన్ని కేవలం వందభాగాలుగా చేసి ఒక్కొభాగాన్ని సెంటీమీటరు అని పిలవాలని నియమం ఎక్కడా లేదు. ఇది ప్రకృతిసహజమైన ప్రక్రియ ఏమీకాదు. ఆధునిక విజ్ఞానశాస్త్రం పేరుతో తయారు చేయబడిన గందరగోళం మాత్రమే ! వేల సంవత్సరాల నుండి మానవ నాగరికతలు ఎలా జీవనాన్ని శాసించాయి? ప్రాచీనకాలంలో కూడా కొలతలు ఉండేవి కదా ! కనుక మారుతున్న సామాజికస్థితులకు అనుగుణంగా దూరాన్ని కొలిచే ప్రక్రియ కూడా నిరంతరం మారుతూ

వచ్చింది.

అయితే ఏదైనా ప్రకృతి సహజమైన పద్ధతిని తీసుకుని ఉంటే ఈ సమస్య బహుశా ఇలా ఉండేది కాదు ! ఉదాహరణకు మానవశరీరంలో ఉండే ఏదైనా అంగంతో దూరాన్ని కొలవడానికి ప్రయత్నించి చూద్దాము ! అయితే ఇక్కడ ఒక సమస్య ఉంది మానవులందరి శరీరాలు ఒకే పరిమాణంలో ఉండవు కనుక శరీర అంగాలు కూడా ఒకే పరిమాణంలో ఉండవు. దీనివల్ల ఏదైనా దూరాన్ని తన అంగంతో ఒక వ్యక్తి కొలవడం జరిగితే ఆ కొలవబడిన దూరం మరొక వ్యక్తికి వర్తించదు. ఎందుకంటే ఇద్దరి అంగాలు ఒకే పరిమాణంలో ఉండకపోవచ్చును కాబట్టి ! ఉదాహరణకు ఎవరైనా వ్యక్తి, తన చేతివ్రేళ్ళతో దూరాన్ని కొలుచుట !

అయితే ఇక్కడ పాఠకులందరినీ ఒక విషయాన్ని గమనించవలెనని విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రతి మానవునికి దూరము అనే భ్రాంతి తన యొక్క మస్తిష్కం మీద ధారణ చేయబడుతుంది. ఉదాహరణకు ఒక పొట్టిగా వున్న వ్యక్తి వంద మీటర్ల దూరాన్ని నడవడం కోసం ఎక్కువ అడుగులు వేయవలసి ఉంటుంది. కానీ పొడవుగా వుండే వ్యక్తి తక్కువ అడుగులతోనే ఆ దూరాన్ని దాటడం జరుగుతుంది. అంటే పొడవుగా వుండే వ్యక్తికి అదే దూరాన్ని దాటడం సునాయాసంగా ఉంటుంది.

అంటే "దూరము" అనే భావన మస్తిష్కం మీద ధారణ చేయబడినప్పుడు పొట్టిగా వుండే వ్యక్తికి పొడవుగా వుండే వ్యక్తికి తేడా ఉంటుంది. అంగం యొక్క పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది.

అయితే ఇద్దరిలో ఎవరు వేగంగా నడవగలరు అనే విషయాన్ని గురించి నేను ఇక్కడ చర్చించడం లేదు. కేవలం మస్తిష్కం మీద పడే భ్రాంతిని గురించి మాత్రమే విశ్లేషణ చేస్తున్నాను.

ఇక్కడ పాఠకులందరికీ మరొక విషయాన్ని మరలా గుర్తుచేయదలచుకున్నాను !

ప్రతివ్యక్తికి వ్యక్తిగతస్థాయిలో ఐదు జ్ఞానేంద్రియములు మరియు ఐదు

కర్మేంద్రియముల మాధ్యమంగా జగత్తు అనుభవానికి వస్తుంది. కనుక ఒక వ్యక్తికి తన యొక్క ఇంద్రియముల మాధ్యమంగా అనుభవానికి వచ్చే తన యొక్క వ్యక్తిగత జగత్తు మరొక వ్యక్తికి అతని ఇంద్రియముల మాధ్యమంగా అనుభవానికి వచ్చే అతని వ్యక్తిగత జగత్తు వేరువేరుగా ఉంటుంది.

కనుక "సమయము మరియు దూరము" అనే భావన ప్రతివ్యక్తికి వేరువేరుగా ధారణ చేయబడుతుంది. అయితే మానవుల శరీరానిర్మాణంలో ఎక్కువగా తేడా ఉండదు కాబట్టి ఈ విషయాన్ని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోవడం జరుగదు.

కానీ ఆధునిక విజ్ఞానశాస్త్రం మాత్రం సమయాన్ని మరియు దూరాన్ని కొలవడానికి బాహ్యంగా ఉండే పరికరాలని ఉపయోగిస్తుంది. దీనివలన మానవులకు ధారణ చేయబడే భ్రమపూరితమైన జగత్తు ఇంకా మరింతగా భ్రమపూరితమై ధారణ చేయబడుతుంది. అంటే సినిమాలో మరొక సినిమా చూసినట్లు అవుతుంది. దీనివలన జగత్తు భ్రమపూరితమైనదనే విషయం నుండి బయటపడుట ఇంకా కష్టంగా ఉంటుంది.

## అసంపూర్ణ ప్రపంచం

మనం నిత్యం అనుభూతి చెందే జగత్తు కేవలం భ్రమపూరితమైనది మరియు చిట్టచివరికి మనకు కేవలం దుఃఖాన్ని మాత్రమే మిగులుస్తుంది. అంటే ఆఖరిలో మన దుఃఖానికి కారణం అవుతుందన్నమాట! అయితే మొదట్లో చాలా అందంగా కనిపిస్తుంది ఎందుకంటే మానవుణ్ణి జగత్తు అనే వలలో ఇరికించాలి కాబట్టి. ఒకసారి మానవుడు సాంసారిక జగత్తులో ఇరుక్కుపోయిన తరువాత అపుడు అసలు విషయం అవగతమవుతుంది. జగత్తు దుఃఖానికి కారణం అనే సత్యం గోచరమవుతుంది. ఇది తప్పనిసరిగా అనుభవమయ్యే ఒక చేదు నిజం. ఈ చేదు అనుభవాన్ని తప్పించు కొనుటకు ప్రతిమానవుడు ఎన్నో ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. కాని తప్పించుకొనుట మాత్రం అసాధ్యం అవుతుంది. కావాలంటే ఎవరైనా ప్రపంచం నలుమూలలకి వెళ్లి తన తలను ఎక్కడైనా మోదించి చూడండి. అంటే అనివార్యమైన చేదు అనుభవాలను తప్పించుకొనుటకు ఎక్కడికైనా సరే వెళ్ళడానికి ప్రయత్నించి చూడవచ్చు.

అయితే చివరిలో ఓటమిని ఒప్పుకోవలసి వస్తుంది మరియు గతిలేక తప్పనిసరిగా ఎదురయ్యే చేదు అనుభవాలను రుచి చూడవలసి ఉంటుంది. ఇది ఇలా కాకుండా ఉంటే బాగుండేదని నాఆకాంక్ష. జగత్తు యొక్క చేదు అనుభవాలు మరీ ఎక్కువగా విషపూరితం కాకుండా ఉంటే బాగుండేది కదా!

భగవంతుడు మానవుని మీద మరికొంచెం ఎక్కువ దయ చూపకూడదా అని నాఆవేదన! దురదృష్టవశాత్తు కొన్ని సందర్భాల్లో భగవంతునియొక్క దయ చాలా చేదుగా అనుభూతికివస్తుంది. మరికొన్ని సందర్భాల్లో అతి క్రూరంగా కూడా అనుభవానికి వస్తుంది. ఈవిషయం గురించి నేను నా మొదటి పుస్తకం "పరాశక్తి" లో క్లుప్తంగా వివరించడం జరిగింది.

అయితే ఈ సమస్యకి పరిష్కారంఏమిటి?

ఈ భ్రమపూరితమైన జగత్తు నుండి తప్పించుకొని పారిపోతూ ఉండుట ఒక్కటే దీనికి సరైన పరిష్కారం. అని వార్యమైన చింతకు చిక్కవద్దు!

ఒక చేప పిల్ల నీటిలో మనచేతికి దొరకకుండా ఎలాజారిపోతూ ఉంటుందో అలాగే చింతకు కారణమైన ఈ భ్రమపూరితమైన జగత్తు యొక్క ఉచ్చులో పట్టుబడకుండా జారిపోండి!

ఈ మాయా జగత్తు తన నైపుణ్యం అంతా ఉపయోగించి ఎవరినైనా తన భ్రమలో ఇరికించాల నినిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. ఇది నిజానికి అతి నైపుణ్యంగల ప్రతిభాశాలి. ఎందుకంటే ఇది స్వయానా భగవంతుని యొక్క శక్తి కాబట్టి! దీని భ్రమ నుండి బయటపడాలనే మనంభగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాము.

ఇక్కడ పాఠకులు రెండు ప్రశ్నలు వేయవచ్చును.

ఇది స్వయానా దయామయుడయిన భగవంతుని యొక్క శక్తి కాబట్టి, ఆయన శక్తి నుండి మనం తప్పించు కొనవల్సిన అవసరం ఏమిటి? అని ప్రశ్నించవచ్చును. అంతేగాకుండా సర్వశక్తివంతమైన భగవంతుని శక్తి నుండి తప్పించుకొనుట అసలు ఎలా సాధ్యం? అని ప్రశ్నించవచ్చును.

నేను ముందుగా రెండవ ప్రశ్నకు సమాధానంచెప్పి ఆతరువాత మొదటి ప్రశ్న దగ్గరికి వస్తాను.

ఈక్రింద వ్రాస్తున్నది కేవలం వినమ్రతతో చేస్తున్న నావిశ్లేషణ!

పరబ్రహ్మం తప్పకుండా దయామయుడు అనుటలో ఎలాంటి సందేహము లేదు. ఈకారణం చేతనే ఒక సాధకుడు సర్వ శక్తివంతమైన అయన మాయ నుండి లేదా భ్రమపూరితమైన జగత్తు నుండి తప్పించు కొనుటకు సాధ్యం

అవుతుంది. లేనిచో ఇది అసలు సాధ్యం కాదు కదా!

అంటే భగవంతుడే స్వయంగా దయ చూపించి ఒక సాధకునికి తన క్రూరమైన భ్రమనుండి బయటపడే మార్గాన్ని కూడా చూపించడం జరుగుతుంది. లేనిచో సర్వశక్తివంతమైన పరబ్రహ్మం నుండి ఎవరైనా ఎలా తప్పించుకొనగలరు? అందుకే పరబ్రహ్మాన్ని దయామయుడు అంటారు. మనం ఆ పరబ్రహ్మాన్ని దయ చూపించమని వేడుకొనినపుడే ఆయన తన కృపావర్షాన్నికురిపించడం జరుగుతుంది. అయితే ఇక్కడ ఒక చిన్న మెలిక ఉన్నది. మనం భగవంతుణ్ణి ప్రార్థించి రక్షించమని కోరుకొన్నపుడు ఆయన ఏవిధముగా రక్షిస్తాడనేది ఆయనకే వదిలెయ్యాలి. అంతేగాని నన్ను ఫలానా విధముగా రక్షించమని షరతు పెట్టడంలో అర్థం లేదు. అంటే ఇక్కడ మాయను మరలా తిరిగి మాయయొక్క పరిధిలో జయించాలని ప్రయత్నిస్తున్నట్లు లెక్కకు వస్తుంది.

ఈ విషయాలన్నీ భ్రమపూరితమైన జగత్తు యొక్క మాయా తర్కంతో ఆలోచించినా అర్థం లేని విషయంగా గోచరిస్తుంది. అంటే ఒకవైపు మాయ సాధకుణ్ణి ప్రాపంచిక విషయాలలో ఇరికించి బాధిస్తుంటే ఆ విషయాల నుండి శాశ్వతంగా రక్షించమని గాకుండా ఆ విషయాలలో విజయం పొందాలని కోరుకున్నట్లు ఉంటుంది. అసలే అది మాయ. మాయ నుండి మాయ ఎవరినైనా ఎలా రక్షిస్తుంది? అసలు మాయ యొక్క నీడ మనమీద పడకుండా ఉండాలి. ఒకసారి నీడపడితే, ఇక ఆ నీడ నుండి తప్పించమని ఆ నీడని అడిగితే నీడ మాత్రం ఏమి చేయగలదు.

ఇది ఎలా ఉంటుందంటే మనం అప్పులిచ్చేవాడిని మనల్ని ఆర్థిక కష్టం నుండి రక్షించమని అడిగినట్లు ఉంటుంది. మనం ఆర్థిక కష్టంలో ఇరుక్కొని ఉన్నాం కనుక ఆ సమయంలో మరొక అప్పు ఇచ్చేవాడు మనకు దేవతగా కనిపించడం జరుగుతుంది. ఆ తరువాత అసలు విషయం అవగతమవుతుంది. మనంఇంకా అప్పుల ఊబిలో ఇరుక్కొన్నామని!

మనకు ప్రాపంచిక సమస్యలు ఎదురైనపుడు ఆ సమస్యల నుండి రక్షించమని భగవంతుణ్ణి వేడుకుంటాము. అంతేగాని ఏప్రాపంచిక

విషయాలయితే మనకు తలనొప్పిగా మారటం జరిగిందో మరలా తిరిగి వాటి జోలికి పోకూడదనే జ్ఞానం మాత్రం ఉండదు. మరలా తిరిగి ఆ విషయాల మాధ్యమంగానే మనం విరామం పొందాలని ఆశిస్తాము.

ఈ విధంగా జగత్తు విషయాలు మనల్ని నిరంతరం జగత్తువైపు మాత్రమే లాగడం జరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇక వైరాగ్యం అనే భావన ఎలా ఉదయిస్తుంది? వైరాగ్య భావన లేనిచో మనస్సు అంతరం వైపునకు ఎలా మరలుతుంది?

ఉదాహరణకు ఒక పురుషుడు తన జీవితంలో ఎవరైనా ఒక మహిళ వలన మోసపోవడం జరుగుతుందనుకుందాము. ఇక మరలా తిరిగి మహిళల వైపు వెళ్లవద్దని భగవంతుని హెచ్చరిక. అయితే సామాన్యంగా అందరూ చేసేదేమిటంటే మోసగించిన మహిళను వదిలి మరొక మహిళతో సంబంధాన్ని కలుపుకుంటారు. ఆ రెండవ మహిళ కూడా మోసగిస్తే మరలా మూడవ మహిళ కోసం వెదకడం జరుగుతుంది. అదే విధముగా ఎవరైనా ఆర్థిక పరంగా చిక్కుల్లో ఇరుక్కుంటారు అనుకోండి. మరలా తిరిగి ధనం మాధ్యమంగానే ఆ చిక్కుల నుండి బయట పడాలని కోరుకుంటారు. అంతేగాని వైరాగ్య భావన వైపు దృష్టి పెట్టరు.

అందరూ కోరుకుంటున్నట్లు ప్రాపంచిక సమస్యల్లో చిక్కుకున్నప్పుడు భగవంతుణ్ణి ప్రార్థించి ఆ సమస్యల నుండి ముక్తి పొందవచ్చును. కనీసం ఏదొక నాటికి ముక్తి పొందడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో అదే జన్మలో ముక్తి పొందలేకపోవచ్చును. కాని మాధ్యమం మాత్రం అలాగే ఉండాలనుకుంటారు. అయితే ఇది భగవంతుని మాయ అనే విషయం మాత్రం అంత సులభంగా గ్రహించరు.

ఇప్పుడు ఇంతకు ముందు చర్చిస్తున్న మొదటి ప్రశ్న దగ్గరికి వెళదాము. అప్పులిచ్చేవాని మాదిరిగా కాకుండా భగవంతుడు దయామయుడు అనే విషయం కూడా సరైనదే!

అయితే భగవంతుని దయకు అసలు అర్థం ప్రాపంచిక విషయాలను పొందడం కాదు. వాటి ఉచ్చు నుండి శాశ్వతంగా ముక్తి పొందడం అనేది

భగవంతుని యొక్క అసలైన కృప అవుతుంది. కాబట్టి ఆకృప కోసం ప్రార్థించండి. అంటే అప్పులిచ్చి ఆర్థిక కష్టాల నుండి రక్షించే వానిగా కాకుండా శాశ్వతంగా అలాంటి ప్రాపంచిక విషయాల నుండి ముక్తి ప్రసాదించమని వేడుకోండి! మనస్సు ఇలాంటి భావనతో ఉన్నప్పుడే జగత్తు యొక్క భ్రమపూరితమైన ఉచ్చు నుండి తప్పించుకోవడం సాధ్యమవుతుంది.

బహుశా పాఠకులకు నేను పైన వ్రాసిన విషయం క్షుణ్ణంగా అర్థమయింది అనుకుంటాను. రెండు ప్రశ్నలకు సమాధానం దొరికి ఉంటుందని ఆశిస్తున్నాను. భగవంతుని యొక్క భ్రమపూరితమైన మాయ నుండి రక్షించమని భగవంతుణ్ణే కోరుకోండి. భగవంతుడు దయామయుడు కనుక రక్షించడం అనేది జరుగుతుంది. అంతేగాని ఏప్రాపంచిక విషయాలు చేదుగా మారి ఉన్నాయో మరలా తిరిగి వాటి జోలికి వెళ్ళకండి.

ఒక్క మాటలో చెప్పాలంటే మనల్ని వంటరిగా వదిలేయమని మరియు జగత్తు విషయాలలో ఇరికించవద్దని భగవంతుణ్ణి ప్రార్థించండి.

అతి త్వరలోనే ఆ భగవంతుడు మీలోనే విరాజమానమై ఉన్నాడనే విషయం గోచరిస్తుంది. కనుక మానవునికన్నా గొప్పదైనది మరేమీ లేదు అనే విషయాన్ని గ్రహించ వలసి ఉన్నది. అంటే అందరూ అంటున్నట్లుగానే భగవంతుడు సర్వశక్తివంతుడు మరియు మానవునిలోనే విరాజమానమై ఉన్నాడు.

జగత్తు భ్రమ పూరితమైనది అనే విషయం గురించి పాఠకులకు ఇంకా క్షుణ్ణంగా వివరించడానికి ఒక ఉదాహరణను ఇస్తాను!

ఒక ఎడారిలో వేసవి కాలపు మండే ఎండలో మధ్యాహ్నం వేళ ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. వారిలో ఒకరు నిరక్షరాస్యుడైన రైతు. రెండవ వ్యక్తి ఎడారి పర్యటనకు వచ్చిన ఒక శాస్త్రవేత్త. అకస్మాత్తుగా గ్రామస్తుడు నీరు! అని అరుస్తాడు. శాస్త్రవేత్త "క్షమించండి"! కానీ అది నీరు కాదు! అది కేవలం ఒక ఎండమావి మాత్రమే అని చెప్పాడు. గ్రామస్తుడు ఎండమావి అంటే ఏమిటి అని ప్రశ్నిస్తాడు.

శాస్త్రవేత్త ఇది ఆప్టికల్ భ్రమ అని చెప్పి అతనికి అవగాహన కల్పించిడానికి

ప్రయత్నిస్తాడు. గ్రామస్తుడు ఆసక్తిగా, ఆప్టికల్ భ్రమ అంటే ఏమిటి అని అడుగుతాడు. అతను నిరక్షరాస్యుడని తెలిసిన శాస్త్రవేత్త ఇప్పుడు అతనికి మరింత అవగాహన కల్పించడానికి అంతగా ఆసక్తి చూపలేదు. శాస్త్రవేత్త ఇప్పుడు దాని గురించి ఎందుకులే అని అంటాడు.

గ్రామస్తుడు ముఖ్యంగా ఇద్దరకీ త్రాగడానికి నీరు తక్కువగా ఉన్నప్పుడు ఒక అందమైన నీటి కొలనును ఎలా విస్మరించగలనని అడుగుతాడు. శాస్త్రవేత్త ఈ విషయం గురించి తను ఇంకేమీ చెప్పలేనని చెప్తాడు. అయితే తను ఒక శాస్త్రవేత్త కాబట్టి గ్రామస్థుణ్ణి తనను నమ్మమని చెప్తాడు. గ్రామస్తుడు అతన్ని గుడ్డిగా ఎలా నమ్మగలనని అంటాడు. చివరి ప్రయత్నంగా శాస్త్రవేత్త అతన్ని వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించి, అక్కడ నీరు లేదని ధృవీకరించుకొని తిరిగి రమ్మని చెబుతాడు. తన పాత్రలో ప్రస్తుతం త్రాగడానికి తగినంత నీరు ఉన్నందున, అక్కడికి వెళ్లి రావాల్సిన అవసరం లేదని గ్రామస్తుడు నిరాకరించాడు. శాస్త్రవేత్త అతనితో వాదన వ్యర్థం అని నిర్ణయించుకొని ఇంకేమీ మాట్లాడటానికి నిరాకరించాడు.

గ్రామస్తుడు ఇంకా చంచలంగా ఉన్నాడు. అతను దూరంలో నీరు ఉందని చివరికి అంగీకరిస్తురా అని శాస్త్రవేత్తను అడుగుతాడు. ఇప్పుడు శాస్త్రవేత్త వద్ద చెయ్యడానికి రెండు పద్ధతులు మిగిలి ఉన్నాయి. ఒక పద్ధతి అతన్ని విస్మరించి ముందుకు సాగడం. మరొకటి అతని చెయ్యి పట్టుకొని బలవంతంగా నీటి కొలను ఉన్నట్లు కనిపిస్తున్న ప్రదేశానికి లాగడం. ఈ చివరి ప్రక్రియను యోగ మార్గంలో శక్తిపాత్ అంటారు. చివరికి జ్ఞానం నిరక్షరాస్యుడైన ఆ గ్రామస్తుడికి అది కేవలం ఒక భ్రమ మాత్రమే అని తెలుస్తుంది.

కొంత కాలం తరువాత అలాంటి మరొక సందర్భంలో, అదే గ్రామస్తుడు అదే ఎడారిలో ఇంకొక శాస్త్రీయ పర్యటనకు వచ్చిన మరొక శాస్త్రవేత్త స్నేహితుడితో కలిసి నిలబడి ఉంటాడు. నీటి చెరువులాగా ఎండమావి మెరుస్తున్నట్లు వారిద్దరికీ కనిపిస్తుంది. అయితే శాస్త్రవేత్త ఈసారి తనే ముందు చొరవ తీసుకుంటాడు. ఆప్టికల్ భ్రమ ఎలా ఏర్పడుతుందో అతనికి వివరించడం ప్రారంభిస్తాడు. గ్రామస్తుడు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నాడు. తన

శాస్త్రవేత్త స్నేహితుడు శాస్త్రీయ పరిభాషతో నిండిన తన సుదీర్ఘ వివరణను పూర్తి చేయడానికి ఓపికగా ఎదురు చూస్తున్నాడు. అతను తన వివరణ పూర్తి చేసిన తరువాత అతని అర్థం లేని ఉపన్యాసం యొక్క ఉపయోగం ఏమిటి అని గ్రామస్తుడు ప్రశ్నిస్తాడు. శాస్త్రవేత్త ఆశ్చర్యపోతాడు మరియు గ్రామస్తుడు అర్థం చేసుకోలేని భాషలో ఆప్టికల్ భ్రమ వివరించడానికి ప్రయత్నించడంలోని తన మూర్ఖత్వాన్ని గ్రహించాడు. ఏదేమైనా, అక్కడ నీరు లేదనే విషయం తనకు తెలుసా అని అడుగుతాడు. అది నీటి కొలనులా కనిపిస్తుంది కానీ అక్కడ నీరు లేదనే విషయం తనకు తెలుసు అని గ్రామస్తుడు జవాబిచ్చాడు. ఆప్టికల్ భ్రమ యొక్క వాస్తవికత గురించి వ్యక్తికి ఉన్న అవగాహనను ప్రత్యక్ష జ్ఞానం అని పిలుస్తారు! శాస్త్రవేత్తకు కూడా ఇదే వాస్తవం గురించి తెలుసు. అయితే అతను కూడా అదే నిర్ణయానికి వేరే మార్గాల ద్వారా వచ్చాడు. దీనిని “సైన్స్” లేదా పరోక్ష శాస్త్ర జ్ఞానం అని అంటారు. ఏదేమైనా, భౌతిక ధృవీకరణకు ముందు శాస్త్రవేత్త వద్ద ఉన్న పరోక్ష జ్ఞానాన్ని "నెస్సైన్స్" లేదా అజ్ఞానం అని పిలుస్తారు. ఎందుకంటే ఆ జ్ఞానం ఇంకా ధృవీకరించబడలేదు కాబట్టి!

మునుపటి ఉదాహరణలో, గ్రామస్తుడిని ఒప్పించడానికి శాస్త్రవేత్త వద్ద ప్రారంభంలో నాలుగు పద్ధతులు ఉన్నాయి. అతను ఆప్టికల్ భ్రమను వివరించడానికి ప్రయత్నించినప్పుడు దానిని "జ్ఞాన మార్గం" అని పిలుస్తారు. ఎండమావిని గురించి ఎక్కువగా ఆలోచించవద్దని మరియు దాని మీద ఎక్కువ ఆసక్తి చూపించవద్దని చెప్పడానికి ప్రయత్నించినప్పుడు రెండవదాన్ని "కర్మ మార్గం" అని పిలుస్తారు. అతను చెప్పేదాన్ని విశ్వసించాలని గ్రామస్తుడిని కోరినప్పుడు మూడవదాన్ని "భక్తి మార్గం" అని పిలుస్తారు. అతన్ని శారీరకంగా వెళ్లి నీటి కొలనులాగా కనిపిస్తున్న ప్రదేశాన్ని చూసిరమ్మని చెప్పినప్పుడు, ఆ నాల్గవ పద్ధతిని "ధ్యాన మార్గం" అని పిలుస్తారు.

నేను చాలా కాలం క్రిందట చదివిన మరొక కథ చెబుతాను. ఆ కథ ప్రాచీన సంస్కృత గ్రంథాలలో వివరించ బడినది. అయితే ఆ కథ ఏ గ్రంథములో వివరించ బడినదనే విషయం ప్రస్తుతం నాకు ఏ మాత్రం గుర్తు లేదు. కాని ఆ

కథ సారాంశంలో మనం నేర్చుకోవలసిన ఒక విలువైన గుణపాఠం దాగి ఉన్నది.

ప్రాచీన కాలంలో ఒకసారి పదకొండు మంది గ్రుడ్డివాళ్ళు ఏనుగు ఎలా ఉంటుంది అనే విషయాన్ని వివరించుటకు ప్రయత్నిస్తారు. వాళ్ళందరూ ఏనుగు చుట్టూ నిలబడి దానిని తమ తమ చేతులతో తాకి అనుభవ పూర్వకంగా మరీ వివరిస్తున్నారు. వాళ్ళు చెప్పేదంతా నిజమే! ఎందుకంటే వాళ్ళు దానిని చూడలేక పోయినా దానిని తమ చేతులతో తాకి పొందిన జ్ఞానంతో వివరిస్తున్నారు కాబట్టి! ఎవరూ వాళ్ళు చెప్పేదాన్ని ఖండించలేరు. ఎందుకంటే వాళ్ళు నిజమే పలుకుతున్నారు కాబట్టి! అయితే మనందరికీ తెలిసినదేమంటే వాళ్లు చెప్పేది సంపూర్ణ సత్యం కాదని! వాళ్ళు చెప్పేదంతా వ్యక్తిగత స్థాయిలో నిజమే అయినా ఏనుగు ఎలా ఉంటుందనే సంపూర్ణమైన వర్ణన మాత్రం ఎవరి నోటినుండి బయటికి రావడం లేదు. ఇంతటితో ఆగకుండా ఆ పదకొండు మంది గ్రుడ్డివాళ్ళు తమ మధ్యన ఒకరితో మరొకరు తాము చెప్పిందే సరయిన వర్ణన అని ఘర్షణ పడడం మొదలు పెట్టారు.

మనం భగవంతుణ్ణి గురించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినపుడు అంతటా దాదాపు ఇదే పరిస్థితి ఎదురవ్వడం గమనిస్తున్నాము. విషయాన్ని ఇంకా జటిలం చేయడానికి భగవంతుడేమీ భూలోకపు వాసి అయిన ఏనుగు కాదు. ఒకవేళ భగవంతుడు స్వయంగా భూలోకంలో భూలోకపు వాసిగా అవతారం దాల్చి కనిపించినా ఎవరూ ఆయనను గుర్తించలేరు. భూలోకపు చరిత్రలో ఎన్నో నాగరికతలలో లేదా వివిధ ప్రాంతములలో ఎన్నో సార్లు భగవంతుడు సాధారణ భూలోకపు వాసిగా కనిపించడం జరిగిందనే విషయం పాఠకులందరికీ తెలిసినదే! ఉదాహరణకు ప్రాచీన కాలంలో కృష్ణుడు, రాముడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, ప్రాఫెట్ మొహమ్మద్ మొదలైన అవతార పురుషులని ఆనాటి ప్రజలు ఎందరో తిలకించడం జరిగింది. అంటే వాళ్ళు భూలోకంలో అవతారం ఎత్తి ప్రజల మధ్యన తిరిగిన సమయంలో ఎందరో సాధారణ ప్రజలు వాళ్ళని తమలాంటి సాధారణ మానవులనే భావించారు. అతి కొద్ది మంది మాత్రమే వాళ్ళను అవతార పురుషులని

గుర్తించ గలిగారు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతూ ఉన్నది. ఒకవేళ భగవంతుడు ఇప్పటికి ఇప్పుడే మనముందు కనిపించినా మనం ఆయనను గుర్తించలేము. ఆయనను మనలాంటి సాధారణ వ్యక్తిగానే భావిస్తాము. కనుక ప్రాచీన కాలంలో కూడా ఆ దివ్య పురుషులు మానవ అవతారం దాల్చి భూమి మీద సంచరించిన కాలంలో ఆనాటి ప్రజలు వాళ్ళను దేవుని అవతారాలుగా గుర్తించలేదంటే పెద్దగా ఆశ్చర్య పోవలసిన అవసరం ఏమీ లేదు.

నేడు మనం ఆ అవతార పురుషుల యొక్క ప్రవచనాలని మరియు ఉపదేశాలను చదివి అర్థం చేసుకున్నప్పుడు వాళ్ళను దేవుని అవతారాలుగా గుర్తించడం అయితే తప్పకుండా చేస్తున్నాము. అయితే ఏనుగును వర్ణించడానికి ప్రయత్నించిన పదకొండు మంది గ్రుడ్డి వాళ్ళ మాదిరిగా చేస్తున్నాము. ఆ ఏనుగు ముందు నిలబడిన గ్రుడ్డి వాళ్ళ మాదిరిగా మనందరం కుడా భగవంతుని గురించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినపుడు తమ తమ మతాలను సంపూర్ణంగా అర్థం చేసుకోకుండా వాళ్ళలాగే ప్రవర్తిస్తున్నాము. ఆనాటి అవతార పురుషుల ఉపదేశాల గురించి సంపూర్ణముగా అవగాహన లేకుండా ప్రవర్తిస్తున్నాము.

ఇంకా ఈ విషయం గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి ఆ పదకొండు మంది గ్రుడ్డివాళ్లలో ఒకతనికి దృష్టి రావడం జరిగిందని అనుకుందాము. ఒకవేళ ఆయన మిగిలిన పది మందికి ఏనుగు యొక్క నిజస్వరూపం గురించి వర్ణించి చెప్పినా వాళ్ళు వింటారని మరియు ఒప్పుకుంటారని నమ్మకం లేదు. ఈ విషయాన్ని ఇంకా పొడిగించి చూద్దాము! దృష్టి వచ్చిన ఆయన ఆ ప్రదేశం నుండి వెళ్ళిపోయి మరొక గ్రుడ్డి వానికి కూడా దృష్టి వచ్చిందనుకుందాము. ఈ రెండవ ఆయన కూడా ఏనుగు నిజస్వరూపం గురించి మిగిలిన తొమ్మిది మందికి చెప్పడం జరుగుతుంది. అయితే మొదటిసారిగా దృష్టి వచ్చిన ఆయన చెప్పిన దానికంటే రెండవ ఆయన చెప్పిన దాంట్లో చిన్న తేడా ఉండి ఉండవచ్చు. ఎందుకంటే ఇద్దరూ ఆ ఏనుగు యొక్క సంపూర్ణమైన స్వరూపాన్ని తిలకించినపుడు వేరు వేరు దిశలనుండి లేదా కోణాలనుండి చూసివుండవచ్చు. మొదటి ఆయన ముందు

నుండి చూసి ఉండవచ్చు. రెండవ ఆయన ఏనుగు ప్రక్కన నిలబడి తిలకించి ఉండవచ్చు. అయితే ఈ చిన్న మాత్రం  దానికే మిగిలిన తొమ్మిది మంది గ్రుడ్డివాళ్ళలో మరలా తిరిగి ఘర్షణ మొదలవడం ఖాయం. కొంతమంది మొదట దృష్టి వచ్చిన ఆయన చెప్పింది ఒప్పుకుంటే మిగిలిన వాళ్లు రెండవ ఆయన చెప్పిందే నిజమని ఒప్పుకుంటారు.

ఒకవేళ దృష్టి వచ్చిన ఇద్దరూ ఒకేసారి అదే ప్రదేశంలో నిలబడి మిగిలిన గ్రుడ్డి వాళ్ళ యొక్క వాదనలో పాల్గొని ఉంటే ఏమి జరిగి ఉంటుందనేది మరొక కథ అవుతుంది. అయితే ఒకటి మాత్రం తప్పకుండా జరిగి ఉండేది. దృష్టి ఇద్దరి మధ్యన ఎలాంటి గొడవ ఉండేది కాదు. ఎందుకంటే ఆ ఇద్దరూ ఏనుగు యొక్క నిజస్వరూపాన్ని లేదా సంపూర్ణమైన రూపాన్ని తిలకించడం జరిగింది కాబట్టి! కాని మిగిలిన తొమ్మిది మంది గ్రుడ్డి వాళ్ళు మాత్రం అసలు విషయానికి తప్పకుండా రాజకీయపు రంగు పులిమి ఉండేవారు మరియు ఘర్షణ కొనసాగి ఉండేది. బహుశా ఈ కారణం చేతనే దృష్టి వచ్చి ఏనుగు యొక్క సంపూర్ణ రూపాన్ని తిలకించిన మరుక్షణం మిగిలిన గ్రుడ్డి వాళ్ళ యొక్క మూర్ఖమైన వాదనలో మరియు అర్థం లేని రాజకీయంలో ఇరుక్కుపోవడం ఇష్టం లేక ఆ ప్రదేశం నుండి వేగంగా వెళ్ళిపోయి ఉండవచ్చు. ఇది కేవలం హాస్యం దృష్టితో మాత్రమే!

భగవంతుడు ఈ భూమండలం మీద వివిధ సమయాలలో, వివిధ రూపాలలో, వివిధ ప్రాంతాలలో ఆనాటి అక్కడి ప్రజల సామాజిక స్థితులని బట్టి మానవ రూపంలో అవతరించడం  జరిగింది. అయితే మానవ జాతి మాత్రం తర తరాలుగా మతం పేరుతో ఆధ్యాత్మికంగా దిగజారిపోయి అనేక యుద్ధాలు చేయడం జరిగింది. ఈ భూమండలం మీద మతం పేరుతో ఎంత రక్తపాతం జరిగిందో పాఠకులందరికీ తెలిసిన విషయమే! అయినా సరే ఈ రక్తపాతం ఇంకా కొనసాగించడం అనేది మాత్రం మానవ జాతికి వారసత్వంగా దక్కినది. అంధకారంతో నిండిన గదిలో ఏదో ఒక చిన్న మూల నుండి బయట ప్రకాశించే ఎండలోకి కొంచెం తొంగి చూసిన ఆవేశంలో మతం పేరున గొడవ పడవద్దు! మీరు చీకటి గది యొక్క ముఖ్యద్వారం తెరిచి

బయట ప్రకాశించే ఎండలోకి సంపూర్ణంగా అడుగు పెట్టిననాడు తేజోవంతమైన జ్ఞానమనే వెలుగులో సంపూర్ణంగా కరిగి పోవడం జరుగుతుంది.

పదకొండు మంది గ్రుడ్డి వాళ్ళు ఏనుగును వర్ణించే కథ సారాంశం నుండి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఇదే! ఇది ఎలాంటిదంటే అంధకారంతో నిండిన గది యొక్క ఒక మాయా గడప నుండి బయటికి వెళ్లి జ్ఞానమనే వెలుగులోకి అడుగు పెట్టడం వంటిది.

మతం పేరుతో కేవలం రక్తపాతాన్ని మాత్రమే వారసత్వంగా పొందడమే గాకుండా మానవ జాతికి అద్భుతమైన ప్రాచీన గ్రంథాలు కూడా దక్కాయి. అయితే ఈ గ్రంథాలను ఆధారం చేసుకొని నిరుపయోగమైన వాదోపవాదనలకు మాత్రం ఎవరూ దిగకండి! అలాంటి సమయాలలో పైన వివరించిన పదకొండు మంది గ్రుడ్డి వాళ్ళు ఏనుగును వర్ణించే కథ నేర్పించిన గుణపాఠాన్ని గుర్తు చేసుకోండి! ఈ కథ మీకు ఆ సమయంలో వర్తిస్తుందో లేదో ఒక క్షణం ఆలోచించండి! ఒకవేళ వర్తిస్తుందని భావిస్తే మీరుండే చీకటి గది యొక్క ముఖ్యద్వారం వెదకండి. ఎందుకంటే కేవలం ఆ ద్వారం మాత్రమే మిమ్మల్ని అంధకారం నుండి వెలుగులోకి తీసుకు వెళుతుంది కాబట్టి!

# శబ్దప్రపంచం-అర్థ ప్రపం

మానవునికి ఈ జగత్తు అంతా ఐదు జ్ఞానేంద్రియముల మాధ్యమంగా అనుభూతికి వస్తుంది. అవి ముక్కు, కళ్ళు, నాలుక, చర్మము మరియు చెవులు. ఈ ఐదు జ్ఞానేంద్రియాల మూలస్థానాలు మానవశరీరంలో మనోమయకోశంలో అంతర్గతంగా మెదడు - వెన్నుపాము వ్యవస్థలో మేళవించబడి ఉన్నాయి. అయితే ఇక్కడ పాఠకులు ఒక విషయాన్ని గమనించాలి. ఐదు జ్ఞానేంద్రియములకు కేంద్రస్థానం మనస్సు. కనుక మనస్సు వీటిలో దేనిమీదనైనా దృష్టి కేంద్రీకరిస్తేనే దానికి సంబంధించిన అవయవము క్రియాశీలమవుతుంది. అంటే పని చేస్తుంది!

ఒకవేళ మనస్సు ఏదో విషయము పైన దృష్టి కేంద్రీకరించి ఉంటే, ఆ సమయంలో ఏదైనా ఒక జ్ఞానేంద్రియము పనిచేయకపోవచ్చును. ఉదాహరణకు ఎవరైనా తీవ్రమైన ఏకాగ్రతతో ఏదైనా ఆలోచిస్తున్న సమయంలో, వారిని ఎవరైనా వచ్చి పిలిస్తే, ఆలోచన మీద దృష్టి కేంద్రీకరించి ఉన్న ఆ వ్యక్తికి వినిపించక పోవచ్చును. అంటే చెవులు పనిచెయ్యలేదని అర్థం! అయితే చెవులు మాత్రం ఆరోగ్యంగానే ఉండి ఉండవచ్చును. కేవలం మనస్సు వాటిమీద లగ్నం చెయ్యకపోని కారణంగా ఆ వ్యక్తికి తాత్కాలికంగా ఏమీ వినిపించకుండా పోతుంది.

ఐదు జ్ఞానేంద్రియముల మాధ్యమంగా అనుభవానికి వచ్చిన ఇంద్రియ

అనుభూతులు, విజ్ఞానమయకోశంలోని "అహం"తో పూరితమై, అక్కడే ఉన్న "బుద్ధి" మీద ముద్రింపబడుతాయి. అహంతో పూరితమై వున్నందువలన "నేను ఇంద్రియాల మాధ్యమంగా అనుభూతి చెందుచున్నాను" అనే భావన జీవునిలో ఉంటుంది.

అయితే బుద్ధి అనేది సంస్కారాశయం కూడా ! అంటే ఇంతకు ముందు నుండే ఎన్నో ఇంద్రియ అనుభూతులను మరియు వాటి జ్ఞాపకాలను సంస్కారాల రూపంలో కూడబెట్టుకొని ఉండి ఉంటుంది. ఇవి ఎన్నో జన్మలనుండి "బుద్ధి" మీద ముద్రింపబడి ఉంటాయి. కొన్ని బలంగా ముద్రింపబడి ఉంటాయి. కొన్ని సందర్భాలలో మనస్సులో వాటి జ్ఞాపకాలు మెదులుతూ ఇంకా బలం పుంజుకుంటాయి. వీటన్నింటినీ సంస్కారాలు అని అంటారు. మనస్సులో మెదిలే ప్రతి ఆలోచనకు కారణం సంస్కారాశయంలో నిక్షిప్తమై ఉన్న ఇంద్రియ అనుభూతులు మరియు వాటి జ్ఞాపకాలు. మరొకవిధంగా చెప్పాలంటే సంస్కారాలు అన్నీ విత్తనముల వంటివి. బలహీనంగా ముద్రింపబడిన సంస్కారాలు కేవలం మనస్సులో ఆలోచనల రూపంలో మెరిసి మాయమవుతాయి. కానీ బలంగా ముద్రింపబడిన సంస్కారాలు మొలకెత్తి మానవుని విధిరాతకు కారణమవుతాయి.

మానవుడు చేసే సంకల్పము మరియు వికల్పము మనోమయకోశంలో జరుగుతుంది. ఒకవైపు బుద్ధిలో ముద్రింపబడి ఉన్న సంస్కారాల ఆధారంగా ఆలోచనలు చెలరేగుతూ ఉంటాయి. రెండోవైపు ఆలోచనలు ఆధారంగా సంకల్పము లేదా వికల్పము చేయడం జరుగుతుంది. మనస్సులో చెలరేగే ఆలోచనలు రెండు విధములుగా ఉంటాయి. మొదటిది భావోద్వేగముల రూపంలో ఉంటుంది. రెండవది తర్క రూపంలో ఉంటుంది. అంటే మనస్సు రెండు భాగాలుగా ఉన్నట్లు పనిచేస్తుంది. ఈ విషయాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా "మెదడు" గురించి ఒప్పుకుంటుంది.

ఏదైనా ఒక బలమైన ఆలోచన మనస్సులో మెదిలి అది సంకల్ప పూరితమైతే ఆ విషయానికి సంబంధించిన ఆజ్ఞ కర్మేంద్రియానికి వెళుతుంది. శరీరంలో ఐదు జ్ఞానేంద్రియముల వలె అయిదు కర్మేంద్రియములు

ఉంటాయి. వీటికి కూడా మూలస్థానం మనస్సు. ఇవి కాళ్ళు, చేతులు, గొంతు, జననాంగము మరియు మల – మూత్ర విసర్జనాంగములు.

కనుక మనస్సులో చెలరేగే ఆలోచనలు, సంకల్ప – వికల్ప పూరితమై, కర్మేంద్రియములు మాధ్యమంగా స్థూలజగత్తులో మానవశరీరం లోని అవయవములు ద్వారా వ్యక్తమవుతాయి. అయితే ఇవికూడా మనస్సులో చెలరేగినపుడు అహంతో పూరితమై ఉంటాయి. దానివలన "నేను చేస్తున్నాను" అనే భావన జీవునిలో ఉంటుంది. దీని ఫలితంగా చేసిన ప్రతి పని కర్మ అవుతుంది, మరియు తిరిగి ఆ అనుభూతి జ్ఞానేంద్రియముల మాధ్యమంగా సంస్కారాశయంలో ముద్రింపబడుతుంది.

ఏ విధంగా ఒక ప్రాణిలో నిరంతరం శ్వాసప్రక్రియ కొనసాగుతూ ఉంటుందో దాదాపు అదే విధంగా నిరంతరం కర్మప్రక్రియ కూడా జరుగుతూనే ఉంటుంది. కర్మ చేయుట, దాని అనుభూతి మరలా తిరిగి సంచయమగుట మరియు మరలా దాని ఫలితాన్ని విధిరాతగా అనుభవించుట. ఇది ఎప్పటికీ ఆగని కర్మచక్రం!

మనస్సులో చెలరేగే ఆలోచనలు రెండురకములుగా ఉంటాయని ఇంతకుముందే వివరించాను. మొదటిరకము భావోద్వేగాలకు సంబంధించినది. ఇది తొమ్మిది రకాలుగా ఉంటుంది. వీటినే నవరసములని కూడా అంటారు. ఇవి శృంగార భావన, ఆశ్చర్య భావన, హాస్యము, భయము, క్రోధము, గర్వము, మోహము మొదలైనవి. రెండవరకము తర్కానికి సంబంధించిన ఆలోచనలు.

ఇక మెదడు – వెన్నుపాము వ్యవస్థలో ఏడు శక్తికేంద్రాలు లేదా చక్రాలు ఉంటాయి. అన్నిటికన్నా మొదటిది మూలాధారచక్రం. మూలాధారచక్రం భూమితత్త్వానికి చిహ్నం. అంటే పదార్థం యొక్క సాంద్రతను తెలుపుతుంది. మరొక విధంగా చెప్పాలంటే భూమి ఘనీభవించే పదార్థానికి చిహ్నం అని చెప్పవచ్చును. అలాగే దీని బీజం చతురస్రాకార మండలం అని చెప్పబడినది.

పైన వివరించిన దాని ప్రకారం ఏదైనా పదార్థం ఘనీభవించి ఉన్నప్పుడు దానిని భూమితత్త్వంతో పోల్చవచ్చును. అంటే భూమితత్త్వం యొక్క

సూక్ష్మస్థాయి లేదా భూమి తన్మాత్ర, మూలాధారచక్రంతో ముడిపెట్టబడి ఉన్నది. శబ్దప్రపంచం యొక్క సృష్టిరచన ప్రకారం భూమితత్త్వం "లం" అనే శబ్దంతో ముడిపెట్టబడి ఉన్నది. అలాగే ఆధునిక విజ్ఞానశాస్త్రం చెబుతున్న సాపేక్షతా సిద్ధాంతం ప్రకారం ఈ విశ్వంలో ఉన్న పదార్థం అంతా శక్తితో సమానము. అంటే పదార్థం అయినా లేదా శక్తి అయినా రెండూ ఒకటే ! అదేవిధంగా "శబ్దం" కూడా శక్తి అనే విషయం ఆధునిక విజ్ఞానశాస్త్రం మరియు ప్రాచీనశాస్త్రాలు రెండూ ఒప్పుకుంటున్నాయి. దీనిని బట్టి తెలుస్తున్నది ఏమంటే "లం" అనే శబ్దం మరియు భూమితత్త్వం యొక్క సూక్ష్మస్థాయి అయినా భూమి తన్మాత్ర రెండూ ఒకటేనని !

మూలాధారచక్రంలోని విశ్వశక్తి అయినా కుండలినీశక్తి తన క్రియాత్మకదిశలో మానవుని మెదడు – వెన్నుపాము వ్యవస్థ మాధ్యమంగా, మస్తిష్కం మీద భూమితత్త్వాన్ని ధారణ చేస్తుంది.

ఇక్కడ పాఠకులందరికీ ఒక విషయాన్ని గమనించామని విజ్ఞప్తి చేస్తున్నాను !

విశ్వశక్తి అయినా మహామాయ లేదా కుండలినీశక్తి యొక్క నిజస్వరూపం కేవలం భ్రమింపజేయడం ! ఇంతకుమించి శక్తి అనే పదానికి మరొక అర్థం అనేది లేదు ! అయితే ఇది శబ్ద ప్రపంచం యొక్క సృష్టిరచనకు మరియు అర్థప్రపంచం యొక్క సృష్టిరచనకు రెండింటికీ వర్తిస్తుంది. శబ్దప్రపంచం "ఓం" అనే శబ్దం నుండి సృష్టి రచన చేయబడినది. సంస్కృత వర్ణమాల యొక్క బీజాక్షరములన్నీ "ఓం" అనే శబ్దం పగులకొట్టబడిన తరువాత సృష్టింపబడిన ముక్కలు అని చెప్పవచ్చును. కనుక పైన వివరించిన "లం" అనే బీజాక్షరము కూడా సంస్కృత వర్ణమాలలోనిదనే విషయం పాఠకులందరికీ తెలిసినదే ! కనుక జీవుణ్ణి భూమితత్త్వం యొక్క నియమాల క్రింద భ్రమింపచేయుటకు "లం" అనే శబ్దం భూమి తన్మాత్రగా అర్థప్రపంచములో సృష్టి రచన చేయబడినది.

మహామాయ అయినా "ఓం"కారము యొక్క స్వభావమే భ్రమింపచేయుట. కనుక దానిని నుండి సృష్టింపబడిన "లం" శబ్దం యొక్క

స్వభావం కూడా భూమితత్త్వాన్ని జీవునికి భ్రమింపచేయుట మరియు అనుభూతి చెందించుట అవుతుంది. అంటే "లం" అనే శబ్దరూపంలో ఉన్న శక్తి మరియు భూమితత్త్వము యొక్క తన్మాత్రరూపంలో ఉన్న సూక్ష్మశక్తి రెండూ మూలాధారచక్రంలో మేళవించబడి ఉన్నాయి. లేదా రెండూ ఒకటే ! దీనిని బట్టి శబ్దప్రపంచం, అర్థప్రపంచముగా జీవునికి భ్రమింపజేయబడుతుందని తెలుస్తుంది. ఎలాగూ శక్తి స్వభావము భ్రమింపజేయుట కాబట్టి ఈ విషయాన్ని అర్థం చేసుకోవడంలో ఇక సమస్యే లేదు !

మూలాధారచక్రం నాలుగుదళాలు కలిగిన తామరపుష్పం రూపంలో ఉంటుందని చెప్పబడి ఉన్నది. పుష్పం యొక్క అంతర్భాగాన ఒక చతురస్రాకార మండలం పసుపురంగులో ఉంటుంది. భూమితత్త్వం చతురస్రాకార రూపానికి మరియు పసుపు రంగుకు ముడిపెట్టబడి ఉన్నది. అలాగే చతురస్రాకార మండలం చుట్టూ ఎనిమిది శూలాలు ఉన్నట్లు కూడా చెప్పబడి ఉన్నది.

ఈ ఎనిమిది శూలాలు అష్టదిక్కులను సూచిస్తాయి. అంటే మానవుని మస్తిష్కం మీద దిక్కులు అనేవి ఉన్నాయని భ్రమింపజేయుటకు మూలాధారచక్రం ఈ విధంగా నిర్మితమై ఉంటుంది. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తించమని పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఇంతవరకు పైన వివరించినదంతా మెదడు - వెన్నుపాము వ్యవస్థ యొక్క అంతర్గతము. మెదడు - వెన్నుపాము వ్యవస్థ ఒక యంత్రం వంటిది. అతి సూక్ష్మాతి సూక్ష్మమైన శక్తుల యొక్క సమ్మేళనం. దీనినే మానవశరీరంలోని మస్తిష్కానికి స్థూలరూపమని కూడా చెప్పవచ్చును. అంటే ఎముకలు మరియు మాంసంతో కూడిన మెదడు - వెన్నుపాము వ్యవస్థ కాదు. అందరికీ బాగా పరిచయమైనది మరియు భౌతికరూపంలో ఉన్నది అయిన అన్నమయకోశం యొక్క అంతర్గతం. ఇది మనోమయకోశం మరియు అన్నమయకోశం మధ్యలో ఉంటుంది. అంటే అందరికీ పరిచయమైన రక్తమాంసాలతో మరియు ఎముకలతో కూడి ఉన్న మానవశరీరం స్థూలరూపం అయితే,

ప్రాణమయకోశం దీని సూక్ష్మరూపం అవుతుంది. ప్రాణమయకోశం కన్నా సూక్ష్మంగా ఉండేది మనస్సు లేదా మనోమయకోశం. కనుక ప్రాణమయకోశం అంతా సూక్ష్మస్థాయిలో వుండే వివిధ శక్తుల సమ్మేళనం.

కనుక పైన వివరించిన మూలాధారచక్రం యొక్క నిర్మాణక్రమం అంతా మానవుని మనస్సు ఏ విధంగా భ్రమింపజేయబడి ఉన్నదో దానికి అనుగుణంగా నిర్మితమై ఉన్నది.

అనంతమైన విశ్వమంతా వ్యాపించి ఉన్న బ్రహ్మానికి దిక్కులనేవి ఉండవు. దిక్కులనేవి కేవలం భూమిమీద నివసిస్తున్న మానవులకు మాత్రమే వర్తిస్తాయి. కనుక ఆ మానవుణ్ణి లేదా జీవిని భౌతికనియమాల క్రింద భ్రమలో పడేయాలంటే దానికి అనుకూలంగా వుండే శరీరం నిర్మించబడాలి. అంతేగాని మూలాధారచక్రంలో భౌతికంగా అందరికీ పరిచయమైనవి మరియు ఆయుధములుగా ఉపయోగించబడేవి అయిన శూలాలు అంటూ ఏమీ ఉండవు. అయితే సూక్ష్మస్థాయిలో దిక్కులనే భావనను మస్తిష్కం మీద ధారణ చేయుటకు మూలాధారచక్రం ఆ విధంగా నిర్మితమై ఉంటుంది.

దీని అర్థం ఏమిటంటే, బాహ్యజగత్తులో మానవునికి పరిచయమైన అష్టదిక్కులనేవి అసలు లేనేలేవు. అవి కేవలం ఒక భావన మాత్రమే ! మానవశరీరంలో విరాజమానమై వున్న ఆత్మ మరియు పరబ్రహ్మం వేరు ఏమీ కాదు. రెండూ ఒక్కటే కనుక, అనంతమైన ఆత్మ ఒక్కటే ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నది. అంటే ఒక మానవునికి ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నది తానేనని అర్థమైన రోజు, తానే ఈ అష్టదిక్కులు అని అంటాడు. బాహ్య జగత్తులో అనుభూతి చెందుచున్నదంతా తానేనని గ్రహించడం జరుగుతుంది. లేదా అది కేవలం భ్రమపూరితమైనది అనే విషయాన్ని గ్రహించుట జరుగుతుంది.

ఈ తర్కాన్ని ఇంకా పొడిగించినచో మూలాధారచక్రం లోని భూమితత్త్వానికి చిహ్నం అయిన చతురస్రాకార మండలం మానవమస్తిష్కంలో వాసనకి కూడా ప్రతీక. మానవునికి చెడువాసన లేదా సువాసన లేదా ఏదైనా ఒక ప్రత్యేకమైన వాసన అని భేదం చూపించుట దీని

పని. కనుక భూమితత్వాన్ని పంచ జ్ఞానేంద్రియములలో ఒకటైన వాసన లేదా స్థూల అవయవమైన ముక్కుతో ముడిపెట్టుట జరిగింది. అసలు వాసన అనే భావనను మానవ మస్తిష్కం మీద ధారణ చేయుట ఇక్కడి నుండే ప్రారంభం అవుతుంది.

ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకారం రక్తమాంసాలతో ఉండే మానవశరీరం అసంఖ్యాకమైన జీవకణాలతో నిర్మితమై ఉన్నది. అయితే జీవకణాలు కూడా పదార్థంతో తయారైనవే ! పదార్థం అయినా శక్తి అయినా ఒకటేనని ఇంతకుముందే వివరించుట జరిగినది. కనుక ప్రాణమయకోశం యొక్క అంతర్గతమైన సూక్ష్మశక్తులే స్థూలరూపంలో పదార్థంగా పరిణామం చెంది, ఆ తరువాత శరీరనిర్మాణానికి అవసరమైన జీవకణాలుగా వృద్ధి చెందుచున్నాయి. అంటే మూలాధారచక్రం లోని భూమితత్వానికి సంబంధించిన తన్మాత్ర "లం" అనే శబ్దం నుండి పరిణామం చెంది చివరికి తన్మాత్రగా రూపాన్ని సంతరించుకుంటుంది. ఆ తరువాత పదార్థం యొక్క అణువుగా మార్పుచెంది చివరికి జీవకణాలుగా నిర్మాణం జరుగుతుంది. ఆ జీవకణాల యొక్క ఏదో ఒక మిశ్రమం మానవుని మస్తిష్కం మీద ఒకవైపు భూమితత్వాన్ని ధారణచేయుట మరియు మరొకవైపు వాసనను పసిగట్టగల సామర్థ్యాన్ని ధారణచేయడం జరుగుతుంది. ఈ విధంగా "ఓం"కారం లేదా శబ్దప్రపంచం యొక్క అంతర్గతంమైన "లం" అనే శబ్దం మానవమస్తిష్కం మీద అర్ధప్రపంచం లేదా బాహ్యజగత్తు యొక్క అంతర్గతం అయిన భూమితత్వాన్ని మరియు వాసనను పసిగట్టగల సామర్థ్యాన్ని ధారణచేయుట జరుగుతుంది. అయితే ఇది అంతా కేవలం భ్రమపూరితమేనని గుర్తుంచుకోవలసినదిగా పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాను ఎందుకంటే శక్తి యొక్క స్వభావమే భ్రమింపజేయుట కాబట్టి ! కనుక, మానవ ఇంద్రియాల మాధ్యమంగా అనుభూతి చెందుచున్న ఈ జగత్తు కేవలం భ్రమపూరితమైనది మాత్రమే !

పైన వివరించిన విధముగానే మిగిలిన ఐదుచక్రాలలో కూడా శబ్దప్రపంచము అర్థప్రపంచముగా వ్యక్తమవుట జరుగుతుంది.

# సిద్ధులు

మానవుడు అనుభూతి చెందుచున్న ఈ జగత్తు అంతా భ్రమపూరితమైనది. అంటే మాయతో కూడి ఉన్నదని అర్ధం. అంటే మానవుడు అనుభూతి చెందుచున్న జగత్తు అంతా శక్తిమయం అనికూడా చెప్పవచ్చును. ఈ విషయాన్ని ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మాయ శక్తి యొక్క నిజస్వరూపం అని లేదా శక్తి అనే పదానికి మరియు "మాయ" అనే పదానికి ఏమీ తేడా లేదని చెప్పవచ్చును. పాఠకులు ఈ విషయాన్ని స్పష్టంగా అర్ధం చేసుకుంటే కానీ "సిద్ధి" అనే పదానికి అర్ధం అవగాహన కాదు!

అయితే పాఠకులు ఇక్కడ ఒక ప్రశ్న వేయవచ్చును. జగత్తులో మనం చలి, వేడి వంటివి అనుభూతి చెందుతూ ఉంటాము. కనుక స్వయంగా అనుభూతి చెందుతున్న దానిని "మాయ" అని నమ్మడం ఎలా? అని ప్రశ్నించవచ్చును. అర్ధం చేసుకోవలసిన అసలు రహస్యం అంతా ఇక్కడే వున్నది ! మాయగా రూపాంతరం చెందిన విశ్వశక్తి మానవుని శరీరంలోని "మెదడు - వెన్నుపాము" వ్యవస్థ మాధ్యమంగా మానవుని యొక్క మస్తిష్కం మీద జగత్తు యొక్క అనుభూతిని భ్రమింపజేయిస్తుంది. అసలు మాయాశక్తి యొక్క నిజమైన స్వభావం భ్రమింపజేయడం ! అందుకే "శక్తి" మరియు "మాయ" అనే రెండు పదాలకు ప్రాపంచిక అర్ధం వేరైనా వాటిలోని పదార్ధం మరియు వాటి వెనుక వున్న యదార్ధం ఒక్కటే అని వివరించాను. కనుక విశ్వశక్తి తన క్రియాత్మకదశలో వున్నపుడు ప్రతి మానవునికి వ్యక్తిగత స్థాయిలో జగత్తుని

సృష్టించుట జరుగుతుంది. ఇక్కడ "శక్తి"ని పురాణాలలో స్తుతించబడిన సరస్వతీదేవితో పోల్చవచ్చును. అదేవిధముగా సమిష్టిస్థాయిలో కూడా జగత్తు సృష్టింపబడుతుంది. అంటే ఇక్కడ రెండు సృష్టులు జరిగాయి. ఒకటి వ్యక్తిగతస్థాయిలో మానవునికి మరియు రెండవది సమిష్టిస్తాయిలో భగవంతునికి. అంటే ఇక్కడ పురాణాలలో స్తుతించబడిన త్రిమూర్తులలో ఒకరైన "బ్రహ్మ" అని అర్థం.

పై విషయాన్ని మరొక విధంగా వివరించాలంటే భగవంతుడు మరియు మానవుడు ఇద్దరూ విశ్వశక్తి యొక్క మాయవలన భ్రమింపబడుతున్నారు అని చెప్పవచ్చును. భగవంతుడు తానే ఈ జగత్తు అని, అంటే ఈ జగత్తే తన యొక్క శరీరమని భ్రమపడుతూ ఉండాలి. అలాగే మానవుడు తన శరీరము మరియు తన శరీరము యొక్క ఇంద్రియాల మాధ్యమంగా బయట శూన్యంలోకి ప్రసరింపబడుతున్న జగత్తుని వ్యక్తిగతస్థాయిలో అనుభూతి చెందుట జరుగుతుంది. బ్రహ్మదేవుని యొక్క "బ్రహ్మాండం" మరియు మానవుని యొక్క "పిండాండం" రెండూ ఒకే విధముగా సృష్టింపబడిన విషయం పాఠకులకు సుపరిచితమే!

కనుక విశ్వశక్తి మానవుని మస్తిష్కం మీద జగత్తు యొక్క భ్రమను సృష్టిరచన చేయడం జరుగుతుంది. ఆ తరువాత ఈ భ్రమపూరితమైన మాయను లేదా జగత్తును నిరంతరం ధారణ కూడా చేయడం జరుగుతుంది. ఈ స్థితిలో "శక్తి"ని "లక్ష్మి"గా ప్రాచీన పురాణములలో స్తుతించుట జరిగినది. జగత్తు స్థాయిలో మాయా స్వరూపిణిగా తన ఎనిమిది రూపముల మాధ్యమంగా అష్టలక్ష్మి, మానవునికి భ్రమపూరితమై, మాయా లోకాన్ని నిరంతరం ధారణ చేస్తూ ఉంటుంది. మానవులు కోరుకునే ఎనిమిది రకముల ప్రాపంచిక విషయాలు అష్టలక్ష్మి (ధైర్యలక్ష్మి, విజయ లక్ష్మి, సంతాన లక్ష్మి, ధాన్య లక్ష్మి, ఆది లక్ష్మి, ధన లక్ష్మి, జ్ఞాన లక్ష్మి మరియు గజ లక్ష్మి) యొక్క నియంత్రణలో ఉంటాయి. మానవుని మనసులో నిరంతరం ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రపు కెరటాలు వంటి భావోద్వేగాలు మరియు ఆలోచనలు అన్నీ అష్టలక్ష్మి యొక్క నియంత్రణలో ఉంటాయి. కనుక, మానవుడు ఈ భ్రమపూరితమైన మాయను

ఆ అష్టలక్ష్మి కరుణతో చేధించి బయట పడటమనేది తన అంతర జగత్తులో జరిపే ఆఖరి పోరాటం ! ఈ స్థితిలో విశ్వశక్తి "కాళి" రూపంలో స్వయంగా తిరోగమనదిశలోకి వెళ్లి మానవుని యొక్క మనసులోని అంతర జగత్తును విధ్వంసం చేస్తుంది.

కనుక సృష్టిరచన చేసినది విశ్వశక్తి, సృష్టిని నిరంతరం ధారణ చేస్తున్నది విశ్వశక్తి మరియు ఆఖరిగా సృష్టి వినాశనం లేదా విలీనం చేసేది కూడా విశ్వశక్తి ! అయితే వ్యక్తిగత స్థాయిలో పరాశక్తి యొక్క ఈ లీల అంతా జరిగేది కేవలం మానవుని యొక్క మస్తిష్క వ్యవస్థలో మాత్రమే ! అంటే సమిష్టిస్థాయిలో బయట వున్నా బాహ్య జగత్తుకి మరియు మానవునికి ఎలాంటి సంబంధము లేదు కనుక. ప్రతి మానవుడు బాహ్య ప్రపంచాన్ని గురించి ఎక్కువగా ఆలోచన చేయకుండా తాను తన అంతర జగత్తు మీద దృష్టి పెట్టవలసిన అవసరం వున్నది.

నేను పైన వివరించిన విధంగా ఈ జగత్తుకి అసలు అస్తిత్వం లేదా ఆధారం, మానవుని యొక్క చిత్తస్థితి లేదా మనసు. దీని కారణంగానే మానవునికి నిద్రపోతున్న సమయంలో సృష్టి యొక్క విలీనం జరుగుతుంది. మరలా తిరిగి జాగృతస్థితిలోకి రాగానే సృష్టిరచన జరుగుతుంది. మేల్కొనివున్న సమయంలో ప్రతిక్షణం మాయా జగత్తు మనసులో ధారణ చేయబడుతుంది. ఈ విషయాన్ని పాఠకులు దృష్టిలో ఉంచుకుంటే సిద్ధి అంటే ఏమిటి అనే విషయం సులభంగా అర్ధం చేసుకొనవచ్చును.

సిద్ధి అనేది బాహ్యజగత్తులో ప్రకటితమవుతుంది. ఈ కోణంలో చూస్తే "సిద్ధి" అనేది కూడా భ్రమపూరితమైనదనే విషయం అర్ధమవుతుంది. అంటే మానవునికి అనుభూతులను సేకరించే పంచజ్ఞానేంద్రియాలు మరియు వాటిని అనుభూతిచెందే మనస్సు ఉన్నంతకాలం అవి సిద్ధులు అనుభవానికి వస్తాయి. భ్రమను దాటినా యోగికి మాత్రం అవి మామూలుగా కనిపిస్తాయి. అయితే సాధారణంగా మానవునికి అనుభవమయ్యే జగత్తు "మెదడు - వెన్నుపాము" వ్యవస్థ ద్వారా బాహ్యంగా శూన్యంలో ప్రతిబింబించబడుతుంది. కాబట్టి మానవుని మస్తిష్కం ఏదైనా ప్రక్రియ ద్వారా ప్రభావితం

గావించబడినపుడు దాని యొక్క ఫలితం అంటే "సిద్ధి" అనే మహిమ బాహ్య జగత్తులో అనుభవానికి వస్తుంది. అంటే ఒక యోగి ఎవరిముందు అయినా ఏదైనా "సిద్ధి"ని ప్రకటితం చేయాలంటే, ఆ యోగి ముందుగా తన మస్తిష్కవ్యవస్థను ప్రభావితం చేసుకోవలసి ఉంటుంది. ఆలా చేసినపుడు వ్యక్తిగతస్థాయిలో ఆ యోగికి జగత్తులో ఎప్పుడూ కనీవిని ఎరుగని ప్రక్రియలు తాను సంకల్పించినందువలన అనుభవానికి వస్తాయి. అయితే ఆ ప్రక్రియను తిలకించే జనానికి కూడా అవి అనుభవమవుతాయి. ఉదాహరణకు ఒక యోగి తన "సిద్ధి"ని ప్రయోగించి అదృశ్యరూపాన్ని ధరిస్తే ఆ ప్రక్రియ ఆ యోగికి ప్రత్యక్షంగా అనుభవానికి రావాలి కాబట్టి ఇక ఆ యోగి శరీరాన్ని మరెవరూ చూడకుండా ఉండాలి. అంటే ఇక్కడ జరుగుచున్న ప్రక్రియ అంతా యోగి యొక్క వ్యక్తిగత జగత్తులో ప్రకటితమవుతుంది. అయితే దానికి సాక్ష్యంగా మిగిలిన జనం కేవలం మాధ్యమం అవుతారు. తిలకించే జనం లేనిచో ఆ యోగికి అదృశ్యరూపాన్ని ధరించుటకు అవకాశమే ఉండదు. అంటే ఆ ప్రక్రియ ఆ యోగికి అనుభవానికి రావడానికి బాహ్యజగత్తులో పరిస్థితులు అనుకూలంగా లేదా మాధ్యమంగా పనిచేయాలి.

పైన వివరించిన విధంగా, మరొక ఉదాహరణ తీసుకుందాము ! ఒక యోగి తన సిద్ధిని ప్రయోగించి తన ఎదురుగా వున్న పెద్ద బండను స్పృశించకుండానే పగుల కొట్టడం జరిగిందనుకోండి ! ఇక్కడ ఆ ప్రక్రియను తిలకించే జనానికి అందరికీ ఆ విషయం అనుభవంలోకి వస్తుంది. అంతేగాక శాశ్వతంగా ఆ బాండ పగులగొట్టబడినదిగానే మిగిలిపోతుంది. తాను సంకల్పించినంత మాత్రంచేత ఆ విధంగా జరుగవలెనని ఆ యోగి కోరుకున్నందువలన మరియు ఆ యోగికి వున్న మానసికస్థితి వలన ఆ ప్రక్రియ తప్పనిసరిగా జరిగి బాహ్యజగత్తులో అనుభవానికి రావలసివున్నందువలన అలా జరుగుతుంది.

అయితే ఇక్కడ పాఠకులు ఒక ప్రశ్న వేయవచ్చును. ఏ భౌతికశక్తి ఉపయోగించబడకుండా బండ ఎలా పగులగొట్టబడినది? అని ప్రశ్నించవచ్చును. ఈ ప్రశ్నకు సమాధానం వ్రాయుటకే ఈ అధ్యాయంలో "శక్తి

యొక్క స్వభావం భ్రమింప చేయుట" అని సుదీర్ఘమైన వివరణ ముందుగానే ఇవ్వడం జరిగింది.

ఒక్కముక్కలో చెప్పాలంటే "సిద్ధి" అనేది "మాయ"లో సూక్ష్మస్థాయిలో మరొక మాయ శక్తిలీల అని చెప్పవచ్చును. అయితే అనుభూతి చెందే అందరికీ అది నిజమైనదిగా మరియు మహిమగానే ఉంటుంది.

ఇక అటువంటి ప్రక్రియను ప్రకటితం చేయగల సామర్ధ్యం ఏ యోగికి అయినా ఎలా ప్రాప్తిస్తుంది అనే విషయాన్ని గురించి విశ్లేషణ చేద్దాము. యోగశాస్త్రాలు చెబుతున్న దానిని బట్టి ఇటువంటి సామర్ధ్యం నాలుగు విధాలుగా ప్రాప్తించవచ్చును. అయితే నాలుగు విధములలో ఒక సామాన్యమైన విషయాన్ని గమనించవచ్చును. అది మానసికస్థితిలో వచ్చే మార్పు వలన జరుగుతుంది ! మొదటి పద్ధతిలో ఏదైనా ఔషధాన్ని ఉపయోగించి మెదడు యొక్క స్పందనను మార్చుటద్వారా "సిద్ధి" ప్రాప్తించే అవకాశం ఉన్నది. కానీ ఆ ఔషధముల రహస్యం ఆధునికకాలంలో ఎవరికీ తెలియదు. బహుశా మానవులు అటువంటి ఔషధములను సిద్ధులు ప్రాప్తించుకొనుట కోసం దుర్వినియోగం చేస్తారని జ్ఞానవతి అయిన విశ్వశక్తి ఆ విషయాన్ని రహస్యంగా ఉంచుట జరిగిందని భావిస్తున్నాను. అయితే మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా మానవజాతికి ఆ ఔషధాల రహస్యం కూడా బహిర్గతం అవుతుందని నా అభిప్రాయం.

రెండవ పద్ధతిలో శరీరాన్ని ఏదైనా భౌతికహింసకు గురిచేయడం ద్వారా "సిద్ధి" ప్రాప్తిస్తుంది. అంటే సుదీర్ఘమైన "హింస"ను దీర్ఘకాలం పాటు అనుభూతి చెందుట ద్వారా మనసు యొక్క స్థితిని లేదా స్పందనను మార్చుట జరుగుతుంది. అయితే ఎటువంటి శారీరకహింస అనుభూతి చెందితే ఎటువంటి సిద్ధి ప్రకటిత మవుతుందనేది చెప్పలేము. కేవలం ఈ పద్ధతి ద్వారా "సిద్ధులు" ప్రాప్తించుట జరుగుతుందనేది మాత్రం శాస్త్రాలు చెబుతున్నాయి.

మూడవ పద్ధతి తపస్సు ! అంటే మనసు సంప్రజ్ఞాత సమాధి స్థితిలో స్థిరపడుట. ఈ స్థితిలో "సిద్ధులు" ప్రకటితం అవడం అనేది తప్పనిసరిగా జరుగవలసి ఉన్నదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇలా ఎందుకు

జరుగుతుందంటే ఏ ఆలోచనలు లేని సమాధి స్థితి అనేది మానవుని మనసు యొక్క స్వాభావికస్థితి కాబట్టి ! మనసు ఈ స్థితికి చేరుతున్న కొలదీ అంతరంలో విరాజమానమై ఉన్న ఆత్మ లేదా బ్రహ్మం ఆలోచనారహిత మనసులో ప్రతిబింబించుట జరుగుతుంది. అయితే సంపూర్ణంగా ఆలోచనారహిత స్థితిలో స్థిరపడుట మొదలైనప్పుడు "సిద్ధులు" సైతం ప్రకటితం కావడం ఆగిపోవడం జరుగుతుంది. సిద్ధులు కేవలం సంప్రజ్ఞాత సమాధిస్థితిలో మాత్రమే ప్రకటితం అవుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్థితిలో భగవంతుని శక్తి మూడురూపాలలో మిశ్రమంగా మిగిలి ఉంటుంది. అవి ఇచ్ఛ, క్రియ మరియు జ్ఞానం. ఈ మూడు రూపాలలో ఈశ్వరీయశక్తి బాహ్య జగత్తులో ప్రకటితమైనపుడు దానిని మనం "సిద్ధి" అంటాము. అయితే ఇచ్ఛలో క్రియ మరియు జ్ఞానం కలిసి ఉంటాయి. ప్రకటితమయ్యే "సిద్ధి"ని బట్టి అది దేనివలన ప్రకటితం అయినది తెలుస్తుంది. ఉదాహరణకు దివ్యదృష్టి అనేది జ్ఞానం వలన, ఏదైనా వస్తువు ప్రకటితం కావడం "ఇచ్ఛ" వలన మరియు ఆకాశగమనం "క్రియా" శక్తి వలన జరుగుతాయి.

అయితే ఈ సిద్ధులు అన్నీ స్వాభావికంగానే ప్రతి ప్రాణిలో ఉన్నాయి. మనసు అహంతో పూరితమై ఉన్న కారణంచేత "మాయ" యొక్క ఆవరణలో అవి ప్రకటితం కావు. అంతేగాని "సిద్ధులు" మానవునికి బయటనుండి రావు మరియు అవసరం లేదు.

నాలుగవ పద్ధతి మంత్రం ! మంత్రం జపం ద్వారా మానసికస్థితిలో పరివర్తన రావడం జరుగుతుంది. అయితే ఏ మంత్రం జపం చేయడం జరుగుతుందో ఆ మంత్రానికి సంబంధించిన "సిద్ధి" మాత్రమే ప్రకటితమవుతుంది. దీర్ఘకాలం మంత్రాన్ని జపించుట వలన ఆ మంత్రానికి చెందిన "శక్తి" అదేరూపంలో మానసికస్థితిలో పరివర్తన తెస్తుంది.

పైన వివరించిన నాలుగు విధములుగా కాకుండా ఒక్కోసారి "సిద్ధులు" యోగికి జన్మతోనే ప్రాప్తించి ఉంటాయి. పైన వివరించిన పద్ధతులను క్రిందటి జన్మలలో అభ్యాసం చేసివున్న కారణంగా ఈ విధముగా జరుగుతుంది.

# ఆధ్యాత్మిక విషయాలలో గురువు యొక్క ముఖ్యపాత్ర

మనం ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్ళవలసి వచ్చినపుడు అన్నింటికన్నా ముందుగా తెలుసుకోవలసినది దారి ! దాని కోసం ఆ ప్రదేశాలకు సంబంధించిన చిత్రపటాన్ని తెఱచి చూస్తాం ! ఇతరుల సహాయం లేకుండా మరియు ఎవరినీ దారి అడగకుండా సునాయాసంగా చిత్రపటంలో దారిని గుర్తించి ప్రయాణం ప్రారంభిస్తాము. అయితే ఇక్కడ ఒక సమస్య ఉన్నది. మనం ఎక్కడ నుండి ప్రయాణం ప్రారంభిస్తున్నామో, ఆ ప్రదేశాన్ని చిత్రపటంలో క్షుణ్ణంగా గుర్తించగలిగి ఉండాలి. ఉదాహరణకు మనం ఏదైనా నగరంలో, ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్లాలనుకుంటే, చిత్రపటంలో మనం ఎక్కడ ఉన్నామో ముందుగా గుర్తించవలసిన అవసరం ఉంటుంది. అంటే నగరంలో మనం ఏ ప్రదేశంలో ఉన్నాము అనేది తెలియాలి మరియు ఆ ప్రదేశాన్ని చిత్రపటంలో గుర్తించగలగాలి. లేనిచో చిత్రపటం వలన మనకు ఎటువంటి ఉపయోగం ఉండదు. మనం చేరవలసిన గమ్యం చిత్రపటంలో కనిపిస్తూనే ఉన్నా మనం ప్రయాణం ప్రారంభించలేము.

మరొక ఉదాహరణ తీసుకుందాము ! మనం దారితప్పి ఒక అడవిలో ఇరుక్కుపోయి ఉన్నామనుకోండి ! మన దగ్గర ఒకవేళ చిత్రపటం మరియు అయస్కాంత దిక్సూచి ఉంటే, వాటిని ఉపయోగించి సునాయాసంగా మనం ఆ అడవిని దాటి బయటపడవచ్చు. కానీ దానికి అత్యంత అవసరమైన

మరియు అతి కీలకమైన సమాచారం ఒకటి మాత్రం మనకు తెలియాలి ! అది మనం ఇరుక్కుపోయి ఉన్న ప్రదేశం గురించిన ఆనవాలు లేదా ఆ ప్రదేశాన్ని చిత్రపటంలో గుర్తించడం ! మనం అడవిలో ఎక్కడ ఇరుక్కుపోయి ఉన్నామో తెలియకపోతే చిత్రపటాన్ని ఉపయోగించలేము మరియు అలాగే అయస్కాంత దిక్సూచి ఉపయోగించలేము. చిత్రపటంలో దారి స్పష్టంగా సూచించబడి ఉన్నా అది మనకు ఎందుకూ పనికిరాదు. మనం ఎక్కడ దారితప్పి ఇరుక్కుపోయి ఉన్నాము అనే విషయం తెలిస్తే ఆ తరువాత సునాయాసంగా అడవిని దాటడమే కాకుండా, కావాలంటే అక్కడికి పోయి విహారయాత్ర సైతం చేయవచ్చును. అంటే మనం దుర్గమమైన ఒక అడవిలో ప్రయాణం చేయుటకు మరియు సునాయాసంగా ఎవరినీ దారి అడగకుండా ఆ అడవిని దాటుటకు అవసరమైన ముఖ్య సమాచారం మనం ఎక్కడ ఉన్నాము అనేది ! అలాగే మనకు ఈ సమాచారం దారిపొడుగునా కూడా తెలియాలి ! లేనిచో మరల తిరిగి దారి మధ్యలో దారితప్పి పోయే ప్రమాదం ఉంటుంది.

సముద్రయానంలో మరియు వాయుమార్గాన నావికులు ఉపయోగించే పద్ధతి కూడా ఇలాగే ఉంటుంది !

అన్నివేళలా మనం ఎక్కడ వున్నాము అనే విషయం తెలిస్తే దారితప్పడం అన్న ప్రశ్నే ఉండదు. ఎంత పెద్ద సముద్రాన్ని అయినా లేదా అడవిని అయినా ఏదో ఒకరోజు దాటడం అనేది ఖాయం. అయితే మన ప్రయాణం సుఖంగా ఉంటుందా లేదా కష్టంగా ఉంటుందా అనే విషయం గురించి నేను చర్చించడం లేదు. కేవలం ప్రయాణాన్ని సరైనదిశలో చేయడం జరుగుతుంది అని మాత్రమే చెబుతున్నాను.

నేను చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టం చేయుటకు మరొక ఉదాహరణను తీసుకుందాము !

భారతదేశంలో ఢిల్లీ నగరానికి ఎలావెళ్లాలి అని ఎవరైనా అడిగితే వివిధప్రాంతాల లోని వారు వివిధ మార్గాలను చెబుతారు. అంటే వాళ్ళు చెబుతున్నది వాళ్ళు ఉండే ప్రదేశం నుండి ఢిల్లీ వెళ్ళుటకు దారి ! ఒక ప్రాంతం

వాళ్ళు చెప్పేదారి మరొక ప్రాంతం వాళ్లకు ఉపయోగపడదు. ముంబయి నగరంలో ఉండేవారు చెప్పే దారి, చెన్నై నగరంలోని వారు చెప్పే దారి, కోలకత్తా నగరంలోని వారు చెప్పేదారి మరియు పంజాబ్ లోని వారు చెప్పే దారి వేరువేరుగా ఉంటాయి.

కేవలం ఒక విషయాన్ని స్పష్టంచేయుటకు మాత్రమే నేను పై ఉదాహరణలను తీసుకున్నాను. అదేమిటంటే, ఎటువంటి పరిస్థితులలో అయినా మనం ఎక్కడ ఉన్నది అనే దానిని బట్టి మనం చేరవలసిన గమ్యం యొక్క దిశ మరియు దారి నిర్దేశింపబడి ఉంటాయి. నేను పైన వివరించిన ఉదాహరణలు ప్రాపంచిక వ్యవహారాలకు మరియు ఆధ్యాత్మిక విషయాలకు రెండిటికీ వర్తిస్తాయి. దీని అర్థం ఏమిటంటే మనం ఈ జగత్తులో ప్రయాణించే సమయంలో, ఎక్కడ ఉన్నాము అనే విషయం ఏదొక పరికరం మాధ్యమంగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది మరియు తప్పనిసరిగా తెలుసుకోవాలి కూడా !

అయితే ఆధ్యాత్మిక విషయానికి వచ్చినపుడు మన గురించి మనం తెలుసుకోలేము. తెలుసుకోవడానికి పరికరాల వంటివి ఏమీ ఉండవు కాబట్టి! ఆధ్యాత్మికంగా మనం ఏ స్థాయిలో ఉన్నది ఎవరైనా చెప్పగలిగితే, అలాగే ఏ దిక్కులో ప్రయాణిస్తున్నామో సరిగ్గా ఎవరైనా చెప్పగలిగితే అప్పుడు మనం ఏదో ఒక రోజు గమ్యాన్ని చేరుకోవడం ఖాయం అని నమ్మవచ్చును. ఆలా చెప్పగలిగే వారిని "గురువు" అంటారు. గురువుకి, శిష్యుని యొక్క మానసికస్థితి అన్నివేళలా స్పష్టంగా అర్థమయ్యి ఉంటుంది కాబట్టి, అతనికి అవసరమైన దారిని చూపడం జరుగుతుంది. అంటే మోక్షమనే గమ్యాన్ని చేరుకోవడానికి సరైన దారి చూపడం జరుగుతుంది. కనుక ఇటువంటి దైవికకృప లేకుండా ఆధ్యాత్మిక విషయాలలో ముందుకి సాగడం అసాధ్యం అవుతుంది !

నేను పైన వివరించిన ఉదాహరణలను దృష్టిలో ఉంచుకొని, నేడు మనం ఆచరిస్తున్న అనేక యోగసంప్రదాయాలను గురించి ఆలోచించండి ! అన్ని సంప్రదాయాలలో చెబుతున్న విషయాలు సరైనవే ! అంతే కాకుండా వారు

చెప్పిన విషయాలు అన్ని కాలాలకు వర్తిస్తాయని కూడా చెప్పవచ్చును. అయితే వారు చెప్పినవి, జనసమాజాన్ని మొత్తాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పిన సత్యాలు. ఏదైనా ఒక వ్యక్తి విషయానికి వచ్చినపుడు అవి కొంతవరకు మాత్రమే మార్గదర్శనం చేయగలవు. అంటే గమ్యాన్ని ఎలా చేరుకోవాలి కొండగుర్తులు మాత్రమే చెప్పగలవు. అంతేగాని, ప్రతివ్యక్తికి అవసరమైన దారిని గురించి విస్తారంగా మాత్రం చెప్పలేవు. ఎందుకంటే ప్రతివ్యక్తి యొక్క వ్యక్తిత్వం విశిష్టమైనదిగా ఉంటుంది కాబట్టి !ప్రతి వ్యక్తి తను జన్మ జన్మలనుండి కూడబెట్టుకొని ఉన్న సంస్కారాల శేషం విశిష్టమైనదిగా మరియు అద్వితీయమైనదిగా ఉంటుంది. అంటే ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వం మరొకరికి ఉన్నట్లు ఉండదు. ఈ కారణం వలన ఒక వ్యక్తికి అనుభవానికి వచ్చే జగత్తు కూడా అదే మాదిరి మరొకరికి రాదు. కనుక, ఎప్పుడో ప్రాచీనశాస్త్రాలు మరియు గొప్ప గొప్ప ఋషులు చెప్పిన ఆధ్యాత్మిక సత్యాలు కేవలం కొంతవరకు మాత్రమే మోక్షానికి దారి చూపించగలవు. ఈ విషయాన్ని ఒప్పుకుంటే, ఇక ఎవరికీ పెద్దగా ఏ సమస్యా ఉండదు ! అంటే సమాజంలో ఆధ్యాత్మిక విషయాల గురించి జరుగుచున్న వాదోపవాదాలు మరియు నిరంతరం మతం పేరుతో జరుగుచున్న రక్తపాతం ఆగిపోతాయి !

ప్రతి వ్యక్తికి తాను ఆధ్యాత్మికంగా ఏ స్థితిలో వున్నది అవగతం అవ్వాలి ! తను ఏ దిశలో ప్రయాణిస్తున్నాడో స్పష్టంగా తెలియాలి ! అయితే ఈ విషయాన్ని తనకై తాను తెలుసుకోవడం మాత్రం అసంభవం. అంటే ఒక పెద్ద చీకటిగుహలో నుండి బయటపడుటకు దారి వెదకడం వంటిది అన్నమాట ! దీనికి పరిష్కారం ఒక్కటే ! ఆత్మజ్ఞానం పొందివున్న వ్యక్తి యొక్క సహాయం ! అయితే ప్రాపంచికతర్కంతో ఆలోచించినా ఇక్కడ మరొకవిషయం కూడా స్పష్టమవుతుంది. ఎవరైనా వ్యక్తికి తాను ఎప్పటి నుండో దారికోసం వెదుకుచున్న చీకటిగుహలో ద్వారం యొక్క వెలుగు కనిపించింది అనుకోండి ! ఇక ఆ వ్యక్తి అతివేగంగా ఆ ద్వారం వైపు కదలడం జరుగుతుంది. అంతేగాని మిగిలిన వారిని తనతో తీసుకు వెళ్ళుటకు ఆలస్యం చేయడు !

కనుక అటువంటి వ్యక్తి మరొకరికి ఎవరికైనా సహాయం చేయడం అంటే

దానిని కృప చూపించడం అంటారు ! ఈ విషయంలో ఎవరూ అహంతో ప్రభావితం కానవసరం లేదు ! అంటే తాను మోక్షం కోసం మరొకరి కృప అవసరమవుచున్నదని ఆలోచించవలసిన అవసరం ఎంతమాత్రం లేదు ! ఎందుకంటే గురుకృపను దైవికకృప అంటారు ! అంటే స్వయంగా పరాశక్తి ఒక గురువు మాధ్యమంగా కృప చూపించుట అని చెప్పవచ్చును. కనుక స్వచ్ఛమైన మనస్సుతో ఏమాత్రం అహంతో ప్రభావితం కాకుండా ఎవరైనా గురువు దగ్గర శరణు కోరండి ! అంధకారం నుండి వెలుగులోకి తీసుకెళ్లమని ప్రార్థించండి ! ఆ తరువాత ఇక ఎవరూ ఏమీ చేయవలసిన అవసరం ఉండదు.

శరణు కోరిన వ్యక్తి బలవంతంగా అంధకారం నుండి వెలుగువైపు లాగి వేయబడుట జరుగుతుంది.

దీనికి శక్తిపాతం అనే ప్రక్రియ ఉపయోగించబడుతుంది. బహిర్ముఖంగా ధారణ చేయబడుచున్న ఈ జగత్తు వ్యతిరేకదిశలో ప్రేరితం చేయబడుతుంది. గురువు తన శక్తిని ఉపయోగించి అంధకారంలో గానుగరాయి వలె దారికోసం వెదకుచున్న శిష్యునిలో కుండలినీశక్తిని జాగృతం చేయడం జరుగుతుంది. దీనితో తన క్రియాత్మకదిశ నుండి తిరోగమనమై విశ్వశక్తి మానవమస్తిష్కంలో జన్మజన్మల నుండి కూడబెట్టుకుని ఉన్న సంస్కారాలను మరియు వాటికి సంబంధించిన భ్రమపూరితమైన జగత్తును వినాశనం చేయడం ప్రారంభిస్తుంది ! అంటే విలీనం చేయడం ప్రారంభిస్తుంది. కనీసం సమాధి అవస్థ అయినా ప్రాప్తిస్తుంది !

దీనినే యోగాభ్యాసము అంటారు. అయితే సమాధి అవస్థతో యోగము యొక్క ఉద్దేశ్యం సమాప్త మవుతుంది. అంటే దీని తరువాత ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఏ శాస్త్రమూ చెప్పలేదు !

కుండలినీ శక్తి జాగృతం కాకుండా ఎవరిలోనూ అసలు ఏ ప్రక్రియా మొదలుకాదు ! దయచేసి ఈ విషయాన్ని గమనించమని అందరినీ అభ్యర్థిస్తున్నాను.

# బ్రహ్మచర్యం, సన్యాసం మరియు వైరాగ్యం

బ్రహ్మచర్యం పాటించుట, సన్యాసం స్వీకరించుట మరియు కాషాయ వస్త్రం ధరించుట అనేవి అతి ప్రాచీనకాలం నుండి భారతదేశంలో మనుగడలో వున్న సాంప్రదాయాలు. ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించేవారు వీటిని పాటిస్తూ ఉండేవారని ప్రాచీన గ్రంథాల ద్వారా మనకు తెలిసిన విషయమే ! అంతేగాక ప్రస్తుత ఆధునిక కాలంలో కూడా ఈ సాంప్రదాయాలను పాటించేవాళ్లను మనం చూస్తూనే ఉన్నాము. అసలు ఆధ్యాత్మిక మార్గంలో ఉండాలనుకునే వారికి ఇవి అన్నీ అవసరమా? వాటిని పాటించుట వలన కలిగే లాభం ఏమిటి? లేదా ఏ అవసరం లేకపోతే అతి ప్రాచీన కాలం నుండి ఈ సాంప్రదాయాలు కొనసాగుతూ వస్తుండుటకు కారణం ఏమిటి?

"పరాశక్తి" పుస్తకంలో ఈ విషయాలను గురించి క్లుప్తంగా కొంతవరకు విశ్లేషణ చేసాను. అయితే పాఠకులు తెలుసుకోవలసిన విషయ సారాంశాన్ని ముందుగా వ్రాసి ఆ తరువాత విపులంగా చర్చిస్తాను. "పరాశక్తి" పుస్తకాన్ని ఇంతకుముందే చదివి వున్నా పాఠకులకు విషయ సారాంశాన్ని మరొకసారి గుర్తుచేసినట్లు కూడా ఉంటుందని భావిస్తున్నాను.

బ్రహ్మచర్యం, సన్యాసం, కాషాయవస్త్రం మొదలైన సాంప్రదాయాలన్నీ

కేవలం మానవునికి విశ్వశక్తి అయిన మహామాయను క్రియాత్మక దిశ నుండి తిరోగమన దిశ అయిన ప్రళయమార్గంలో ప్రేరితం చేయుటకు ఉపయోగపడే పరికరాలు మాత్రమే ! ఒకసారి ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఇక ఏ అవసరం ఉండదు. ఇది పాఠకులందరికీ నేను కుండ పగులకొట్టినట్లు చెప్పదలచుకున్న విషయం సారాంశం !

ఇక పై విషయాన్ని విపులంగా విశ్లేషణ చేస్తాను.

బ్రహ్మచర్యం పాటించుట అంటే శృంగారభావనకు సంబంధించిన ఆలోచనలను మనసులో రానివ్వకుండా జాగ్రత్త పడుట మరియు దైనందిన జీవితంలో కూడా ఈ విషయానికి దూరంగా ఉండుట. అంతేగాక బాహ్యప్రపంచంలో పరిస్థితుల వలన మనసు ఆకర్షితం కాకుండా లేదా ఆకర్షితం అయినప్పటికీ వెంటనే నియంత్రణలో ఉండేవిధంగా చూసుకోవాలి.

అయితే శృంగార రసం అనేది మానవ శరీరంలో ప్రకృతి సహజంగా ఉద్భవించే భగవంతుని యొక్క సృష్టే కదా ! అని పాఠకులు ప్రశ్నించవచ్చును. ఈ విధంగా చూస్తే అన్నిరకాల ప్రాణులలో ఈ ప్రక్రియను ఏర్పాటు చేయడం జరిగి వున్నది. భూమండలం మీద జీవరాశుల యొక్క మనుగడ కొనసాగించుటకు భగవంతుడు సృష్టించిన ఏర్పాటు ఇది. అంటే శృంగారం అనేది కేవలం ఒక మాధ్యమం మాత్రమే !

ఈ విషయం గురించి క్లుప్తంగా చెప్పాలంటే, భూమండలం మీద మానవజాతి మనుగడ కొనసాగింప చేయుట గురించి భగవంతునికి మానవుని యొక్క సహాయం ఎంతమాత్రం అవసరం లేదని గుర్తుంచుకోవలసినదిగా పాఠకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. అంటే శృంగార ప్రక్రియ తప్పనిసరిగా జరిగితేగాని మానవులు భూమండలం మీద పుట్టుటకు అవకాశం లేదని అనుకోవడం పొరబాటు అవుతుంది. మహాభారతంలో ద్రౌపది మరియు దృష్టద్యుమ్నుడు ఏ విధంగా జన్మనెత్తడం జరిగిందో పాఠకులకు సుపరిచితమే ! కనుక భగవంతునికి మరియు ప్రకృతిలో మానవజాతి కొనసాగింపబడుటకు తామేదో సహాయం చేస్తున్నట్లు మరియు

అందుకే శృంగార ప్రక్రియలో ఆసక్తి చూపిస్తున్నట్లు మానవులు భ్రాంతి చెందనవసరం లేదు ! ప్రతి మానవుడు తన మోక్షం గురించి ఆలోచించుకుంటే సరిపోతుందని విజ్ఞప్తి చేస్తున్నాను. శృంగారమనే ఒక భౌతికమైన ప్రక్రియ కేవలం జీవరాశుల యొక్క మనుగడ కొనసాగింపజేయుటకు భగవంతుడు ఏర్పరచిన మాధ్యమం మాత్రమే. ఈ ఇంద్రియ అనుభూతి అతి మధురమైనది కావడం వలన మానవులు చాలా సులభంగా విశ్వశక్తి అయిన మహామాయ యొక్క ఉచ్చులో అంటే భగవంతుని యొక్క దివ్య విలాసానికి బందీలుగా మారిపోతారు. అంతేగాక, భ్రమపూరితమైన ఈ మధురానుభూతిని ఆస్వాదిస్తూనే గృహస్థ జీవనంలో బందీలుగా ఇరుక్కుపోవడం జరుగుతుంది.

కేవలం శృంగారమనే ఒక చిన్న ఆలోచన కారణంగా మానవుడు భూమండలం మీద గృహస్థ జీవనంలో ఇరుక్కుపోవడం జరుగుతుంది. ఇక ఆధ్యాత్మిక మార్గం అనేది ఎక్కడినుండి వస్తుంది? దీనియొక్క అర్థం గృహస్థులకు మోక్షం పొందుటకు ఇక అవకాశం లేదని కాదు ! అలాగే గృహస్థులు తమ గృహస్థ జీవితాన్ని వదలమని కూడా కాదు ! అయితే అలాంటివారు పాటించవలసిన నియమాలు మాత్రం వేరుగా వున్నాయి.

ఇక శృంగారరసానికి సంబంధించిన ఆలోచనల కారణంగా మానవశరీరంలో ఎలాంటి ప్రక్రియ మరియు పరిణామం జరుగుతుందనే విషయం గురించి పాఠకులకు ఎంతవరకు అవసరమో అంతే వివరిస్తాను. ఈ విషయం గురించి ఇంకా ఎక్కువ తెలుసుకోవాలని ఆసక్తి ఉంటే, పాఠకులు ఇంటర్నెట్ లో వేడుకవచును. ఆధునిక శాస్త్రవేత్తలు సైతం ఈ విషయాన్ని నేటిరోజుల్లో ఒప్పుకొంటున్నారు.

శృంగారపు ఆలోచనలను మనసులో రానివ్వకుండా నియంత్రణ చేసినపుడు, శరీరంలో సాధారణంగా ఉత్పత్తి అయ్యి బయటకు వెళ్ళుటకు సిద్ధంగా వుండే వీర్యం, ఓజస్సుగా మారిపోతుందని ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి. అంటే జననాంగము ద్వారా బయటకు వెళ్లిపోవలసిన వీర్యం ఓజస్సుగా మార్పు చెంది సుషుమ్నానాడి ద్వారా, మెదడు - వెన్నుపాము

వ్యవస్థలో పైకి ఎగబ్రాకుతుందని అర్థం ! ఇది ఒక యోగాభ్యాసకుని ఆధ్యాత్మిక ప్రగతికి చిహ్నం. అలాంటి సాధకుణ్ణి "ఊర్ధ్వరేతస్కుడు" అని శాస్త్రాలు కొనియాడుట జరిగింది. శరీరంలో ఓజస్సు ఊర్ధ్వదిశలో ప్రయాణించుట అంటే స్వయంగా కుండలినీశక్తి తన క్రియాత్మక దిశనుండి మరలి (అంటే జననాంగము ద్వారా బయటకు వెళ్లకుండా) మానవుని యొక్క అంతర జగత్తును విధ్వంసం చేయుటకు ప్రేరితమైనదని చెప్పవచ్చును.

ఈ విషయాన్ని మరికొంచెం వివరంగా వ్రాస్తాను !

మానవశరీరంలో శృంగారపు ప్రక్రియ జరిగినపుడు విశ్వశక్తి తన క్రియాత్మక దిశలో ప్రేరితం అయివుంటుంది. అంటే వీర్యం ద్వారా మరొక ప్రాణి ఈ భూమండలం మీద సృష్టింపబడుట జరుగుతుంది. దీని అర్థం మహామాయ అయిన విశ్వశక్తి లేదా కుండలినీ శక్తి భ్రమపూరితమైన మరొక జగత్తును వ్యక్తిగత స్థాయిలో మరొక ప్రాణిని సృష్టించుట జరుగుతుంది. మానవశరీరం అంటే "పిండాండం" భగవంతుని యొక్క అంటే "బ్రహ్మాండం" యొక్క సూక్ష్మ స్వరూపమేనని అన్ని శాస్త్రాలు చెబుతున్నాయి. కనుక మానవశరీరం నుండి మరొక మానవశరీరాన్ని నిర్మించుట అంటే అది క్రియాత్మకతకు పరాకాష్ట అని చెప్పవచ్చును. కనుక ఈ ప్రక్రియను జరుగనివ్వకుండా కుండలినీ శక్తి ఊర్ధ్వదిశలో మరలినపుడు, సాధకుని యొక్క స్వంత జగత్తునే విధ్వంసం చేయుటకు ప్రేరితం అవుతుంది. అంటే సాధకునికి మోక్షమార్గాన్ని తెరుస్తుంది. కనుక శృంగారపు ఆలోచనలను నియంత్రణ చేయుట ద్వారా కుండలినీ శక్తి యొక్క జాగృతం సులభమవుతుంది. బహుశా ఈ కారణం చేతనే అన్ని మత వ్యవస్థలలో ఆధ్యాత్మిక ప్రగతికి బ్రహ్మచర్యం పాటించమని ఉపదేశించుట జరిగినది. అంతేగాక ఆధ్యాత్మిక ప్రగతితోబాటు, మానవశరీరాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుట జరుగుతుందని ఆధునిక శాస్త్రవేత్తలు సైతం ఒప్పుకుంటున్నారు. ముఖ్యంగా మానవశరీరంలోని ఎముకల వ్యవస్థకు ఓజస్సు యొక్క ఉత్పత్తి ఒక దివ్యమైన ఔషధమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అయితే శృంగారపు ఆలోచనలను నియంత్రించిన మాత్రము చేతనే

మోక్షము వస్తుందని ఏమీలేదు. బ్రహ్మచర్యం పాటించుట అంటే అది కుండలినీ శక్తిని జాగృతం చేయుటకు ఉపయోగించే ఒక విధానము మాత్రమే !

కేవలం శృంగారపు భావన మనసులో ఉత్పత్తి అయినంత మాత్రం చేత ఏ పాపాన్ని ఎవరూ మూటగట్టుకోరు. అలాగే అలాంటి ఆలోచనలను నియంత్రించినంత మాత్రాన ఎవరికీ వెంటనే మోక్షం రాబోదు. కనుక బ్రహ్మచర్యం పాటించే సాధకులందరికీ ఈ విషయాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోమని విజ్ఞప్తి చేస్తున్నాను. సమతుల్యతా భావనతో బ్రహ్మచర్యాన్ని పాటించి, కుండలినీ శక్తిని జాగృతం చేయించవచ్చును. లేనిచో బ్రహ్మచర్యాన్ని పాటించి తాము ఆధ్యాత్మిక దిశలో ఏదో గొప్ప ప్రగతి సాధించామని సాత్విక అహంకారాన్ని మాత్రమే కూడబెట్టుకొనుట జరుగుతుంది.

మానవశరీరంలో కుండలినీశక్తి జాగృతం గావింపబడుటకు ముందు మనసును సమతుల్యతా స్థితిలో స్థిరపరచాలి. ప్రతిమానవుడు మూడు గుణాల మిశ్రమంతో సృష్టింపబడి వున్నాడు. అవి రజోగుణం, తమోగుణం మరియు సత్త్వగుణం. ఈ మూడు గుణాలు సమతుల్యతా స్థితిలో స్థిరపడి ఉన్నపుడే శక్తి జాగృతం సులభమవుతుంది. కనుక బ్రహ్మచర్యం పాటించే సమయంలో సాత్త్విక అహంకారానికి బలికాకుండా జాగ్రత్తపడుట ఎంతో అవసరమని విజ్ఞప్తి చేస్తున్నాను.

అయితే శృంగారపు ఆలోచనల కారణంగా మానవుడు గృహస్థ జీవనంలో ఇరుక్కుపోయేదానికి ఎక్కువగా అవకాశం వున్నది. ఇది పరాశక్తి అయిన కుండలినీశక్తి యొక్క మహామాయ. అందరినీ భ్రమింపజేస్తుంది. శృంగారమనే అతి మధురమైన అనుభూతిని ఎరగా వుపయోగించి మానవుణ్ణి భ్రమపూరితమైన జగత్తులోకి తోసేస్తుంది. అదేవిధంగా ఆధ్యాత్మిక ప్రగతి కోసం సాధన చేస్తున్న గృహస్థుడైన మానవుణ్ణి కూడా భ్రమ నుండి బయటకు రానివ్వకుండా ఎన్నో మానవ బంధాల మధ్యన ఇరికించేస్తుంది. కనుక మానవుని మనసులో వివిధ ఆలోచనలను ప్రేరితం చేయుటకు ప్రతిక్షణం మెదిలే నవరసాలు సంబందించిన ఒకే ఒక రసమైన శృంగారం అనేది ఎంత

అనర్థానికి దారితీస్తుందో ఈ పాటికి పాఠకులు అర్థంజేసుకుని ఉంటారని భావిస్తున్నాను. అయితే గృహస్థులైన సాధకులను భయపెట్టడం నా ఉద్దేశ్యం కాదు. విచ్చలవిడిగా శృంగార భావనను ప్రోత్సహించవద్దని మాత్రమే విజ్ఞప్తి చేస్తున్నాను.

శృంగార భావనతో జరిపే పోరాటం, అంతర జగత్తులో మానవుడు జరిపే ఆఖరి పోరాటం ! ఈ పోరాటంలో గెలిచినపుడే, విజయద్వారం అంటే మోక్షమార్గానికి దారి తెరుచుకుంటుంది.

ఇక సన్యాసం అనే విషయం గురించి విశ్లేషణ చేస్తాను !

సన్యాసం తీసుకోవడం అంటే అందరికీ సుపరిచితమైన ప్రాపంచిక విషయాల నుండి ముక్తి పొందడం అని చెప్పవచ్చును. అంటే ప్రపంచంలో మానవులందరూ మనుగడ సాగిస్తున్న ఈ జగత్తులో ఉంటూనే ప్రాపంచిక వ్యవహారాలకు దూరంగా వెళ్లడం !

సన్యాసం తీసుకొన్నవారు కాషాయ వస్త్రాలు ధరించి సాధారణ జీవనశైలికి దూరంగా వుంటారు. కాషాయ వస్త్రం ధరించుట వలన జనసమాజం కూడా వారిని ప్రాపంచిక విషయాలలోకి లాగకుండా దూరంగా ఉంచుతుంది. ఇంతవరకే అయితే ఇక ఏ సమస్యా లేదు.

కానీ కాషాయ వస్త్రాన్ని ధరించి ఉన్నందువలన ఆ వ్యక్తికి జనసమాజం ఒక కొత్త గుర్తింపుని ఇవ్వడం జరుగుతుంది. ఎక్కువమంది ఆ వ్యక్తిని ప్రత్యేకంగా చూడుట, కొన్ని సందర్భాలలో ఆ వ్యక్తికి గౌరవభావంతో నమస్కరించుట మొదలైన వాటిని చేస్తుంటారు. దీనితో అసలు సమస్య తిరిగి పునరావృతం అవుతుంది. కాషాయ వస్త్రం ధరించి ఉన్న వ్యక్తిలో అహం వికసించుట మొదలవుతుంది. ఎక్కువమంది తనకు నమస్కరించాలని మరియు తనకు ఇంకా ఎక్కువగా గుర్తింపు ఇవ్వాలని ఆకాంక్ష పెరుగుతుంది. ఎవరైనా ఆ వ్యక్తిని గౌరవంగా చూడకపోతే మనసులో క్రోధం పుడుతుంది. ఎవరైనా ఆ వ్యక్తిని చులకన భావనతో చూస్తే సహించలేకపోతాడు. దీనితో అసలు ఏ భావనతో సన్యాసం తీసుకోవడం జరిగినదో అది అణగ త్రొక్కబడుతుంది. అయితే ఇలాంటి పరిస్థితులు ఎలాగూ ఎదురవుతాయి కాబట్టి అసలు

సన్యాసం ఎందుకు తీసుకోవాలి? అని పాఠకులు ప్రశ్నించవచ్చును. సన్యాసం తీసుకున్నంత మాత్రాన మోక్ష మార్గానికి దారి ఏమీ తెరుచుకోదు. అయితే అది యోగాభ్యాసానికి అనువైన పరిస్థితిని ఏర్పరిచేందుకు మాత్రమే పనికి వస్తుందని గ్రహించాలి. అంటే కేవలం ఒక పరికరం లాంటిది ! ఈ విషయాన్ని గ్రహించకపోతే సన్యాస జీవితం మరియు కాషాయ వస్త్రం మానవులకు మోక్షాన్ని ఇవ్వలేవు.

అతి ప్రాచీనకాలం నుండి సన్యాసం తీసుకొని కాషాయ వస్త్రాలు ధరించడం అనే సాంప్రదాయం భారతదేశంలో మనుగడలో వున్నది. జనసమాజానికి దూరంగా ఉండి అడవులలో నివసిస్తూ యోగాభ్యాసం చేసుకునేవారు దుర్గమమైన అడవులలో లభ్యమయ్యే పండ్లు మరియు కందమూలములను తిని బ్రతికేవారు. కొన్ని సందర్భాలలో ఆశ్రమాలకు దగ్గరలో వున్న గ్రామాలకు వెళ్ళి భిక్షాటన చేసి తమకు అవసరమైన ఆహారాన్ని సంపాదించుకునేవారు. ఇక్కడ పాఠకులు గమనించవలసిన విషయం ఒకటి వున్నది.

సన్యాసులు కేవలం తమ శరీరాలను బ్రతికించి ఉంచుకొనుటకు మాత్రమే శ్రమపడేవారు. ఎందుకంటే భౌతిక శరీర మాధ్యమంగానే యోగాభ్యాసం చేయవలసివున్నది కాబట్టి ! వారి అవసరాలన్నీ కేవలం అంతవరకే ఉంటాయి. మిగిలిన సమయాన్ని కేవలం యోగాభ్యాసం చేసుకోవడానికి మాత్రమే వినియోగించేవారు. యోగాభ్యాసం ద్వారా తమ మనసులో ఉవ్వెత్తున ఎగసిపడే భావోద్వేగాలను శాంతిపజేయుటకు ప్రయత్నించేవారు. జనసమాజానికి ఎలాగూ ఎక్కువగా దూరంగా ఉంటారు కాబట్టి ప్రాపంచిక విషయాలేవీ వారి మనసులను ప్రభావితం చేయలేవు. కనుక వారి సన్యాస జీవనశైలి మరియు కాషాయ వస్త్రములు నిరాటంకముగా యోగాభ్యాసం చేసుకొనుటకు చక్కటి మాధ్యమంగా ఉపయోగపడుట జరుగుతుంది.

అయితే ఇలాంటి సన్యాస జీవితాన్ని గడుపుట అంత సులభమేమీ కాదు. ఏదో కొన్ని రోజులు అయితే ఇలాంటి జీవితాన్ని గడపవచ్చు ! దీర్ఘకాలం ఇలాంటి జీవనశైలిలో ఉండుట అంత సులభం కాదు. ఎందుకంటే మనసులో

జన్మ జన్మల నుండి ముద్రితమైవున్న సంస్కారాలు (ఇంద్రియ అనుభూతులు మరియు వాటి జ్ఞాపకాలు) సన్యాసిని ప్రాపంచిక విషయాలవైపు బలీయంగా లాగుతూ ఉంటాయి. ఎన్నో ప్రాపంచిక విషయాల గురించి మనసులో భావోద్వేగాలు కడలి కెరటాల మాదిరి నిరంతరం ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఉంటాయి. వీటిని అన్నింటినీ తట్టుకొని సాధకుడు ఓపికతో సాధన చేయవలసి ఉంటుంది. ఎన్నో సందర్భాలలో ఇక సన్యాస జీవితాన్ని భరించలేక తిరిగి మరలా ప్రాపంచిక జీవితంలో అడుగుపెట్టడం కూడా జరుగుతుంది. ఈ విధముగా జరిగినప్పుడు ఇక యోగసాధనకు దాదాపు స్వస్తి పలికినట్లు అవుతుంది. ఇంతవరకూ ప్రాపంచిక కోరికలను బలవంతముగా అణగత్రొక్కి సన్యాసం జీవితం గడిపి ఉన్నందు వలన, అవి అన్నీ ఒక్కసారిగా సాధకుణ్ణి కబళించివేస్తాయి. వాటి వేగానికి తట్టుకోలేక సాధకుడు మరలా ఎప్పటిలాగే ప్రాపంచిక జీవితంలో ఇరుక్కుపోవడం జరుగుతుంది.

కనుక సన్యాసం తీసుకొని కాషాయ వస్త్రాన్ని ధరించే ముందు ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని బాగా అర్ధం చేసుకుని జీర్ణించుకోవలసి వున్నది. సన్యాస జీవితం నుండి ఒకసారి జారీ క్రిందపడితే మరలా తిరిగి పైకిలేవడం చాలా కష్టమవుతుంది మరియు దీర్ఘకాలం పడుతుంది.

ఇంతవరకూ నేను వివరించినది గాంభీర్యతతో సాధన చేసేవారి గురించి ! ఆధునిక కాలంలో నిజాయితీ లేని సన్యాసులు ఎక్కువైపోయారు. అంటే మనసులో యోగాభ్యాసం మీద ఎలాంటి దృష్టి లేకుండానే కాషాయ వస్త్రములు ధరించి సన్యాసులమని చెప్పుకునేవారు ఎక్కువగా కనిపిస్తూ వుంటారు. ఎక్కడ చూసినా ఆశ్రమాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. యోగసాధన అనే పవిత్రమైన కార్యక్రమాన్ని ఒక వ్యాపారంగా మార్చివేయుట జరుగుచున్నది. కొన్ని సందర్భాలలో దేవీ – దేవతలను సైతం తమ వ్యాపార పరిధి లోకి తీసుకురావడం జరుగుచున్నది. అంటే వారు చేసేది ఒకవైపు వ్యాపారమే అయినా, దానిలో కూడా స్పష్టత ఉండదు. యోగాభ్యాసాన్ని వ్యాపారంగా మార్చారా? లేదా పవిత్రమైన దేవాలయములను వ్యాపార

స్థలాలుగా మార్చారా? అనే విషయం కూడా స్పష్టంగా కనిపించదు. రెండింటినీ కలిపి మరీ వ్యాపారం చేసేవారు కూడా ఎక్కువగా కనిపిస్తూ వుంటారు.

యోగసాధన అనే విషయాన్ని ఎంతటి హీనమైన స్థితికి తీసుకువచ్చారంటే, అసలు ఎవరు సమర్థులైన యోగులో, ఎవరు దొంగ యోగులో అర్థం కాకుండా వున్నది.అంతేకాకుండా ఆధ్యాత్మిక విషయాలకు విరుద్ధమైనవి మరియు ప్రాపంచిక విషయాలకు సంబంధించినవి అయినా శృంగార కార్యకలాపాలు మొదలైన వాటిని నిర్వహిస్తూ జనసమాజంలో యోగాభ్యాసం గురించి చెడ్డపేరు తెస్తున్నారు. యోగసాధనలో ఆసక్తి ఉన్నవారు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థంకాని స్థితికి తీసుకువచ్చారు.

అయితే యోగులలో రెండవ రకానికి చెందినవారు కూడా వున్నారు. ఇలాంటి యోగులు కాషాయ వస్త్రాలు ధరించుటకు నిరాకరిస్తారు. అలాగే సన్యాసం కూడా స్వీకరించరు. జనసమాజం మధ్యన ఉంటూనే, ప్రాపంచిక వృత్తులలో పనిచేస్తూ కూడా నిరాటంకముగా యోగాభ్యాసం చేసుకుంటూ ఉంటారు.

ఇలాంటి యోగులను మానసిక సన్యాసం స్వీకరించినవారు అని చెప్పవచ్చును. రామాయణంలో సీతాదేవి యొక్క తండ్రి అయిన జనకుడు ఈ కోవకు చెందిన యోగి. ఆధునిక కాలంలో ఉజ్జయినీ నగరాన్ని పరిపాలించిన విక్రమాదిత్యుడు కూడా ఈ కోవకు చెందినవాడేనని ప్రసిద్ధి. అయితే ఇలాంటి యోగులకు జగత్తు యొక్క ఇంద్రియ విలాసములు పెద్ద సమస్యగా అడ్డునిలుస్తాయి. నిరంతరం వాటి ఆకర్షణకు బలికాకుండా తప్పించుకుని తిరగవలసి ఉంటుంది. అసలు వీళ్ళు ఇలాంటి పద్ధతి ఎందుకు ఎంచుకుంటారు? అందరిలాగే సన్యాసం స్వీకరించి కాషాయ వస్త్రములు ధరించి జనసమాజానికి దూరంగా వెళ్ళవచ్చు కదా ! అని పాఠకులు ప్రశ్నించవచ్చును.

ఈ విషయాన్ని క్లుప్తంగా వివరించడానికి ప్రయత్నిస్తాను !

ఈ రెండవ రకానికి చెందిన జీవనశైలిలో సన్యాసం స్వీకరించడం అనేది ఉండదు కాబట్టి, జారి క్రిందపడతామన్న భయం ఉండదు. కనీసం మనసులో ఈ భావన నిరంతరం వేధించకుండా ఉంటుంది. అంటే మనసు ఎలాంటి మానసిక వత్తిడి క్రింద లేకుండా యోగాభ్యాసం మీద దృష్టి పెట్టుటకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, దైనందిన జీవితంలో ప్రారబ్ధకర్మల ఫలితాన్ని అనుభవించి సమాప్తం చేయుటకు మంచి అవకాశం కూడా దొరుకుతుంది. అంటే గాంభీర్యతతో మంత్రజపం మరియు తపస్సు లాంటివి ఏమీ చేయకపోయినా, ప్రారబ్ధ ఫలితాన్ని లేదా జీవితంలో అనుభవానికి వస్తున్న సంఘటనలను లేదా వికసిస్తున్న విధిరాతను స్వయంగా అనుభవించి తన మనసులో ఎన్నో జన్మల నుండి సంచితమై ఉన్న సంస్కారాలను సమాప్తం చేయుటకు మంచి అవకాశం దొరుకుతుందని అర్థం ! మొదటి రకానికి చెందిన యోగులకు అడవులలో నివసిస్తున్న కారణంగా ఈ అవకాశం ఉండదు.

నేను మొదట వివరించిన వారిని నివృత్తి మార్గంలో ప్రయాణించే యోగులని అంటారు. అంటే భౌతికంగా ప్రాపంచిక విషయాలను వదిలివేసినవారు. అయితే ఇక కావలసినది మానసిక శుద్ధీకరణ. మనసు అన్ని రకముల ఇంద్రియ అనుభూతులు మరియు జ్ఞాపకాల నుండి శుభ్రపరుచబడవలసి ఉన్నది. రెండవ రకానికి చెందిన వారిని ప్రవృత్తి మార్గంలో ప్రయాణించే యోగులని అంటారు. అంటే భౌతికంగా ప్రాపంచిక విషయాలను ఏమీ వదలకుండా, జనసమాజం మధ్యన ఉంటూనే మనసు యొక్క శుద్ధీకరణ కోసం ప్రయత్నించేవారు ! సాధారణంగా రెండవరకానికి చెందిన యోగులను గుర్తించలేము. వారు సన్యాసం తీసుకుని కాషాయ వస్త్రములు ధరించారు కాబట్టి. అలాంటివారిని గుర్తించుట కష్టముగా ఉంటుంది.

కనుక బ్రహ్మచర్యం మరియు సన్యాసం అనేవి మనసులో జన్మ జన్మల నుండి కూడబెట్టుకొని ఉన్న సంస్కారాలను శుభ్రపర్చుకొనుటకు ఉపయోగపడే రెండు విధానములు మాత్రమే అని గ్రహించాలి !

కేవలం బ్రహ్మచర్యం పాటించినంత మాత్రం చేత మరియు సన్యాసం స్వీకరించినంత మాత్రం చేత ఎవరికీ మోక్షం రాబోదు. అలాగే అలాంటివారు అందరూ తప్పనిసరిగా పూజనీయులని కూడా ఏమీలేదు. అలాగే ఈ సాంప్రదాయాలను పాటించకపోతే మోక్షం రాదనీ కూడా ఏమీ లేదు. అసలు యోగాభ్యాసం వేరు మరియు బ్రహ్మచర్యం, సన్యాసం, కాషాయ వస్త్రముల వంటివి వేరు !

అయితే అతి ప్రాచీనమైనవి మరియు ఎంతో ఉన్నతమైనవి అయిన ఈ గొప్ప సాంప్రదాయాలకు గౌరవంతో తలవంచుతున్నాను మరియు కాషాయ వస్త్రానికి వందనం చేస్తున్నాను !

నేను భారత దేశంలోని కేరళ రాష్ట్రంలో నివసిస్తున్న రోజులవి.

కేరళరాష్ట్రం మొత్తం అరేబియా సముద్రం యొక్క కోస్తా తీరప్రాంతం పొడుగునా విస్తరించి ఉంటుంది. అయితే కొన్ని ప్రదేశాలలో సముద్రం నదివలె లోపలి చొచ్చుకుని వచ్చి ఉంటుంది. అటువంటి వాటిని ఆంగ్ల భాషలో "బ్యాక్ వాటర్స్" అంటారు. చూడటానికి అవి నదులవలె ఉంటాయి. కానీ నీటిప్రవాహం ఏమీ ఉండదు. నీరు అంతా నిలకడగా ఉంటుంది మరియు అది ఉప్పగా వుండే సముద్రజలం ! అయితే కొన్నిప్రదేశాలలో "బ్యాక్ వాటర్స్" యొక్క రెండవ కొన ఏదో ఒక కొండప్రాంతం నుండి బయలు దేరిన నది లేదా వాగుతో కలిసిపోయి కూడా ఉంటుంది. అందువలన అటువంటి "బ్యాక్ వాటర్స్" ఏదో ఒక నది పేరుతో కూడా పిలవబడుతూ ఉంటాయి. అంటే రెండూ కలిసిపోయి ఉంటాయి కాబట్టి దానిని నది అని పిలవవచ్చును లేదా "బ్యాక్ వాటర్స్" అనవచ్చును.

కేరళరాష్ట్రంలోని ఉత్తరభాగాన్ని "మలబార్" ప్రాంతం అంటారు. అలాగే దక్షిణంగా ఉండే ప్రాంతాన్ని "ట్రావెన్ కోర్" అంటారు. ఈ రెండు ప్రాంతాల నడుమ కోడికోడ్ (ఆంగ్లంలో కోజికోడ్) అనే పట్టణానికి దగ్గరలో చలియార్ బ్యాక్ వాటర్స్ లేదా నది ఉంటుంది. ఆ నదికి రెండువైపులా వుండే తీరప్రాంతం అంతా ఎంతో సుందరంగా ఉంటుంది. పచ్చటిచెట్లు మరియు కొబ్బరితోటలతో ప్రకృతి ఎంతో రమణీయంగా ఉంటుంది. ఆ నదీతీరం మీదే

"కోడికోడ్" పట్టణానికి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో "ది రావిజ్ రిసార్ట్స్ అండ్ స్పా" అనే ఒక హోటల్ ఉంటుంది. దాని అంతర్భాగాన నదీతీరం వెంబడి యాత్రికుల కోసం విలాసవంతమైన కుటీరాలు ఎన్నో కట్టబడి ఉన్నాయి.

అది కేరళరాష్ట్రంలోని ఒక విలాసవంతమైన ఆయుర్వేద వైద్య చికిత్సా కేంద్రం. అయితే వైద్యసేవల కోసమే కాకుండా సాధారణంగా విహారయాత్రలకు వచ్చేవాళ్ళు కూడా ఎంతోమంది అక్కడకు వస్తూపోతూ ఉంటారు. వారిలో ఎక్కువసంఖ్యలో విదేశీయులు కూడా ఉండటం గమనించాను.

వృత్తిరీత్యా ఒక పని మీద అక్కడ ఒక వారంరోజులు గడపవలసి వచ్చింది. ఒకరోజు సాయంత్రపు సమయంలో ఆహ్లాదకరమైన ఆ పరిసరాల నడుమ చేయుటకు ఏమీ తోచక అటూఇటూ నడక ప్రారంభించాను. కుటీరాలను చూస్తుంటే ఎంతో సుందరంగా ఉన్నాయి. అంతేగాక అవి నదీతీరాన్ని అంటుకొని ఉన్నాయి. వాటి ఎదుట సుందరమైన చలియార్ నది మరియు చుట్టూ నిశ్శబ్దం రాజ్యమేలుతూ ఉన్నది. కొంచెంసేపు నా మనస్సు ప్రశాంతతతో నిండిపోయినట్లు అనుభూతి చెందాను. ఆ కుటీరాలను చూస్తుంటే ధ్యానం చేసుకొనుటకు అవి ఎంతో అనుకూలంగా ఉన్నాయని తోచినది. జీవితాంతం అటువంటి పరిసరాల నడుమ ఉండిపోగలిగితే బాగుంటుంది కదా అనే ఆలోచన నెమ్మదిగా మనస్సులో మెదలడం ప్రారంభమైనది. అంతేగాక చుట్టూ విస్తరించి ఉన్న రమణీయకరమైన ప్రకృతి మనస్సులో ఏదో చెప్పనలవి కాని ప్రశాంతతను ప్రేరితం చేయుట ప్రారంభించింది.

నిదానంగా నడుస్తూ నా గదికి చేరుకున్నాను. నా గది కుటీరాలకు దగ్గరలోనే ఉండే ఒక భవనము మూడవ అంతస్థు మీద ఉన్నది. నా గదికి వెనుక వైపు పెద్ద బాల్కనీ వంటిది కూడా వున్నది. అయితే అది కప్పు " ఓపెన్ టెర్రాస్" వంటి బాల్కనీ ! తల పైకి ఎత్తిచూస్తే ఆకాశము మరియు ముందుకు చూస్తే సుందరమైన చలియార్ నది కనిపిస్తాయి. అక్కడే వున్న కుర్చీలో

కూర్చొని కళ్ళుమూసుకొని ధ్యానం చేయుట ప్రారంభించాను. కళ్ళు మూసుకోగానే నా చుట్టూ ఉన్న రమణీయమైన ప్రకృతిఅందాలన్నీ క్షణములో మాయమై పోయాయి. నా మనస్సులో ఏదో ఆలోచన మెరుపులా మెరిసినది. ధ్యానం చేసుకునే వాళ్ళు కళ్ళు మూసుకొని అంతరంలో చూస్తారు కదా ! అనిపించింది. అటువంటి వారికి చుట్టూ వుండే సుందరమైన ప్రకృతితో పని ఏమిటి ? కళ్ళు తెఱచి ఉన్నప్పుడు మాత్రమే అంటే ఇంద్రియాలు బాహ్యంగా చూస్తున్నప్పుడే ప్రకృతి అందము కనులకు విందు చేయును. కళ్ళు మూసుకోగానే దర్శనం అయ్యేది మనస్సులో విస్తరించి ఉన్న అంధకారము ! అంతరంలో వ్యాపించి ఉన్న ఆ అంధకారమును విచ్ఛిన్నం చేయుటకు అసలు ధ్యానం అనేదానిని అభ్యాసం చేయుట జరుగుతుంది. మనస్సు సమాధిస్థితిలో స్థిరపడుట మొదలైన ప్రారంభికదశలో సూర్యుని వంటి ప్రకాశము యొక్క వెలుగురేఖ ఆ అంధకారాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ మొదలవుతుంది. కనుక అటువంటి యోగసాధనకు సుందరమైన ప్రకృతి పరిసరాల అవసరం ఎంతమాత్రం లేదు ! అయితే కొంచెంసేపు క్రితమే ఆ రమణీయమైన పరిసరాలు మరియు స్వచ్ఛమైన నిశ్శబ్దమే నా మనస్సులో ధ్యానం చేసుకోవాలనే కోరికను ప్రేరేపితం చేయుట జరిగినది.

దీనిఅర్థం ఏమిటంటే కొన్నిప్రదేశాలు మరియు కొన్నికాలాలు మనస్సులో రాపిడి జరుపుట వలన చిత్తాన్ని అంతరం వైపు ప్రేరితం చేయుట జరుగుతుంది. అంతే తప్ప సాధన్ చేసుకొనుటకు ప్రత్యేకంగా అనువైన ప్రదేశం అంటూ ఏమీ ఉండదు. అలాగే ప్రత్యేకంగా అనువైన సమయమూ ఉండదు. అయితే శక్తి అంతరం వైపు ప్రేరితం కానివారిలో సుందరమైన ప్రదేశాలు లేదా నిశ్శబ్దంగా ఉండే పరిసరాలు మరియు సంధ్యాకాలాలు కేవలం సాధన చేసుకొనుటకు పరికరాలుగా మాత్రం ఉపయోగపడతాయి. వాటి ఉపయోగము అంతవరకే ! అంతరంలో కడలికెరటాల వలె చెలరేగే ఆలోచనలు నిర్మలం కావాలంటే మనస్సు తన అంతరం మీద దృష్టిని మరలించాలి. ఇది ఎలా ఉంటుందంటే అద్దంలో మనం మన ప్రతిబింబాన్ని చూసుకున్నట్లు ఉంటుంది. అంతే తప్ప నిశ్శబ్దంగా వుండే సుందరమైన

ప్రదేశాలు మరియు సంధ్యాసమయాలు మనస్సుని నిర్మలం చేయలేవు.

ఏది ఏమైనా యోగసాధన అనేది అంతరజగత్తులో జరిగే ప్రక్రియ ! బాహ్యజగత్తుతో దానికి ఎటువంటి సంబంధం లేదు ! ఏ మానవునికైనా తన అంతరజగత్తే బాహ్యజగత్తుగా అనుభూతికి వస్తుంది. కనుక ఆ అంతరజగత్తు మీద దృష్టిని నిలుపుట ముఖ్యము.

ఈ సందర్భంగా పాఠకులందరికీ ఒక విషయాన్ని విజ్ఞప్తి చేయదలచుకొన్నాను.

యోగసాధన అనే సుదీర్ఘయాత్రలో ప్రయాణం చేస్తున్నప్పుడు అన్నివేళలా గమ్యాన్ని గురించి మాత్రమే ఆలోచించవలెను. యోగసాధనలోని గమ్యం మనస్సుని నిర్మలం చేయడం. అయితే అంతమాత్రంచేత మోక్షము ఏమీ రాబోదని మరొకసారి పాఠకులందరూ గుర్తుంచుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. మనస్సు ఏ ఆలోచనా లేకుండా నిర్మలంగా మారినపుడు, అంతరంలో విరాజమానమైవున్న ఆత్మకు తన ప్రతిబింబం మాత్రమే గోచరిస్తుంది. ఆ తరువాత ఏమి జరుగుతుందనేది కేవలం పరబ్రహ్మం లేదా భగవంతుని అధీనంలో మాత్రమే ఉంటుంది. ఆ స్థితిలో యోగనియమాలు సైతం విచ్ఛిన్నం అవుట జరుగుతుంది. కావున ప్రతి యోగసాధకుడు కేవలం సమాధిస్థితిని పొందడం అనే గమ్యం మీద మాత్రమే దృష్టిని నిలుపవలెను. సుందరమైన ప్రదేశాలు, సంధ్యాసమయాలు అలాగే పుణ్యక్షేత్రాలు లేదా ఆధ్యాత్మికకేంద్రాలు ఏవీ ఆ స్థితికి ఎవరినీ తీసుకువెళ్ళలేవు.

ఇంకా చెప్పాలంటే అలాంటివి అన్నీ కేవలం ప్రారంభికస్థితిలో, అదీ కొంతవరకు మాత్రమే పనికివస్తాయి. కనుక నిజాయితీగా యోగసాధన చేయాలనుకునే వారు ఇటువంటి విషయాలమీద దృష్టిని సారించకూడదు. ప్రాచీనపురాణాలు మరియు యోగశాస్త్రాలు సైతం ఈ విషయాన్ని నొక్కి మరీ చెబుతున్నాయి. దుర్గమమైనఅడవులలో మరియు మంచుకొండలలో నివశిస్తూ, జనసమాజానికి దూరంగా ఉంటూ, సౌకర్యవంతమైన జీవనశైలిని వదిలి యోగాభ్యాసం చేసిన యోగుల గురించిన ఉదాహరణలు ఎన్నో మనకు ఆదర్శంగా ఉన్నాయి. ఆ గొప్ప యోగుల నుండి ప్రేరణ పొందమని విజ్ఞప్తి

చేస్తున్నాను.

అయితే ఇక్కడ పాఠకులు ఒక ప్రశ్న వేయవచ్చును. నేను "పరాశక్తి" గ్రంథంలో వివరించినట్లు యోగులు రెండురకములుగా ఉంటారు. అన్నీ వదిలేసిన సర్వసంగ పరిత్యాగులు మరియు ఏమీ వదలనివారు. కనుక రెండవమార్గంలో ప్రయాణించే యోగులకు నేను పైన వివరించిన విషయాలు వర్తించవు కదా ! అని ప్రశ్నించవచ్చును. ఇక్కడ నేను చెప్పదలచుకున్నది ఒకే ఒక విషయం !

అది యోగసాధకుని నిజాయితీ మీద ఆధారపడి ఉంటుంది. అయితే మహామాయ యొక్క భ్రమింపజేయు శక్తిని తక్కువగా అంచనా వేయకండని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ విషయాన్ని గురించి మరి కొంచెం వివరంగా వ్రాస్తాను !

కొంతమంది యోగసాధకులు తాము రెండవరకానికి చెందిన యోగులమని భ్రమపడే అవకాశం ఉన్నది. అంటే తాము జనసమాజం మధ్యలోనే నివశిస్తూ , గృహస్థుజీవనం కొనసాగిస్తూ, అన్ని ఇంద్రియసౌఖ్యాలు అనుభవిస్తూ యోగాభ్యాసం చేసేవాళ్లమని అనుకోవచ్చును. అటువంటివారికి నేను ఒక విషయాన్ని విజ్ఞప్తి చేయదలచుకొన్నాను. అది యోగసాధకుని నిజాయితీ మీద ఆధారపడి ఉంటుంది. ఇంద్రియసౌఖ్యాలకు బానిసగా మారి ఆ విధంగా ఆలోచిస్తున్నారా లేదా నిజాయితీతో మనస్సు ఆ విధంగా ప్రవర్తిస్తున్నాదా ? అనే విషయాన్ని తేల్చండి. దీనికి సులువైన ఉపాయం గురుదేవుని శరణుకోరడం ! గురుదేవునికి తన శిష్యుని యొక్క అంతరికపరిస్థితి క్షుణ్ణంగా తెలిసి ఉంటుంది కాబట్టి ఆయన చెప్పినట్లు చేయడం శ్రేయస్కరం !

వృత్తిరీత్యా ఒకసారి కొచ్చి (పూర్వం కొచ్చిన్) అనే నగరానికి వెళ్ళవలసి వచ్చింది. మొత్తం మూడు రోజుల యాత్ర అది. కొచ్చి నగరంలో రెండు రాత్రులు గడపవలసి వచ్చింది. నేను వెళ్ళినది వృత్తిరీత్యా కనుక అన్ని అధికార లాంఛనాలతో యాత్ర కొనసాగింది. నగరంలోని ఒక ఖరీదైన హోటల్లో బస ఏర్పాటు చేయడం జరిగినది. నేను బస చేసివున్న హోటల్ ఒక ఖరీదైన

షాపింగ్ మాల్ (దుకాణాల సముదాయం) యొక్క ప్రాంగణంలో ఉన్నది. అది భారత దేశంలోని అతి పెద్ద షాపింగ్ మాల్ అని చెబుతారు. కొచ్చి నగరంలో రెండవ రోజు మధ్యాహ్న సమయానికి నేను వెళ్లిన పని పూర్తయినది. అయితే తిరుగు ప్రయాణం మాత్రం మరుసటి రోజు ఉదయానికి నిర్ణయింపబడి ఉన్నది. అప్పటికి నేను దాదాపు రెండు సంవత్సరాల నుండి కేరళ రాష్ట్రంలో వృత్తి రీత్యా నివసిస్తున్నాను. ఈ షాపింగ్ మాల్ గురించి బాగా విని ఉన్నాను. అంతేగాక మరికొన్ని రోజులలో దీపావళి పండుగ కూడా రానున్నది! నేను ఎలాగూ ఖాళీగానే ఉన్నాను కనుక, దీపావళి పండుగ సందర్భంగా ఏవైనా క్రొత్త బట్టలు లేదా వస్తువులు కొనవచ్చనే ఉద్దేశ్యంతో నా హోటల్ గది నుండి బయటపడి షాపింగ్ మాల్ వైపు అడుగులు వేసాను.

అది ఒక సువిశాలమైన షాపింగ్ మాల్. నాకు తరువాత తెలిసినది. అది 17 ఎకరముల స్థలంలో నిర్మితమై ఉన్నదని! ఎటు చూసినా విలాసవంతంగా నిర్మితమై ఉన్న పెద్ద పెద్ద దుకాణములు. వస్తువులు కొనుగోలు చేయడానికి వచ్చిన జనం యొక్క కోలాహలంతో బాగా రద్దీగా ఉన్నది. నేను వెళ్ళినది సాయంత్ర సమయం అవడం వలన జనం యొక్క రద్దీ సాధారణంగా ఉండే దానికన్నా ఎక్కువగానే ఉన్నది. ఎక్కువమంది జనం కుటుంబాలతో సహా షాపింగ్ చేయడానికి వచ్చి ఉన్నారు. ఇక నా విషయానికి వస్తే, నేను ఒంటరిగా వచ్చి ఉన్నాను. షాపింగ్ చేయడానికి బోలెడంత సమయం ఉన్నది. షాపింగ్ చేసిన తరువాత ఎక్కడికీ ప్రయాణం చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఆ షాపింగ్ మాల్ యొక్క ప్రాంగణంలోనే నేను ఉంటున్న హోటల్ ఉన్నది కాబట్టి. షాపింగ్ చేయడానికి అంతకంటే అనువైన ప్రదేశం మరియు సమయం దొరకవని అనిపించింది. మనసులో చాలా ఉల్లాసంగా ఉన్నట్లు అనుభూతి చెందాను. ఏమేమి వస్తువులు కొనాలో, వాటిని గురించి పెద్దగా ఆలోచన చెయ్యదలచు కోలేదు. మనసు ఏ విధంగా ప్రేరితం అయితే ఆ విధంగా షాపింగ్ చెయ్యవచ్చని నిర్ణయించుకొని ఉన్నాను. అయితే కొనదలచుకున్న కొన్ని వస్తువుల యొక్క జాబితా మాత్రం మానసికంగా తయారుచేసి ఉంచాను.

నాకైతే స్వప్న ప్రపంచంలో తిరుగుచున్న అనుభూతి కలగడం ప్రారంభమైనది. ఎటుచూసినా ఖరీదైన బట్టల దుకాణాలు, నగల దుకాణాలు, తినుబండారాలు అమ్మే దుకాణాలు, నిత్యావసర వస్తువులు విక్రయింప బడుచున్న దుకాణాలు మరియు ఇంకా ఇతర ఎన్నో రకముల దుకాణాలతో సందడిగా ఉన్నది. అకస్మాత్తుగా పండ్లు-కూరగాయలు అమ్మే ప్రాంతానికి చేరుకున్నాను. తాజాగా ఉన్న ఎన్నో రకముల పండ్లు మరియు కూరగాయలు నా కళ్ళకు విందు చేస్తూ దర్శనమిచ్చాయి.

అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏమంటే అక్కడ దొరికే పండ్లు మరియు కూరగాయలలో ఉన్న భిన్నత్వం (వెరైటీ)! అంతేగాకుండా మిగిలిన అన్ని వస్తువులకు ఈ విషయం వర్తిస్తుంది. ఇది భారత దేశంలోని అతి పెద్ద షాపింగ్ మాల్ అనే విషయం గుర్తుంచుకోవలసిందిగా పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే పైన నేను వివరించిన దుకాణములు ఎక్కడైనా ఉంటాయి. అయితే ఇది విశేషమయిన షాపింగ్ మాల్ అవుట చేత ఇక్కడ అన్ని రకముల వస్తువులు దొరుకుతాయి. అంటే విశేషంగా ఏదైనా వస్తువు కొనాలనుకుంటే ప్రపంచంలో లభ్యమయ్యే ఆ వస్తువు యొక్క అన్ని అవతారాలు ఇక్కడ దర్శన మిస్తాయని అర్థం!

దాదాపు మూడు గంటల సేపు ఆ షాపింగ్ మాల్ అంతా కలియ తిరిగాను. ఆ మాల్ లో ఉన్న అన్ని అంతస్థులూ ఎక్కి, అన్ని దుకాణాలను బయటి నుండి తిలకించాను. కొన్ని దుకాణాలలోనికి వెళ్లి లోపల ఉన్న వస్తువులను కూడా పరిశీలించాను. అయితే ఏ వస్తువు కొనడానికి నా మనసు ప్రేరితం కాలేదు. ఏ వస్తువు నాకు పెద్దగా అవసరం ఏమీ లేదనిపించింది. కొన్ని వస్తువులను కొనాలని ముందే మానసికంగా నిర్ణయించుకొని ఉన్నాను. అయితే ఆ వస్తువులను చుసిన తరువాత మాత్రం అవేమీ నాకు పెద్దగా అవసరం లేదనిపించింది. ఈ విధంగా నాకు జీవితంలో ఏ వస్తువుతో పెద్దగా అవసరం ఏమీ లేదనే విషయాన్ని అనుభూతి చెందడం ప్రారంభించాను. నేను మామూలుగా ఉపయోగించే బట్టలు మొదలైనవి ఎక్కడైనా కొనవచ్చును కదా! అని అనుభూతి చెందడం జరిగింది. మరీ అవసరం అనుకున్నపుడు ఎక్కడైనా

కొనవచ్చనే ఆలోచన రావడంతో, ఒక్కసారిగా ఆ షాపింగ్ మాల్ మీద నాకున్న ఆసక్తి మరియు మక్కువ అంతా ఎగిరిపోవడం ప్రారంభమయినది.

అయితే అంత పెద్ద షాపింగ్ మాల్ లో ఇంతవరకూ ఒక్క వస్తువు కూడా కొనలేదనే ఆలోచన నాకు స్ఫూరణకు వచ్చేసరికి దాదాపు రెండు గంటలకంటే ఎక్కువ సమయం గడిచి పోయినది. ఈ విషయం నాకు స్ఫూరణకు వచ్చేసరికి నాకు ఒకింత ఆశ్చర్యం కూడా వేసింది. ఇంతలో ఆ షాపింగ్ మాల్ అంతా తిరిగి తిరిగి ఉన్నందువలన కొంచెం అలసట కూడా అనుభూతి చెందడం ప్రారంభించాను.

ఏ వస్తువు మీద మనసు ఆకర్షితం కానప్పుడు నేను ఏమి చేయాలి? అంతలో తినుబండారాలు అమ్మే దుకాణాల సముదాయం ఒకటి ఎదురు పడింది. ఆ సమయంలో నేను షాపింగ్ మాల్ చివరి పై అంతస్థు మీద ఉన్నాను. అయితే ఏమీ తినడానికి నా మనసు ప్రేరితం కావడం లేదు. మరికొంచెం సేపటి తరువాత నేను నా హోటల్ గదికి వెళతాను. ఎలాగూ రాత్రి భోజనం చేయబోతున్నాను. ప్రస్తుతం ఆకలి పెద్దగా ఏమీ లేదు. ఈ కారణం చేత అక్కడ ఉన్న అన్ని తినుబండారాల దుకాణాలు నా జిహ్వాను ప్రేరితం చేయలేక పోయాయి.

ఒకవేళ మనసు దేనిమీదనైనా ఆకర్షితం అవుతుందేమోనని మరొకసారి దుకాణాలన్నింటినీ పరిశీలిస్తూ క్రింది అంతస్థుకు చేరుకున్నాను.

అన్ని అంతస్థులలో ఎస్కలేటర్లు (మరమెట్లు) ఏర్పాటు చేసి ఉన్నందువలన, ఎక్కి దిగడానికి నేనేమీ శ్రమ పడవలసిన అవసరం లేకుండా పోయింది. అందువలన సునాయాసంగా క్రింది నుండి పైకి, మరలా పై అంతస్థు నుండి క్రింది అంతస్తుకు సునాయాసంగా చేరుకుంటూ, దుకాణాలను పరిశీలిస్తూ, నా మనసు దేనిమీదనైనా ఆకర్షితం అవుతుందేమోనని ఆత్మ శోధన చేసుకుంటూ, అలా తిరుగుతూ ఉండిపోయాను.

అయితే అసలు విషయం అర్థమయ్యేసరికి మరొక గంట గడిచిపోయింది. అంటే దాదాపు మూడు గంటల నుండి నేను కలియ తిరిగింది బాహ్య జగత్తులోని ఆ షాపింగ్ మాల్ లో కాదు! నా అంతర

జగత్తులోని కోరికల అడవిలో! నా అంతర జగత్తే ఆ షాపింగ్ మాల్ రూపంలో ప్రతిబింబిస్తున్న విషయం అని అవగతమయింది.

కొన్ని దుకాణాలను పరిశీలించినపుడు, నా బాల్యము మరియు యవ్వనం గుర్తుకు వచ్చాయి. ఆ వయసులో నేను ఏ కోరికలతో సతమతమయ్యేవాడినో అవన్నీ స్ఫురణకు వచ్చాయి. అయితే ఆ రోజులలో సరిపోయినంత ధనం లేకపోవడం చేత మరియు అవకాశం లేకపోవడం చేత ఫలించని ఆ కోరికలన్నీ నిగూఢంగా నా అంతరంలో ముద్రింపబడి ఉన్నాయి. అయితే నేటికి అన్ని పరిస్థితులూ అనుకూలంగా కలసివచ్చినా కూడా నా మనసు మాత్రం వాటి మీదకు ఆకర్షితం కావడం లేదు. అయితే వాటి అవసరం పూర్తిగా తొలగిపోయిందని కాదు! కేవలం ఆ వస్తువుల మీద పెంచుకొని ఉన్న మమకారం మాత్రం ఆవిరపోయింది!

ముఖ్యంగా ఆ షాపింగ్ మాల్ లో కలియ తిరుగుతున్న ఆఖరి నిమిషాలలో నా మనసులో మెదిలిన ఆలోచన ఒకటే! అది ఈ జగత్తుకి శాశ్వతంగా నేను ఇస్తున్న శెలవు! అని. ఆఖరిసారిగా అన్ని ప్రాపంచిక విషయాలకు నేను పలుకుతున్న చరమ గీతం! అని.

ఇది అంతర జగత్తులోని నా ఆఖరి పోరాటం!

ఈ విషయాన్ని ఇంకా లోతుగా విశ్లేషణ చేసి చూస్తే మరొక విషయం తేటతెల్లమవుతుంది. షాపింగ్ మాల్ లో దాదాపు అన్ని రకాల వస్తువులూ దొరుకుతాయి. ఒక విధంగా చూస్తే మన అంతరంలోని కోరికలన్నీ కవ్విస్తూ కనిపిస్తాయి. ఉదాహరణకు బొమ్మలు విక్రయించే ఒక పెద్ద దుకాణానికి చేరుకున్నాను. లోపలికి వెళ్లి బొమ్మలను పరిశీలించడం కూడా జరిగింది. వివిధ వయస్సులలోని పిల్లలకు సంబంధించిన బొమ్మలు ఉన్నాయి. నా బాల్యం కూడా గుర్తుకు వచ్చింది. ఒకప్పుడు అలాంటి వస్తువులు మరియు బొమ్మలంటే నాకెంతో మక్కువగా ఉండేది. కాని నేడు వాటిని కేవలం తిలకిస్తూ మౌనంగా ఉండిపోయాను. అలాగే మరొక బట్టల దుకాణానికి చేరాను. అక్కడ ఎన్నో రకాల బట్టలు అన్ని వయసుల వారికి సరిపోయేవి ప్రదర్శన చేసారు. అయితే ఒకప్పుడు అలాంటి ఖరీదైన బట్టలు ధరించాలని

ఉండే కోరిక నేడు లేదు. అసలు అలాంటి ఆసక్తి మనసులో కలుగుట లేదు. అంటే ఇక్కడ మారింది నా ఆర్థిక స్థితి ఒక్కటే కాకుండా నా మనస్సు కూడా!

ఇది ఎలా ఉంటుందంటే, ఉల్లి పొరలు తొలగినట్లు మనసు మీద కప్పబడిఉన్న కోరికలనే పొరలు ఒక్కక్కటి తొలగి పోతుంటాయి. ఒక వయస్సులో, కొన్ని పరిస్థితుల మధ్యన బలీయంగా ఆవరింపబడి ఉండిన కోరిక ప్రస్తుతం విడిపోవచ్చును.

కొచ్చి నగరంలోని ఆ షాపింగ్ మాల్ లో నేను దర్శించినది బాహ్య జగత్తులోని ప్రాపంచిక విషయాలను కాదు! నా అంతరంలో పేరుకొని ఉన్న కోరికల కారడవిని! అయితే ఆ ఇంద్రియ సంస్కారాలకు సరైన బలం లేకపోవుట చేత, నా చేత ఏ వస్తువునూ కొనిపించలేక పోయాయి. అంతర శక్తి జాగృతం అయివున్నందువలన ఆ ప్రాపంచిక విషయాలను నా ముందు ప్రదర్శితం చేసి ఇంద్రియాల అనుభూతులను మరియు వాటి జ్ఞాపకాలను శుద్ధి చేయడం జరిగింది.

అంతర శక్తి సృష్టి రచన విధ్వంసక దిశలో క్రియాశీలమై ఉన్నపుడు అంతర జగత్తును ఈ విధంగానే విలీనం చేయడం జరుగుతుంది. బాహ్య జగత్తు అనేది ఎలాగూ ఒక వ్యక్తి యొక్క అంతర జగత్తు ప్రతిబింబమే! అంటే ఆ వ్యక్తి అంతరంలో కూడబెట్టుకొని ఉన్న సంస్కారాల రాశి బాహ్య జగత్తులో ఏదొక రోజున ఈ విధంగా దర్శనమిస్తుంది. నా విషయంలో కూడా కొచ్చి నగరంలో అదే జరిగింది. నేను వృత్తి రీత్యా కొచ్చి నగరం వెళ్లడం అనేది కేవలం సంస్కారాల శుద్ధీకరణకు జాగృత అంతర శక్తి ఏర్పాటు చేసిన మాధ్యమం మాత్రమే! విశ్వశక్తి జ్ఞానవతి అవుటచేత సంస్కారాల శుద్ధీకరణను ఏ విధంగా జరిపించాలి అనే విషయాన్ని తానే స్వయంగా నిర్ణయించడం జరుగుతుంది. అయితే ఈ విషయం నాకు అవగతమయ్యే సమయానికి ప్రకటితమయ్యే క్రియకుడా సమాప్తమవుట జరిగింది. అంటే నా విషయంలో జరిగిన షాపింగ్ మాల్ సంఘటన కేవలం ఒక క్రియ మాత్రమే! అయితే అది మొలకెత్తబోతున్న వైరాగ్యమనే వృక్షం యొక్క తొలి చిగురాకు.

# చివరిమాట

భగవంతునికి ప్రత్యకంగా ఏదైనా ఓనమాలతో సంబంధం ఉంటుందా అని నా గురుదేవులు ఒకరోజు యధాలాపంగా పలికిన మాటలు నా అంతరంలో నేటికీ నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి !

"పరాశక్తి" గ్రంథంలో నేను వివరించిన విధంగా అన్ని శాస్త్రములు, మతములు, పూజలు, తాంత్రికవ్యవస్థలు మొదలైనవి పరబ్రహ్మాన్ని తెలుసుకునేందుకు కేవలం మాధ్యమం మాత్రమే అవుతాయి. అలాగే భాషలు కూడా ! ఎంత గొప్ప భాష అయినా చివరికి అది కూడా కేవలం ఒక మాధ్యమం మాత్రమే అవుతుంది. సంస్కృతభాష వర్ణమాల ఆధారంగా మంత్రశాస్త్రం నిర్మితమై ఉండవచ్చును గాక ! లేదా మంత్రశాస్త్రం ఆధారంగా అనంతమైన విశ్వం సృష్టిరచన చేయబడి ఉండవచ్చును గాక ! లేదా అనాది నుండి సృష్టినిర్మాణానికి బ్రహ్మదేవుడు ఉపయోగిస్తున్న వేదములు శాశ్వతమై నిలువుగాక ! అన్నీ కలిసి పరబ్రహ్మాన్ని తెలుసుకునేందుకు కేవలం ఒక మాధ్యమం మాత్రమే అవుతాయి.

అలాగే సంస్కృతభాష వర్ణమాలలోని ప్రతి అక్షరం ఒక బీజమంత్రం అయివుండవచ్చు గాక ! ప్రతి బీజమంత్రం ఒక శక్తిస్వరూపం అయివుండొచ్చు గాక ! ఈ సువిశాల అనంతవిశ్వం మొత్తం స్వయంగా పరాశక్తి అయివుండొచ్చు గాక !

అంతా ఒక మహామాయ !

సంస్కృతభాష ప్రత్యేకంగా భగవంతునితో సంబంధం కలిగివున్నదా లేదా భగవంతుడు ప్రత్యేకించి ఏదైనా ఒక ఓనమాలతో సంబంధం కలిగివున్నాడా లేదా అనే ప్రశ్న కేవలం భ్రమపూరితమైనది మాత్రమే !

అయితే మానవజాతి ఈ భ్రమపూరితమైనజగత్తులో మనుగడ సాగించినంతవరకూ ఎన్ని యుగాలు గడిచిపోయినా వేదాలు, శాస్త్రాలు, దేవతలు, మంత్రాలు కూడా శాశ్వతంగానే ఉంటాయి. భ్రమ తొలగిన మరుక్షణం ఇవి అన్నీ క్షణంలో మాయమవుతాయి. మానవుడు సచ్చిదానంద స్వరూపుడై ఒంటరిగా మిగిలిపోతాడు ! ప్రాచీనశాస్త్రాలు మానవజాతికి ఇస్తున్న వాగ్దానం ఇది !

అనంతవిశ్వం అనే పదానికి అసలు అర్ధమే మిగలదు!

చివరికి ఈ పుస్తకానికి సైతం ఈ సిద్ధాంతం వర్తిస్తుంది!

# పదకోశం

ఆజ్ఞ చక్రము – మానవుని యొక్క శరీరంలో రెండు కనుబొమ్మల మధ్య కేంద్రీకృతమై ఉన్న ఒక శక్తి కేంద్రం.

అనాహత చక్రము – మానవుని యొక్క శరీరంలో వెన్నెముక మీద హృదయం ఉన్న ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్న ఒక శక్తి కేంద్రం.

అన్నమయ కోశం – ఇది జీవాత్మను కాపీ నుంచి ఉన్న ఐదవ ఆవరణ. దీనితో భౌతికమైన మరియు స్థూలమైన మానవ శరీరం నిర్మితమవుతుంది.

ఆనందమయ కోశం – ఇది జీవాత్మను కప్పి ఉంచిన మొదటి ఆవరణ. దీనిని మాయ అంటారు. ఈ స్థితిలో విశ్వశక్తి సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రాథమిక స్థాయిలో ఉంటుంది. అందువలన దీనిని ఆదిపరాశక్తి అంటారు.

ఆశ్రమము – గురువు నివసించే ప్రదేశం. ఆయన పర్యవేక్షణలో శిష్యులు యోగసాధన చేస్తుంటారు.

బ్రహ్మం – పరాశక్తి సహితం అనంతమైన విశ్వమంతా వ్యాపించి ఉన్న విశ్వాత్మ మానవుని యందు దీనిని ఆత్మ అంటారు.

బుద్ధి – మానవుని శరీరంలో ఉంటుంది. దీనిని సంస్కృత గ్రంథాలలో మహత్ అని కూడా అంటారు. మానవునిలో వివేకం అనేది ఇక్కడి నుండే పుడుతుంది మానవుని యొక్క హం కూడా దీని ప్రక్కనే ఉంటుంది.

చిత్తం – మానవుని యొక్క మనస్సు. మానవ శరీరంలో అన్ని కేంద్రాలకు

కేంద్రం. మానవుడు సంకల్పం మరియు వికల్పం చేసేది కూడా ఇక్కడే.

చిత్త శక్తి - మానవ శరీరంలో మనసులో నిండి ఉండే విశ్వశక్తి యొక్క రూపం.

చక్రము - మానవ శరీరంలో మెదడు వెన్నుపాము వ్యవస్థలో ఉండే శక్తి కేంద్రం.

గురువు - మానవుని మనస్సులో నుండి చీకటిని లేదా అజ్ఞానాన్ని పారద్రోలే గొప్ప మానవుడు. దీనివలన మానవుని అంతరం లోనే విరాజిల్లుతున్న జ్ఞానం స్వయంప్రకాశం అవుతుంది.

గుణాలు - మానవ శరీరంలో మనస్సు అనేది మూడు గుణాలు పదార్థంతో తయారు చేయబడినది. వాటిని రజోగుణము తమోగుణము మరియు సత్వగుణము అంటారు.

కారణ శరీరం - మాయతో కప్పబడిన జీవాత్మ.

క్రియ - మానవుని మనస్సులో కూడివున్న ఇంద్రియాల అనుభూతులను మరియు వాటి జ్ఞాపకాలను తుడిచి వేసేందుకు మానవుని శరీరంలో మనసులో మరియు దైనందిన జీవితంలో శక్తి ప్రేరణతో వ్యక్తమయ్యే ప్రక్రియ.

కుండలినీ శక్తి - విశ్వం గా అవతరించే పరాశక్తి. మానవ శరీరంలో మెదడు - వెన్నుపాము వ్యవస్థ క్రింది భాగాన గుదము మరియు జననేంద్రియముల నడిమధ్యన కేంద్రీకృతమై ఉంటుంది.

కుంభమేళ - భారతదేశంలో గంగానదీతీరాన 12 సంవత్సరాలకొకసారి జరుపుకునే నది ఉత్సవం.

మనోమయ కోశం - ఇది జీవాత్మను కప్పివుంచే మూడవ ఆవరణ. మనస్సు మరియు అన్ని ఇంద్రియాలకు కేంద్రం. ఈ కోశంలో మానవుడు సంకల్పం మరియు వికల్పం వంటివి కూడా చేయడం జరుగుతుంది.

మాయ - మాయ శక్తి. విశ్వ శక్తి యొక్క ఆది స్వరూపం.

మణిపూరక చక్రము - ఇది మానవ శరీరంలో నాభి ప్రాంతంలో వెన్నెముక మీద ఉండే శక్తి కేంద్రం.

మణిద్వీపం - ప్రాచీన సంస్కృత గ్రంథాల ప్రకారం ఇది అనంతమైన విశ్వంలో

విశ్వశక్తి లేదా పరాశక్తి నివాసం ఉండే ప్రదేశం. అనంతమైన విశ్వంలో లెక్కకుమించి ఉన్న బ్రహ్మ తరువాత మరియు వాటికి చాలా దూరంగా పాలసముద్రం లేదా ఆనంద సాగరం నడి మధ్య ఉండే ద్వీపం.

మంత్రము – ఇది సంస్కృత భాషలోని ఒక అక్షరం లేదా పదం లేదా వాక్యం లేదా వాక్యాల సముదాయం. వాక్యాల సముదాయం ఎంత పెద్దది అయిన కావచ్చును.

మూలాధార చక్రము – మానవ శరీరంలో మెదడు వెన్నెముక వ్యవస్థ క్రింద భాగాన మరియు జననేంద్రియాల నడిమధ్యగ ఉండే శక్తి కేంద్రం.

ఓం – ఇది సంస్కృత భాషలోని పవిత్రమైన అక్షరం లేదా పదం లేదా మంత్రం. విశ్వశక్తి అయిన పరాశక్తి యొక్క శబ్ద స్వరూపం.

పరాశక్తి – పరబ్రహ్మం లేదా భగవంతునితో అనంతమైన విశ్వమంతా వ్యాపించి ఉన్న శక్తి.

ప్రాణమయ కోశం – ఇది  జీవాత్మను కప్పివుంచే నాల్గవ ఆవరణ. ఈ ఆవరణ యందే మానవ శరీరంలో ప్రాణ శక్తులన్నీ కార్యరూపం దాల్చి ఉంటాయి.

ప్రకృతి – విశ్వశక్తి అయిన పరాశక్తి యొక్క స్థూల భౌతిక స్వరూపం. మన కళ్లకు కనిపించే ప్రపంచం.

ప్రాణము – విశ్వమంతా వ్యాపించి ఉన్న పరాశక్తి యొక్క రూపం. దీనివలననే ఈ అనంతమైన విశ్వంలో కదలిక అనేది జరుగుతుంది. మానవ శరీరంలో మనుగడకు అవసరమైన జీవశక్తి కూడా ఇదే.

రజోగుణము – మానవుని మనసులో ఉండే మూడు గుణాలలో ఇది ఒకటి. దీనివలనే సృష్టి రచన సాధ్యమవుతుంది.

సత్వగుణము – మానవుని మనస్సులో ఉండే మూడు గుణాలలో ఇది ఒకటి. దీనివలననే సృష్టి నిరంతరం ధారణ చేయబడుతుంది.

సమాధి – ఏ ఆలోచనలు లేని మనస్సు యొక్క స్థితి. అన్ని యోగసాధనలకు చివరి గమ్యస్థానం. మానవునిలో ఆత్మసాక్షాత్కారానికి ముందు ప్రాప్తించే మానసిక స్థితి.

విశోక – శోకమునకు వ్యతిరేక పదము.

విజ్ఞానమయ కోశం – జీవాత్మను కప్పివుంచే రెండవ ఆవరణ. ఇది కారణ శరీరము పైన ఉంటుంది. బుద్ధి మరియు అహం రెండూ ఈ ఆవరణలో కలిసి ప్రక్క ప్రక్కనే ఉంటాయి. అని ఇంద్రియాల అనుభూతులు మరియు వాటి జ్ఞాపకాలు ఇక్కడే ముద్రించబడి ఉంటాయి.

యోగము – జీవాత్మని పరమాత్మలో కలుపుటకు ఉపయోగించే ప్రక్రియ.

యోగి – ఏదైనా ఒక యోగమార్గంలో సాధన చేసే పురుషుడు.

యోగిని – ఏదైనా ఒక యోగమార్గంలో సాధన చేసే మహిళ.

## శక్తిపాత్ పరంపర యొక్క ఆశ్రమములు

(స్వతంత్రమైనవి మరియు తెలిసినవి)

1. శ్రీ స్వామి సహజానంద తీర్థ, ఆశీర్వాద్ వృద్ధాశ్రమం ట్రస్ట్, నాగసాయి మందిరం వద్ద, కబేళా సెంటర్, ఆర్. ఆర్. నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్, మొబైల్: 9848219240, 9491324964

2. యోగిని రచన, లఖింపూర్ ఖేరి, ఉత్తర ప్రదేశ్, మొబైల్: 945 022 0221

3. యోగిని సుప్రియ, మెల్బోర్న్ బీచ్, ఫ్లోరిడా, అమెరికా, మొబైల్: +1 (321) 960-0445, ఇమెయిల్: supriyavarmakurup@gmail.com

4. యోగిని వర్తిక శుక్ల, గురుగ్రామ్, హర్యానా, మొబైల్: 981 996 2635, ఇమెయిల్: vartikashukla2000@gmail.com

5. గ్రెగరి హాగి, మెల్బోర్న్, విక్టోరియా, ఆస్ట్రేలియా, +61 407 683 465, ఇమెయిల్: ghracer@hotmail.com

6. యోగి వీరేంద్ర, ఘజియాబాద్, ఉత్తర ప్రదేశ్, +91 9999290388, ఇమెయిల్: virendrasfarswan@gmail.com

7. సుజాన్, మోన్జ, ఇటలీ, ఇమెయిల్: sioux.aya@gmail.com

8. అభిషేక్ వశిస్ట్, జైపూర్, రాజస్థాన్, ఇండియా, 91 9079121514, ఇమెయిల్: abhijagriya@gmail.com

9. యోగి గౌతమ్ (సంజీవ్ మిశ్రా) ప్రయాగ్ రాజ్, ఉత్తర ప్రదేశ్, మొబైల్: 9963359922, ఇమెయిల్: yogi.Shaktipāt@gmail.com

10. యోగిని రమ్యాదేవి, బెంగళూరు, కర్ణాటక, మొబైల్: 988 023 9480

11. పునీత్ పరాశర్, దుబాయ్, యు. ఎ. ఇ, మొబైల్: +971 52 867 6684, ఇ మెయిల్: puneetparashar39@gmail.com

12. యోగిని మనీష, రాంచీ, జార్ఖండ్, మొబైల్: 799 110 9595

13. ఎస్. సీడెత్, జోహాన్నెస్ బర్గ్, దక్షిణాఫ్రికా, మొబైల్: +27 83 682 2286, ఇ మెయిల్: juss@mplanet.co.za

14. యోగిని పరమేశ్వరి, జనగావ్, తెలంగాణ, మొబైల్: 970 442 407

15. శ్రీ రవి కుమార్ కౌసిక్, హైదరాబాద్, మొబైల్: 8978611137

16. శ్రీ అజయ్ హమ్ సాగర్, హైదరాబాద్, ఇండియా, మొబైల్: 91 9449824331

17. శ్రీ నాగేశ్వర్ రావు, ఆంధ్రప్రదేశ్, మొబైల్: 8639139422

18. శ్రీ కమలేష్ పాడియా, పూణే, మహారాష్ట్ర, 9765800457, 8530390457

19. నారాయణ్ కుటి సన్యాస్ ఆశ్రమం, టేక్రీ రోడ్, దేవాస్, మధ్యప్రదేశ్ - 455001, 0727 223891/31880, మొబైల్: 9977968108

20. స్వామి విష్ణు తీర్థ్ సాధన్ సేవా న్యాస్, 12-3, ఓల్డ్ పలాసియా, జోపట్ కోటి, ఇండోర్, మధ్యప్రదేశ్ - 452001, 0731 566386/564081, మొబైల్: 9713468347

21. స్వామి శివోం తీర్థ కుండలిని యోగ సెంటర్, దుర్గా మందిర్, కలెక్టర్ బంగ్లా సమీపంలో, ఛింద్వాడ, మధ్యప్రదేశ్ - 480001, 07162 42640

22. స్వామి శివోం తీర్థ ఆశ్రమం, ముఖర్జీ నగర్, రైసన్, మధ్యప్రదేశ్ - 464551, 07482 22294

23. స్వామి శివోం తీర్థ మహాయోగ ఆశ్రమం, ఖారీ ఘాట్, జబల్ పూర్, మధ్యప్రదేశ్ - 482008, 0761 665027

24. దేవాత్మ శక్తి సొసైటీ, 74, నవాలి విలేజ్, పోస్ట్ ధహిసర్ (ముంబ్రా ద్వారా), ముంబ్రా పన్వెల్ రోడ్, థానే జిల్లా, మహారాష్ట్ర - 400612, 022 7411400

25. శివోమ్ కృప ఆశ్రమం ట్రస్ట్, హౌస్ నెంబర్ 28-1463 / 1, తేనె బండ, శివోమ్ నగర్, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్ - 517004, 9440069096, 08572

49048

26. యోగశ్రీ పీట్ ఆశ్రమం, శివానంద్ నగర్, ముని-కి-రేతి, ఋషికేష్, ఉత్తరాఖండ్ - 249201, 0135 430467

27. ఓంకార్ ఆశ్రమం, చిత్తోర్ శసానాగిర్, జునాగడ్, గుజరాత్

28. ఓంకార్ సాధన్ ఆశ్రమం, ఆనంద్, గుజరాత్

29. స్వామి విష్ణు తీర్థ జ్ఞాన సాధన్ ఆశ్రమం, కుబుడు రోడ్, కేడీ గుజ్జర్, గన్నూర్, సోనిపత్ జిల్లా, హర్యానా - 0124 62150/61550

30. విష్ణు తీర్థ సిద్ద మహాయోగ సంస్తానం, శివోమ్ కుటి ఆశ్రమం, కాలేశ్వర్ మందిర్ సమీపంలో, భహదూర్ పూర్ రోడ్, అమల్ నేర్ పోస్ట్, జల్గావ్ జిల్లా, మహారాష్ట్ర - 425401

31. గురు నికేతన్, శివ కాలనీ, డాబ్రా, గ్వాలియర్ జిల్లా, మధ్యప్రదేశ్ - 475110, 07524 22153

32. స్వామి శివోమ్ తీర్ధ్ ఆశ్రమం, రూట్ నెంబర్ 97, పాండ్ ఎడ్డీ, సులివన్ కంట్రీ, న్యూయార్క్, యు.ఎస్.ఎ.

33. స్వామి మహేశ్వరానంద్ తీర్థ, సున్వాహ, రైసన్ జిల్లా, మధ్యప్రదేశ్, 917697648720

# శక్తిపాత్ గురు పరంపర

తెలిసిన చరిత్ర

మహాయోగిని లల్లేశ్వరి

త్రైలోకి బాబా

శ్రీ స్వామి పరమానంద తీర్థ

శ్రీ స్వామి ముకుందానంద తీర్థ

శ్రీ స్వామి గంగాధర తీర్థ

శ్రీ స్వామి నారాయణ్ దేవ్ తీర్థ

1. శ్రీ స్వామి శంకర పురుషోత్తం తీర్థ
   - (a) శ్రీ స్వామి నారాయణ్ తీర్థ
     - (i) శ్రీ స్వామి నారాయణ్ యశ్వంత్ దేఖ్నే
       - (aa) శ్రీ ఐ. న్. ఛటర్జీ
       - (bb) శ్రీ స్వామి ఆత్మానంద తీర్థ
   - (b) శ్రీ స్వామి లోక్‌నాథ్ తీర్థ
     - (i) శ్రీ స్వామి రావు గుల్వానీ
       - (a) శ్రీ స్వామి బ్రహ్మ దత్తాత్రేయ కవీశ్వర్
2. శ్రీ యోగానంద
   - (a) శ్రీ స్వామి ఠాకూర్ మాన్ సింగ్
     - (i) సంత్ యోగి కృపాల్ సింగ్
   - (b) శ్రీ స్వామి దిలీప్ దత్ ఉపాధ్యాయ

(c) మాతా రమాబాయి

(d) శ్రీ స్వామి విష్ణు తీర్థ

(i) శ్రీ స్వామి మాధవ తీర్థ

(ii) శ్రీ స్వామి ఓంకారానంద్

(iii) శ్రీ స్వామి తారకేశ్వరానంద తీర్థ

(iv) శ్రీ రాంప్రకాష్ బ్రహ్మచారి

(v) శ్రీ స్వామి శివోమ్ తీర్థ

(aa) శ్రీ స్వామి పరమానంద తీర్థ

(bb) శ్రీ స్వామి కేవల్ కృష్ణ తీర్థ

(cc) శ్రీ స్వామి గోపాల్ తీర్థ

(dd) శ్రీ స్వామి గోవిందానంద తీర్థ

(ee) శ్రీ స్వామి భాస్కరానంద తీర్థ

(ff) శ్రీ స్వామి సహజానంద తీర్థ

(gg) శ్రీ స్వామి నిత్యబోధానంద తీర్థ

(hh) శ్రీ స్వామి నిజబోధానంద తీర్థ

(jj) శ్రీ స్వామి హరిఓం తీర్థ

(kk) శ్రీ స్వామి శివ మంగళ తీర్థ

(ll) శ్రీ స్వామి శంకర చైతన్య తీర్థ

(mm) శ్రీ స్వామి ఆత్మబోధానంద తీర్థ

(nn) శ్రీ స్వామి చేతన్ విలాస్ తీర్థ

(oo) శ్రీ స్వామి రాధా కృష్ణ తీర్థ

(pp) శ్రీ స్వామి ముక్తానంద తీర్థ

(qq) శ్రీ స్వామి విద్యా తీర్థ

# రచయిత గురించి

రచయిత సైనిక్ స్కూల్ కోరుకొండ, నేషనల్ డిఫెన్స్ అకాడమీ మరియు ఇండియన్ మిలిటరీ అకాడమీ వంటి భారతదేశంలోని కొన్ని ప్రతిష్టాత్మక సంస్థలలో చదివిన పూర్వ విద్యార్థి. రాక్ క్లైంబింగ్ మరియు పర్వతారోహణం వంటి క్రీడలలో ఉన్న ఆసక్తి కారణంగా, పదిహేనేళ్ళ వయసులోనే అతను హిమాలయ పర్వత శ్రేణులు మరియు గంగా నది యొక్క జన్మ స్థానం వైపు ఆకర్షితుడయ్యాడు. రెండు వేల కిలోమీటర్ల అతని సుదీర్ఘ ప్రయాణం పూర్తిగా వేరే ప్రయాణానికి దారితీసింది. అతను ప్రయాణం చేస్తున్న అదే రైలు పెట్టెలోనే హిమాలయ పర్వత శ్రేణులలో తపస్సు చేసుకుంటున్న తన భావి గురుదేవులతో పరిచయం జరిగింది! అతని ప్రయాణం ముందు నుండే లిఖించబడిన విధిరాత అనే విషయం ఆ సమయంలో ఆ బాలునికి తెలియదు! రచయిత ప్రస్తుతం భారత సైన్యంలో సైనికాధికారిగా పనిచేస్తున్నారు. ఆయన శక్తిపాత్ పరంపరలో ఒక పరమ గురువు కూడా! ప్రపంచవ్యాప్తంగా శక్తిపాత్ దీక్షలు ఇస్తున్న గురువులు కొంతమంది స్వయంగా ఆయన శిష్యులే!